www.vishalabharati.com
epaper:vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్
25.02.2024
సంపుటి:2 సంచిక:132

# విశాల భారతి

# దేశానికే "రియల్" లీడర్ హైదరాబాద్



- హైదరాబాద్ అభివృద్ధికి క్రెడాయ్ సహకారం
- మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు అవసరమైన సలహాలకు సిద్ధమే
- బలమైన అభివృద్ధి పునాదులు ఉన్న నగరంలో రియల్‌కు ఢోకా లేదు
- పెరుగుతున్న రెసిడెన్షియల్ డిమాండ్ దృష్ట్యా ఇన్వెంటరీపై ఆందోళన అక్కర్లేదు



# స్పీడు పెంచిన బీజేపీ

- ఢిల్లీ వేదికగా కీలక సమావేశం.. గెలుపునకు ప్రత్యేక వ్యూహాలు
- 5 రాష్ట్రాల కీలక నేతలతో భేటీ.. కిషన్ రెడ్డితోపాటు కీలక నేతలు హాజరు

## త్వరలో బీజేపీ ఎంపీ అభ్యర్థుల జాబితా

- తొలి విడతలో సగం స్థానాలకు.. ఫస్ట్ లిస్ట్ లో 9 స్థానాలు ప్రకటించే చాన్స్
- విబేధాలు భగ్గుమనే అవకాశం .. అమిత్ షాతో బీజేపీ నేతల భేటీ

..మిగతా 2 లో

# వనంలోకి వరాల తల్లులు..

- చిలకల గుట్టకు సమ్మక్క, కన్నెపల్లికి సారక్క
- మేడారం మహాజాతర పరిసమాప్తం
- చివరి రోజు జాతరకు పోటెత్తిన భక్తులు
- జాతర విజయవంతంగా నిర్వహించాం
- రికార్డు స్థాయిలో జాతరకు వచ్చిన భక్తులు
- పంచాయతీరాజ్‌మంత్రి సీతక్క వెల్లడి



# 'ధరణి' దరఖాస్తులకు మోక్షం



- పెండింగ్ అప్లికేషన్లను వెంటనే పరిష్కరించాలి
- మార్చి మొదటి వారంలోనే ఏర్పాట్లు చేయండి
- తహసీల్దార్ ఆఫీసుల్లోనే సమస్యల పరిష్కారం
- మెరుగైన రెవెన్యూ రికార్డుల నిర్వహణకు చట్ట సవరణ
- గత ప్రభుత్వ లోపాలను సీఎంకు వివరించిన అధికారులు
- ధరణి పోర్టల్ ఏజెన్సీపై సమగ్ర విచారణ చేపట్టాలి
- అధికారుల సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

'ధరణి' సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయాల్లోనే వీటిని పరిష్కరించాలని స్పష్టం చేశారు. 'ధరణి' సమస్యల పరిష్కారం, కమిటీ గుర్తించిన అంశాలపై శనివారం సచివాలయంలో చర్చించారు. మార్చి మొదటి వారంలోగా 2.45 లక్షల పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలని రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. దీనిపై విధివిధానాలు రూపొందించాలన్నారు. '2020 ఆర్‌వోఆర్ చట్టం' లోనే లోపాలున్నాయని ధరణి కమిటీ తెలిపింది. ''గత ప్రభుత్వం కేవలం 3 నెలల్లోనే సమగ్ర భూ సర్వే చేసింది. హడావుడిగా చేయడం వల్లే కొత్త చిక్కులు వచ్చాయి. ఆ రికార్డులనే ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకోవటంతో భూముల సమస్యలు, భూముల రికార్డుల వివాదాలు ఎక్కువయ్యాయి. దీంతో లక్షలాది సమస్యలు ఉత్పన్నమయ్యాయి. కనీసం పేర్లలో చిన్న అక్షర దోషాలున్నా సరిదిద్దుకునేందుకు కలెక్టర్ దాకా వెళ్లాల్సి వస్తుంది. దాదాపు 35 మాడ్యుల్స్ ద్వారా ధరణి డేటాలో ఉన్న తప్పులను సవరించుకునేందుకు రెవెన్యూ శాఖ అవకాశం ఇచ్చింది. కానీ ఏ మాడ్యుల్లో దేనికి దరఖాస్తు చేసుకోవాలనే అవగాహన లేకపోవటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.' అని కమిటీ సీఎం దృష్టికి

..మిగతా 2 లో



## యాదాద్రి పవర్ ప్రాజెక్ట్ పనులు

# స్పీడప్ చేయండి

- పాత ప్రభుత్వం పద్ధతులు, ఆలోచనలు మానుకోండి
- లేకపోతే అంచనా వ్యయం పెరిగి ఖజానాకు భారమైతది..
- నిర్లక్ష్యం, ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలను సహించం..
- ప్రాజెక్టు పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకారం
- ఆఫీసర్ల రివ్యూ మీటింగ్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శనివారం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి లతో కలిసి ఆయన హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో నల్గొండ జిల్లా దామరచర్ల మండలంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం ఆఫీసర్లతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. అంతకు ముందుగా థర్మల్ పవర్ స్టేషన్ లో స్థానికుల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ప్రాజెక్టు పురోగతిపై చక్కగా ప్రజెంటేషన్ ఇచ్చినందుకు డిప్యూటీ సీఎం అధికారులను అభినందించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రస్తుతం మంత్రులుగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలకు పూర్తి అవగాహన ఉందని, గతంలో వీరిద్దరూ ఎంపీలుగా ఉన్న సమయంలో ప్రాజెక్టు పురోగతికి కృషి చేశారని వివరించారు. ప్రాజెక్టు పూర్తికి ఇద్దరు మంత్రుల సంపూర్ణ సహకారం తీసుకోవాలని ఆఫీసర్లను ఆదేశించారు. ఇప్పటికే రెండుసార్లు ప్రాజెక్టు అంచనా వ్యయాలు పెంచడంతో బడ్జెట్ భారీగా పెరిగిందని, ప్రభుత్వ ఖజానాపై భారం పడుతుండడంతో ప్రజలకు ఆందోళన కలుగుతుందని వివరించారు. ఈ ప్రాజెక్టును

..మిగతా 2 లో

# బీఆర్ఎస్‌కు బిగ్ షాక్..

- జీహెచ్ఎంసీ ఉప మేయర్ దంపతుల రాజీనామా
- వారితో పాటు ఆరుగురు కార్పొరేటర్లు కూడా..
- నేడు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని ప్రకటన
- కేటీఆర్‌నా భర్తను కలవడానికి కూడా ఇష్టపడలే..
- బీఆర్ఎస్‌లో ఉద్యమకారులకు మనుగడ లేదు
- మీడియా సమావేశంలో శ్రీలత శోభన్‌రెడ్డి

**విశాల భారతి, సిటీ బ్యూరో:**

నగరంలో బీఆర్ఎస్‌కు షాకుల మీద షాకులు తగులుతున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌పార్టీ ఓడిపోవడం.. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోతున్నాయి. గులాబీ పార్టీకి కీలక నేతలు వరుసగా రాజీనామాలు చేస్తున్నారు. నగరంలో మాజీ డిప్యూటీ మేయర్‌బాబా



..మిగతా 4 లో




# గీతక్క మంత్రి వర్గంలో లేకపోవడం ఒక లోటు

..మిగతా 2 లో

- ఆమె యాక్టీవ్ ప్రచారంతోనే నల్గొండలో గెలుపు
- గీతారెడ్డి తల్లి ఈశ్వరీ బాయి వర్ధంతి కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

# గోదాములే అడ్డాగా.. గ్యాస్ రీఫిల్లింగ్ దందా!

- డొమెస్టిక్ నుంచి కమర్షియల్ సిలిండర్ల రీఫిల్లింగ్
- పేదలకు, ఆయిల్ కంపెనీలకు ఏజెన్సీల మోసం
- ఎల్బీనగర్, హయత్‌నగర్ ప్రాంతాల్లో ఇష్టారాజ్యం
- పలు గోదాముల్లోనే యథేచ్ఛగా గ్యాస్ రీఫిల్లింగ్
- ఎన్టీ ఆర్ నగర్, బైరామల్‌గూడలో కుటీర పరిశ్రమ!
- 'మామూలు' గా తీసుకుంటున్న సివిల్ సప్లై ఆఫీసర్లు!




**ఎల్బీనగర్, విశాల భారతి:**

పేద, మధ్య తరగతి ప్రజలకు అందించే సబ్సిడీ వంట గ్యాస్ అక్రమార్కులకు కాసుల వర్షం కురిపి స్తోంది. గ్రేటర్‌హైదరాబాద్‌శివారు ప్రాంతాలైన ఎల్బీనగర్, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో గ్యాస్ రీఫిల్లింగ్ దందా యథేచ్ఛగా సాగుతోంది. ఖాతాదారుల బుకింగ్, విక్రయించడం నుంచి ఏజెన్సీలతోనే అక్రమార్కులు డీల్ కుదుర్చుకునే వరకు దందా విస్తరించినట్లు తెలుస్తోంది. అయితే గ్యాస్‌ఏజెన్సీల నిర్వాహకులే ఈ దందాకు కర్త, కర్మ, క్రియగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. స్వయంగా గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యాలు గోదాములలో మేనేజర్లు, ఆటోల ద్వారా గృహ వినియోగ సిలిండర్ల నుంచి గ్యాస్‌ను కమర్షియల్ సిలిండర్లకు అక్రమంగా రీఫిల్లింగ్ చేస్తున్నారని

..మిగతా 2 లో

ఏయే..గ్యాస్ ఏజెన్సీలు ఈ దందా సాగిస్తున్నాయో.. పూర్తి వివరాలు రేపటి నుంచి.. 'విశాల భారతి'లో వరుస కథనాలు.

# తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా చిన్నారెడ్డి

- అసెంబ్లీ ఎన్నికల్లో వనపర్తి సీటు త్యాగానికి ఫలితం
- ప్రభుత్వంలో కేబినెట్ ర్యాంక్ పదవి దక్కించుకున్న నేత

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

ఉమ్మడి పాలమూరు జిల్లాలో కీలక నేత, మాజీ మంత్రి జి చిన్నారెడ్డి తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. కేబినేట్ ర్యాంక్‌లో చిన్నారెడ్డి ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వనపర్తి నియోజకవర్గం నుంచి చిన్నారెడ్డి పేరును కాంగ్రెస్ పార్టీ మొదట ప్రకటించింది. అయితే టికెట్ ఆశించిన మరో నేత మేఘారెడ్డి తిరుగుబాటుతో చివరి నిమిషంలో అభ్యర్థిని



..మిగతా 4 లో

విశాల భారతి

GENERAL NEWS

జనరల్ న్యూస్

vishalabharathi Telugu Daily

www.vishalabharati.com

epaper:vishalabharati.com

2

ఆదివారం,

25. 02.2024

హైదరాబాద్



## యాదాద్రి పవర్ ప్రాజెక్ట్ పనులు

# స్పీడప్ చేయండి

మొదటిపేజీ తరువాయి

త్వరగా పూర్తి చేయకపోతే మోయలేని భారంగా మారుతుందన్నారు.

ప్రాజెక్టు పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ప్రాజెక్టు ద్వారా స్థానికంగా ఉన్న స్కిల్డ్, అన్ స్కిల్డ్అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించే అంశంపై ఆలోచన చేయాలన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న అన్ స్కిల్డ్ లేబర్ ఎక్కడి నుంచి వస్తున్నారు.. వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు సమాధానం ఇస్తూ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత స్థానికులకే అవకాశాలు కల్పిస్తామన్నారు. త్వరితగతన ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ఒక వ్యవస్థను, ఓ సమర్థమైన అధికారిని నియమించుకోవాలని సూచించారు. రోడ్లు, రైల్వే వంటి పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు సంబంధిత అధికారి మంత్రులతో, ఉన్నత స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటారని సూచించారు. ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేసేందుకు ఓ పాలసీని రూపొందించాలని అధికారులు భావిస్తే అందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. గత ప్రభుత్వం యాదాద్రి, భద్రాద్రి లో థర్మల్ వైపు ముగ్గు చూపిందని అన్నారు. పునరుత్పాదక విద్యుత్తక్కువ ధరకు, కాలుష్యరహితంగా అందుబాటులోకి వస్తుందన్నారు. పాత ప్రభుత్వం ఆలోచనలు, అలవాట్లు పద్ధతులు మార్చుకోకపోతే ప్రాజెక్టు వ్యయం పెరిగి ప్రతి రూపాయి రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా మారుతుందన్నారు. ప్రాజెక్టుకు అవసరమైన ముడి పదార్థాలు అందించేందుకు మైనింగ్ కార్పొరేషన్ సిబ్బంది సిద్ధంగా ఉందన్నారు.

ప్రాజెక్టును పూర్తి చేసేందుకు 24/7 తనతోపాటు సీనియర్ మంత్రులు, అధికార యంత్రాంగం అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. ప్రాజెక్టు పురోగతి పనుల గురించి అధికారులను ప్రశ్నించగా ఏడాది సెప్టెంబర్ లో రెండు యూనిట్ల ద్వారా 1600 మెగావాట్ల విద్యుత్‌ను పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేస్తామని, మార్చి 20 25 నాటికి మొత్తం ఐదు యూనిట్ల ద్వారా నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి తెస్తామని వివరించారు. ప్రాజెక్టు ద్వారా వచ్చే కాలుష్యం, కలుషితనీరు మూలంగా స్థానికులకు ఎదురయ్యే ఇబ్బందులు వాటి పరిష్కారానికి తీసుకునే మార్గాల గురించి డిప్యూటీ సీఎం ఆరా తీశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న నేపథ్యంలో జీరో పర్సెంట్ ధూళి బయటికి వెళ్లకుండా నిర్మాణం జరుగుతుందని వివరించారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే బూడిద ఆధారంగా ఇతర ప్రాంతాల్లో పలు ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయన్నారు.

**ప్రాజెక్టు ఆలస్యానికి కారణమేమిటి?**

**– ఇరిగేషన్‌మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

స్థానికంగా ప్రాజెక్టు నిర్మాణానికి తీసుకున్న రుణాలు వాటి వడ్డీ రేట్ల గురించి ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. కమర్షియల్ బ్యాంకుల కన్నా ఎక్కువ వడ్డీ రేటు ఉంటే దానిని తగ్గించాలని కోరే అవకాశం ఉందని ఎంపీగా పనిచేసిన సమయంలో తనకు ఆ అనుభవం ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రాజెక్టు పనుల్లో ఆలస్యానికి కారణాలను మంత్రి ఉత్తమ్ అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఏ గ్రేడ్ కు చెందిన బొగ్గును వినియోగిస్తారు. ప్రస్తుతం సింగరేణిలో వినియోగిస్తున్న బొగ్గు గ్రేడ్ వివరాలను మంత్రి ఉత్తమ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**ఉద్యోగులకు క్వార్టర్లు ఉన్నాయా?**

**– ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

ప్రస్తుతం ఉద్యోగులకు ఎన్ని క్వార్టర్స్ అందుబాటులో ఉన్నాయి..? ప్రాజెక్టు వినియోగంలోకి వచ్చేసరికి ఎన్ని క్వార్టర్స్ నిర్మిస్తారు అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రశ్నించారు. స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా, సబ్ కాంట్రాక్టులు, ఇతర చిన్న చిన్న పనుల్లో స్థానికులకే అవకాశం కల్పించడం ద్వారా చేయూతనివ్వాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను కోరారు. ప్రాజెక్టు చేపట్టిన నాటి వ్యయం, ఆ తర్వాత రెండు సార్లు పెంచిన అంచనాలను అధికారులు వివరించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ సీఎండి. సయ్యద్ అలీ రిజ్వీ, ట్రాన్స్‌కో డైరెక్టర్ అజయ్, పవర్ ప్లాంట్ సీఈ సమ్మయ్య, నల్గొండ కలెక్టర్ హరి చందన, ఎస్పీ చందనా దీప్తి, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# స్పీడు పెంచిన బీజేపీ

- ఢిల్లీ వేదికగా కీలక సమావేశం
- గెలుపునకు ప్రత్యేక వ్యూహాలు
- 5 రాష్ట్రాల కీలక నేతలతో భేటీ
- కిషన్ రెడ్డితోపాటు కీలక నేతలు హాజరు

విశాలభారతి,స్టేట్ బ్యూరో:

లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా బీజేపీ దూసుకుపోతోంది. వరసగా ఢిల్లీ వేదికగా సమావేశాలు నిర్వహిస్తోంది. మూడోసారి కేంద్రంలో అధికారంలోకి రావడానికి శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తోంది. 543 ఎంపీ స్థానాల్లో ఈ సారి బీజేపీ సొంతగా 375 సీట్లను గెలుచుకోవాలని, ఎన్డీయే కూటమి 400కి పైగా సీట్లను కైవసం చేసుకోవాలని టార్గెట్ పెట్టుకుంది. దీని కోసం వ్యూహాలను రచిస్తోంది. తొలి జాబితానను విడుదల చేసేందుకు బీజేపీ సన్నద్ధమవుతోంది.

ఉత్తర్ ప్రదేశ్‌తో పాటు తెలంగాణ, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలపై బీజేపీ సమావేశాలను శనివారం నిర్వహించింది. ఉత్తర్ ప్రదేశ్‌పై జరిగిన సమావేశానికి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రులు కేశవ్ ప్రసాద్ మౌర్య, బ్రజేష్ పాఠక్ మరియు మంత్రి ధరంపాల్ సింగ్ హాజరయ్యారు. తెలంగాణ విషయానికి వస్తే అమిత్ షా, జేపీ నడ్డాలతో తెలంగాణ ఇంఛార్జులు తరుణ్ చుగ్, చంద్రశేఖర్, సునీల్ బన్సల్‌తో పాటు తెలంగాణ నుంచి కిషన్ రెడ్డి, బండి సంజయ్, కే లక్ష్మణ్, డీకే అరుణ, జితేందర్ రెడ్డి, ఈటెల రాజేందర్ హాజరయ్యారు. ఈసారి గతంలో కంటే అధిక స్థానాలను సాధించేందుకు అవసరమైన వ్యూహాలపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది.

# గోదాములే అడ్డాగా.. గ్యాస్ రీఫిల్లింగ్ దందా!

మొదటిపేజీ తరువాయి

స్థానికులు చెప్తున్నారు. వినియోగదారులను, గ్యాస్ ఆయిల్‌కంపెనీలను మోసం చేస్తూ డొమెస్టిక్ సిలిండర్ల నుంచి గ్యాస్ కమర్షియల్ సిలిండర్లకు మార్చుతూ కోట్లాది రూపాయలు గడిస్తున్నారు. ఎల్బీనగర్, హాయత్‌నగర్‌తో పాటు అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని రెండు గ్రామాల్లో ఉన్న గ్యాస్ గోదాముల్లో స్వయంగా ఏజెన్సీలు రీఫిల్లింగ్ దందాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రామోజీ ఫిలిం సిటీ వద్ద, పెద్ద అంబర్ పేట్ ప్రాంతాల్లో ఈ రీఫిల్లింగ్ దందా జోరుగా నడుస్తున్నట్లు స్థానికులు చెప్తున్నారు. ప్రతి నెల గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మేనేజర్లు సంబంధిత సివిల్ సప్లై ఆఫీసర్లకు మామూళ్లు ముట్టజెప్తుండడంతో వారు ఈ విషయాన్ని మామూలుగా తీసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఏజెన్సీలే 14.5కేజీల డొమెస్టిక్ సిలిండర్లను బల్క్‌గా తీసుకుని.. 19 కేజీల కమర్షియల్‌సిలిండర్లలోకి రీఫిల్లింగ్ చేసి విక్రయిస్తున్నారని తెలుస్తోంది. దీంతో ఆయిల్ కంపెనీలకు వాణిజ్య సిలిండర్ల ద్వారా సమకూరే ఆదాయానికి గండిపడుతోంది. గృహావసర సిలిండర్ ధర ప్రస్తుతం రూ.955, వాణిజ్య సిలిండర్ ధర రూ.1,100గా ఉంది. ఫిల్లింగ్ పైపుల ద్వారా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తూ ఒక్కో సిలిండర్‌పై సుమారు రూ.300 నుంచి రూ.500 వరకు సొమ్ము చేసుకుంటున్నారు. ఇవేకాదు 5 కేజీల సిలిండర్లను




కూడా ఇలాగే రీఫిల్లింగ్ చేసి అమ్ముతున్నారు. ఒక్కో సిలిండర్ రూ.700 నుంచి రూ.800 వరకు విక్రయిస్తూ కోట్ల రూపాయలు గడిస్తున్నారు.

**ఆన్‌లైన్ బుకింగ్ నుంచి సర్దుబాట్లు..**

పేమెంట్ గేట్‌వేల ద్వారా బుక్ చేస్తే 3 రోజుల్లోగా డెలివరీ చేయాలన్న రూల్‌ను కూడా కొన్ని ఏజెన్సీలు పాటించడం లేదు. బుక్ చేసిన 15 రోజులకు డెలివరీ అవడం లేదు. దీన్ని కొందరు సీరియస్‌గా తీసుకుని కంప్లైంట్‌చేసే వరకు వెళ్తే రెండు రోజుల్లో సర్దుబాటు చేస్తామని, ఎవరైనా అడిగితే డెలివరీ అయ్యిందని చెప్పాలంటూ అభ్యర్థిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది.

# వనంలోకి వరాల తల్లులు..

విశాల భారతి, స్టేట్ బ్యూరో:



మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతర వైభవంగా ముగిసింది. భక్తకోటిని ఆశీర్వదించిన మేడారం దేవతలు, జాతర చివరి రోజైన శనివారం వనప్రవేశం చేశారు. ఈ ఘట్టంతో తెలంగాణ కుంభమేళా పరిసమాప్తం అయ్యింది. గిరిజన పూజారులు వరాల తల్లుల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, అక్కడ భక్తులు సమర్పించిన బంగారాన్ని, కొన్ని ముడుపులను సేకరించారు.

అనంతరం ప్రధాన వడ్డెలు ఆయా దేవతలను తీసుకొని వారి వారి నిజ స్థానాలకు తీసుకెళ్లారు. సారమ్మను కన్నెపల్లి ఆలయానికి, సమ్మక్కను చిలకల గుట్టకు, పగిడిద్ద రాజును మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుకొండ్లకు, గోవిందరాజులును ఏటూరు నాగారం కొండాయి గ్రామానికి తరలించారు. అయితే ఈ క్రతువును చూడడానికి లక్షలాది మంది భక్తులు శనివారం ఒక్కరోజే మేడారానికి పోటెత్తారు.

**కోటి 35 లక్షల మంది జనాభా**

**– మంత్రి సీతక్క వెల్లడి**

ఈసారి తెలంగాణ కుంభమేళను కోటి 35 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారని మంత్రి సీతక్క వెల్లడించారు. దీంతో మేడారం జాతర చరిత్రలో సరికొత్త రికార్డ్ నెలకొంది. జాతరకు ముందు నెల రోజుల వ్యవధిలో 55 లక్షల మంది దర్శించుకున్నట్లు తెలిపారు. మేడారం జాతర సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించామని సీతక్క పేర్కొన్నారు. జాతర విజయవంతానికి కృషి చేసిన ప్రజలు, అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జాతరలో వసతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.100కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా తమ వంతు కృషి చేశామని పేర్కొన్నారు. 20 శాఖల అధికారులు జాతర పనుల్లో పూర్తిగా నిమగ్నమయ్యారని సీతక్క తెలిపారు. అలాగే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు శాఖ నిరంతరం పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేసిందన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన రేవంత్ రెడ్డి సర్కార్ సమ్మక్కసారలమ్మ మహాజాతరను ఘనంగా నిర్వహించేందుకు ముందునుంచే కార్యాచరణ అమలు చేసింది. అందులో భాగంగానే ముందుగా పెద్ద మొత్తంలో నిధులు కేటాయించింది. వనదేవతల పండుగ ఆసాంతం భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా మంత్రి సీతక్క ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నాలుగు రోజుల్లో మరింత ఎక్కువమంది అమ్మవార్లను దర్శించుకునే అవకాశం కల్పించేందుకు, అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

మేడారం జాతరకు వచ్చే భక్తులకు ఉపయోగకరంగా ఉండేలా ప్రభుత్వం 'మై మేడారం' యాప్‌ను ముందుగా రూపొందించింది. జాతర కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో టీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 6 వేల ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయటం, అమ్మవార్లను దర్శించుకోవటంలో అశేష భక్తకోటికి ఓ వరంలా మారింది. అంతేకాకుండా జాతర ముగిసే వరకు మేడారం వచ్చిన భక్తుల వాహనాలకు ఎలాంటి టోల్‌తో పాటు పర్యావరణ ఛార్జీల వసూలు చేయకూడదని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాలు, పలువురు భక్తులకు ఉపశమనాన్ని కల్పించాయి. మొత్తంగా తెలంగాణ కుంభమేళాను దిగ్విజయంగా జరిగిట్లు మంత్రి సీతక్క వెల్లడించారు.

నాలుగు రోజుల జాతరలో సమ్మక్క సారక్క దేవతలకు పలువురు ప్రముఖులు మొక్కులు తీర్చుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్ తమిలి సై సౌందర్ రాజన్, స్పీకర్ గడ్డం ప్రసాద్ రావు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, అర్జున్ ముండాతో పాటు రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, విప్ రాంచంద్రనాయక్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఒక్క తెలంగాణ నుంచే కాకుండా.. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్ గఢ్, మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వనదేవతలను దర్శించుకున్నారు. జాతరలో తప్పిపోయిన 1280 మందిని బంధువుల చెంతకు చేర్చినట్లు అధికారులు తెలిపారు.

# గీతక్క మంత్రి వర్గంలో లేకపోవడం ఒక లోటు

- ఆమె యాక్టీవ్ ప్రచారంతోనే నల్గొండలో గెలుపు
- గీతారెడ్డి తల్లి ఈశ్వరీ బాయి వర్ధంతి కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

విశాల భారతి, స్టేట్ బ్యూరో:

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గీతారెడ్డి (గీతక్క) మంత్రివర్గంలో లేకపోవడం ఒక లోటు అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ భాష, సాంస్కృతిక శాఖ, ఈశ్వరీబాయి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో జె.ఈశ్వరీబాయి 33వ వర్ధంతి కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు . ఈశ్వరీబాయి చిత్రపటానికి సీఎం రేవంత్ నివాళులు అర్పించారు. రవీంద్రభారతి ఆవరణలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. ఆ రోజుల్లోనే అంబేద్కర్ స్ఫూర్తిగా రాజకీయాల్లో ఈశ్వరీబాయి తనదైన ముద్ర వేశారని కొనియాడారు. రాజకీయాల్లో రాణిస్తునే గీతారెడ్డిని డాక్టర్ చదివించారని తెలిపారు.ప్రతీ పురుషుడి విజయం వెనకాల ఒక మహిళ ఉన్నట్లు.. గీతక్క ప్రతీ విజయంలో డాక్టర్ సహకారం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమానికి హాజరు కావడం తాను బాధ్యతగా భావించానని అన్నారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గీతారెడ్డి క్రియాశీలకంగా పనిచేస్తున్నారన్నారు. ఆరోగ్య సమస్యలను పక్కనపెట్టి పార్టీ కార్యక్రమాల్లో యాక్టివ్‌గా పనిచేశారని ..అందుకే గీతక్క ఇన్‌చార్జిగా ఉన్న నల్లగొండ జిల్లాలో మెజారిటీ అసెంబ్లీ సీట్లు గెలిచామని తెలిపారు. మంచికి, చెడుకు ఎప్పటికీ తమకు అండగా ఉన్నారని వివరించారు. ఏ అవకాశం ఉన్నా వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



# త్వరలో బీజేపీ ఎంపీ అభ్యర్థుల జాబితా

- తొలి విడతలో సగం స్థానాలకు..
- ఫస్ట్ లిస్ట్ లో 9 స్థానాలు ప్రకటించే చాన్స్
- విబేధాలు భగ్గుమనే అవకాశం
- అమిత్ షాతో బీజేపీ నేతల భేటీ

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణలో బీజేపీ పార్లమెంట్ అభ్యర్థులను ముందే ప్రకటించే అవకాశం, తొలి జాబితాలోనే సగం సీట్లు ఖరారు చేసినట్టు తెలుస్తున్నది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బొక్కబోర్లాపడిన బీజేపీ(BJP) కనీసం పార్లమెంట్ ఎన్నికల్లో అయినా పరువు నిలుపుకునేందుకు తీవ్రంగా కష్టపడుతోంది. కొత్త సీట్ల సంగతి ఎలా ఉన్నా ఉన్నవాటిని కాపాడుకోవడంపై దృష్టి సారించింది. ఇప్పటికే విజయసంకల్ప యాత్ర పేరిట రాష్ట్రవ్యాప్తంగా ఆపార్టీ ప్రచార రథాలు పరుగులెడుతుండగా...అభ్యర్థుల ఎంపికపై కేంద్ర అధిష్ఠానం దృష్టిసారించింది.అభ్యర్థుల జాబితా ఇప్పటికే సిద్ధం కాగా..వీటిపై చర్చించేందుకు నేడు తెలంగాణ నేతలతో అమిత్ షా కీలక భేటీ నిర్వహించనున్నారు.

**బీజేపీ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి చివరి నిమిషం వరకు అభ్యర్థులను తేల్చకపోవడమూ ఓ కారణమని బీజేపీ(BJP) భావిస్తోంది. అభ్యర్థులను ఖరారు చేయకపోవడంతో...ప్రచారానికి ఎక్కువ సమయం లేకుండా పోయిందని ఆ పార్టీ పెద్దలు భావిస్తున్నారు. అందుకే ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థుల జాబితా ముందుగానే ప్రకటించేందుకు కమలదళం కసరత్తు చేస్తోంది. ఆ దిశగా ఇప్పటికే ప్రయత్నాలు మొదలుపెట్టిన రాష్ట్ర నాయకత్వం లోక్ సభ అభ్యర్థుల జాబితాను ఢిల్లీకి పంపింది. ముందుగానే అభ్యర్థుల విషయంలో క్లారిటీ ఇవ్వాలని భావిస్తోంది. ఢిల్లీ అధిష్టానం ఈ ఆశావహుల జాబితాపై చర్చించేందుకు రాష్ట్ర నాయకులను ఢిల్లీకి పిలిపించింది.

**బలబలాలేంటి**

ఢిల్లీలో నేడు తెలంగాణ నేతతలో కేంద్రమంత్రి అమిత్ షా కీలక సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్ర నాయకత్వం పంపిన ఆశావహుల జాబితాపై చర్చించనున్నారు. అభ్యర్థుల బలబాలాలు, సామాజిక వర్గం, ఆర్థికస్థితిగతులు, పార్టీ పరంగా ఉన్న కమిట్ మెంట్ అన్ని అంశాలపైనా చర్చించనున్నారు.

అమిత్ షా నివాసంలో జరిగే ఈ భేటీలో బీజేపీ జాతీయాధ్యక్షులు జేపీ నడ్డా (J.P.Nadda)కూడా పాల్గొననున్నారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి(Kishan Reddy), జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్(Bandi Sanjay), పార్లమెంటరీ బోర్డు సభ్యులు లక్ష్మణ్, తెలంగాణ ఇంచార్జులు తరుణ్ చుగ్, సునీల్ బన్సల్, చంద్రశేఖర్ వారితో పాటు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, నేషనల్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఈటల రాజేందర్ కూడా హాజరయ్యే అవకాశం ఉంది.

**ఒక్కో నియోజకవర్గానికి మూడు పేర్లు**

గత పార్లమెంట్ ఎన్నికల సమయానికి తెలంగాణలో బీజేపీ అంత బలంగా లేకున్నప్పటికీ అనూహ్యంగా 4 పార్లమెంట్ స్థానాలు గెలుచుకుని సత్తా చాటింది. దీంతో తెలంగాణలో పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులజాబితా రోజురోజుకు పెరిగిపోతోంది. ఇప్పటికే ఆశావహుల పేర్లు కేంద్ర అధినాయకత్వానికి చేరగా....నేడు జరిగే సమావేశంలో ప్రతి నియోజకవర్గానికి మూడు పేర్లతో జాబితా రూపొందించనున్నారు. వచ్చేవారంలో జరగనున్న బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశంలో చర్చించి వారిలో ఒకరిని ఫైనల్ చేయనున్నారు. ఈ సమావేశంలోనే దేశవ్యాప్తంగా బీజేపీ పోటీచేయనున్న అభ్యర్థుల తొలి జాబితా విడుదల చేసే అవకాశం ఉంది. వాటిల్లో తెలంగాణ నుంచి సగానికి పైగా అభ్యర్థులు ఉండేలా కసరత్తు చేస్తున్నారు. అభ్యర్థులను ముందుగానే ప్రకటించి తెలంగాణ వ్యాప్తంగా ప్రచారం ముమ్మరం చేసేలా బీజేపీ రాష్ట్ర నాయకత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. తెలంగాణలో అభ్యర్థుల తరపున ఢిల్లీ పెద్దలతోపాటు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం ప్రచారానికి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.



# ప్రజాపాలన అని చెప్పుకుంటూ దాడులా?

- ప్రశ్నించే గొంతుకలపై దాడులు సరికాదు
- పథకం ప్రకారమే జర్నలిస్టు శంకర్‌పై దాడి
- ఇలాంటి దాడులను తెలంగాణ సమాజం ఖండించాలి
- తమ కార్యకర్తలను పోలీసులు వేధిస్తున్నారు
- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

విశాలభారతి,హైదరాబాద్ :

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకలపై దాడులు చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్ అన్నారు. రాష్ట్రంలో నిజంగానే ఇందిరమ్మ రాజ్యం నడుస్తోందన్న సుమన్.. ఇందిరమ్మ రాజ్యం అంటే ఎన్‌కౌంటర్లు.. కాల్చివేతలు అని అన్నారు. తెలంగాణ భవన్‌లో బాల్క సుమన్ మీడియాతో మాట్లాడారు. ప్రశ్నించే గొంతుకలపై ప్రజాపాలన అని చెప్పుకుంటూ దాడులు చేస్తున్నారు. సీనియర్ జర్నలిస్టు శంకర్‌పై దాడి పథకం ప్రకారం జరిగిందన్నారు. ఇలాంటి దాడులను తెలంగాణ బుద్ధి జీవులు, సమాజంలోని అన్ని వర్గాలు ఖండించాలని కోరారు.

**దాడికి ముందు రెక్కీ**

గతంలో చిలుక ప్రవీణ్, రంజిత్, ఆకుల ప్రవీణ్ అనే జర్నలిస్టుల మీద కూడా దాడులు, వేధింపులు జరిగాయని గుర్తు చేశారు. జర్నలిస్ట్ శంకర్ మీద దాడి చేసింది కాంగ్రెస్ కార్యకర్త సాయిరాం రెడ్డి అని సీసీటీవీ ఫుటేజీలో స్పష్టంగా కనిపిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డిని సాయిరాం రెడ్డి కలిశాకే ఈ దాడి జరిగిందని ఆరోపించారు. శంకర్‌పై దాడికి ముందే సాయిరాం రెడ్డి రెక్కీ నిర్వహించాడని, సాయిరాం రెడ్డి హస్తినపురం కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి అనుచరుడు అని సుమన్ తెలిపారు. శుక్రవారం మేడారంలో సీఎం రేవంత్ ముందే భక్తులపై లాఠీ చార్జ్ చేయడాన్ని తప్పుబట్టారు. ఇప్పటి దాకా 2600 మంది బీఆర్ఎస్ కార్యకర్తల మీద అక్రమ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

**పోలీసుల తీరుపైనా విమర్శలు**

పోలీసులు కూడా అతిగా వ్యవహరిస్తున్నారని, తమ వాళ్ళు ఫిర్యాదు చేస్తే చెత్తబుట్టలో వేస్తున్నారని అన్నారు. అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదని.. ఇది పోలీసులు గుర్తు పెట్టుకోవాలి.. మేము అన్ని గమనిస్తున్నాం అని బాల్క సుమన్ తెలిపారు. బీఆర్ఎస్‌కు అనుకూలంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే పోలీసులు ఎందుకు బెదిరిస్తున్నారని సుమన్ ప్రశ్నించారు. రేవంత్‌కు మీడియా పట్ల ఎలాంటి చులకన భావంతో ఉండే వారో ఆయన పాత వీడియోలను బట్టి అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నేతలు హింసాత్మక ధోరణిని మానుకోవాలి అని బాల్క సుమన్ అన్నారు.

# 'ధరణి' దరఖాస్తులకు మోక్షం

విశాలభారతి,హైదరాబాద్ :

తీసుకెళ్లింది. పోర్టల్‌లో లోపాలు సవరించాలంటే చట్ట సవరణ లేదా కొత్త ఆర్‌వోఆర్ చట్టం చేయాలి. వివాదాలు లేకుండా భూరికార్డుల ప్రక్షాళన చేయాల్సి ఉంది'' అని పేర్కొంది. కమిటీ ఫైనల్ రిపోర్ట్‌ఆధారంగా శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. వెంటనే పరిష్కరించాల్సిన సమస్యలపై దృష్టి పెట్టాలని సీఎం రేవంత్ ఆదేశాలు జారీ చేశారు. ధరణిలో ఇప్పుడున్న లోపాలు, సమస్యలన్నీ మరింత లోతుగా అధ్యయనం చేయాలని కమిటీకి సూచించారు. ఎలాంటి భూవివాదాలు, కొత్త చిక్కులు లేకుండా దోషరహితమైన భూముల రికార్డులను నిర్వహించాలని సీఎం అన్నారు. అందుకు అవసరమైన పరిష్కారాలను కూడా అన్వేషించాలని కమిటీని కోరారు. ప్రభుత్వం తీసుకునే తదుపరి నిర్ణయాలతో ఇప్పుడున్న లోపాలకు అడ్డుకట్ట వేయటంతో పాటు కొత్త సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని సీఎం అధికారులను అలర్ట్ చేశారు. ఇప్పుడున్న పెండింగ్ దరఖాస్తుల్లో సాధ్యమైన వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ధరణి పోర్టల్ నిర్వహిస్తున్న ఏజెన్సీపై సమగ్ర విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సీసీఎల్ఏ అధ్వర్యంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా నిర్వహించాల్సిన ఈ పోర్టల్ ను ప్రైవేటు ఏజెన్సీలకు ఎందుకు అప్పగించారని సీఎం ప్రశ్నించారు. రాష్ట్రంలోని లక్షలాది మంది రైతుల భూముల రికార్డులు మొత్తం విదేశీ కంపెనీల చేతుల్లో ఉన్నాయని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. అత్యంత గోప్యంగా ఉండాల్సిన భూముల డేటాను, ఆధార్, బ్యాంకు ఖాతాల వివరాలన్నీ ఏజెన్సీ దగ్గర ఉంచటాన్ని ముఖ్యమంత్రి తప్పు బట్టారు. భూముల రికార్డుల డేటాకు భద్రత ఉందా.. సురక్షితంగా ఉన్నట్టా.. లేనట్టా.. అని అనుమానాలు వ్యక్తం చేశారు. 2018లో టెక్నికల్, ఫైనాన్సియల్ బిడ్డింగ్, అర్హతల ఆధారంగా ఐఎల్ ఎఫ్ఎస్ అనే కంపెనీకి అప్పటి ప్రభుత్వం ధరణి పోర్టల్ డిజైన్ డెవెలప్‌మెంట్ ను అప్పగించిందని అధికారులు బదులిచ్చారు. ఆ కంపెనీ దివాళా తీసిందని, తర్వాత టెర్రాసిస్ అని పేరు మారటం, డైరెక్టర్లు అందరూ మారిపోవటం, తర్వాత వాటాలు అమ్ముకొని ఫాల్కాన్ ఇన్వెస్టెమెంట్ కంపెనీగా చేతులు మారటంపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చ జరిగింది. బిడ్ దక్కించుకున్న కంపెనీ తమ ఇష్టానుసారంగా పేర్లు మార్చుకొని, ఏకంగా కంపెనీలనే మార్చితే ప్రభుత్వం ఎలా అంగీకరించిందని ముఖ్యమంత్రి ఆరా తీశారు. భూముల రికార్డుల డేటాను ఎవరికి పడితే వారికి, విదేశీ కంపెనీలకు కూడా అప్పగించే నిబంధనలున్నాయా.. అని అధికారులను ముఖ్యమంత్రి ప్రశ్నించారు.2018లో రూ.116 కోట్లకు ధరణి టెండర్ దక్కించుకున్న కంపెనీ తమ వాటాలను దాదాపు పన్నెండు వందల కోట్లకు అమ్ముకోవటం విస్మయం కలిగించిందని సీఎం అన్నారు. మన రికార్డులన్నీ వాళ్ల దగ్గరే ఉన్నందున.. విలువైన భూములను పేర్లు మార్చుకోలేదని గ్యారంటీ ఏముందని ప్రశ్నించారు. కొన్ని సందర్భాల్లో అర్ధరాత్రి కూడా భూముల రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఫిర్యాదులు వచ్చాయని, ధరణి పోర్టల్ నిర్వహణపై నియంత్రణ, అజమాయిషీ లేదా.. అని సీఎం రెవిన్యూ అధికారులను ప్రశ్నించారు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ధరణి కమిటీ మెంబర్‌ఎం.కోదండరెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ రేమండ్ పీటర్, అడ్వకేట్ సునీల్, రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ కలెక్టర్ బి.మధుసూదన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉన్నారు.



CREDAI HYDERABAD PROPERTY SHOW

# దేశానికే "రియల్" లీడర్ హైదరాబాద్

## నిర్మాణాత్మకమైన ప్రభుత్వ విధానాలతో రియల్ గ్రోత్

### హైదరాబాద్ అభివృద్ధికి క్రెడాయ్ సహకారం

### మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు అవసరమైన సలహాలకు సిద్ధమే

### బలమైన అభివృద్ధి పునాదులు ఉన్న నగరంలో రియల్‌కు ఢోకా లేదు

### పెరుగుతున్న రెసిడెన్షియల్ డిమాండ్ దృష్ట్యా ఇన్వెంటరీపై ఆందోళన అక్కర్లేదు

**వైవిధ్యమైన వాతావరణం, మెరుగైన మానవ వనరులు, అంతకు మించిన సానుకూలమైన జీవన విధానం, పుష్కళమైన ల్యాండ్ బ్యాంక్ కలిగిన హైదరాబాద్ నగరం గడిచిన 20ఏళ్లుగా దశల వారీగా అభివృద్ధి చెందుతూనే ఉంది. ఈ క్రమంలో అధికారంలో ఉన్న ప్రతి ప్రభుత్వం కూడా హైదరాబాద్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తూనే వచ్చాయి. అలా 2004 నుంచి ఇప్పటివరకు ఐటీ రంగంతోపాటు ఇతర రంగాలతో హైదరాబాద్ పురోగతి ఊహకందని స్థాయిలో ఉన్నత శిఖరాలకు చేరుకుంది. ఇప్పుడు రియల్ వ్యాపారంతోపాటు, అన్ని రంగాల్లో హైదరాబాద్ టాక్ ఆఫ్ ద ఇండియాగా నిలిచిందంటే ఇదంతా ఒక్కరోజులో జరిగిన పురోగతి మాత్రం కాదు. దీని వెనుక బలమైన అభివృద్ధి పునాదులు, ప్రభుత్వ ప్రోత్సహకాలు, పెరుగుతున్న ఉద్యోగ అవకాశాలతోనే అన్ని రంగాలతోపాటు, ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగంలో దేశానికి హైదరాబాద్ రోల్ మోడల్‌గా నిలుస్తోందంటున్న క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ రాజశేఖర్ రెడ్డితో ఈ వారం విశాలభారతి రియల్ టాక్**

**విశాలభారతి, హైదరాబాద్ :**

తెలంగాణ ఏర్పాటు తర్వాత ఐటీ రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ హైదరాబాద్ కేంద్రంగా వరల్డ్ క్లాస్ ఇన్ ఫ్రాతో అప్పటి ప్రభుత్వం డెవలప్ చేసింది. మెరుగైన మౌలిక వసతులు, పరిశ్రమకు అనుకూలమైన వాతావరణం కారణంగా హైదరాబాద్ కేంద్రంగా వేల కోట్ల పెట్టుబడులు ప్రవాహంలా కొనసాగాయి. ఈ తరహాలో సాగుతున్న అభివృద్ధిని కేవలం హైదరాబాద్ నగరానికి పరిమితం చేయకుండా... వికేంద్రీకరణ విధానంలో కొత్త జిల్లాల ఏర్పాటుతో తెలంగాణ వ్యాప్తంగా చేరవేసింది. ఈ క్రమంలో చారిత్రక, పారిశ్రామిక నేపథ్యం ఉన్న హైదరాబాద్ నగరంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా క్రెడాయ్ హైదరాబాద్ నూతన కమిటీ అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. దీంతోపాటు కొత్త ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయడంలోనూ, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగానే ఉన్నాం. ముఖ్యంగా విజన్ - 2050తో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలకు అవసరమైన సూచనలతోపాటు, నిపుణుల సలహాలు, ఇండస్ట్రీ నిపుణులతో హైదరాబాద్ మాస్టర్ ప్లాన్ రూపకల్పనలోనూ తమ వంతుగా ప్రభుత్వంతో కలిసి పనిచేయనున్నాం. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ రంగంలో మానవ వనరుల కొరత కనిపిస్తోంది. భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకుంటే కనీసం 15లక్షల స్కిల్డ్ లేబర్‌కు డిమాండ్ ఉంది. ఈ క్రమంలో రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను పెంచడంతోపాటు, స్థానిక అవసరాలకు అనుగుణంగా స్థానికులలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించడం కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేయనున్నాం. ఇక సుస్థిర పర్యావరణ అనుకూల విధానాలను అమలు చేయడం కోసం క్రెడాయ్ అడుగులు వేస్తోంది. దీని కోసమే ఐజీబీసీ, క్రెడాయ్ ఇండియా మధ్య కీలక ఒప్పందం కూడా కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం రానున్న కాలంలో 4వేల గ్రీన్ కవర్ ప్రాజెక్టులను దేశవ్యాప్తంగా నమోదు చేసేందుకు కృషి చేయనున్నాం. ఇందులో హైదరాబాద్ వాటాయే అత్యధికంగా ఉండనుంది. గ్రీన్ ఇనిషియేటివ్, కూల్ రూఫ్, ఈ మొబిలిటీ, సన్ రూఫ్ పాలసీని రియల్ ఎస్టేట్ రంగంలో సమర్థవంతంగా అమలు చేయడానికి కావాల్సిన బృహత్ కార్యాచరణలతో సిద్ధంగా ఉన్నాం.

**హైదరాబాద్ అభివృద్ధికి బలమైన పునాదులు...**

హైదరాబాద్ అభివృద్ధికి బలమైన పునాదులు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రతి దశలో అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను అమలు అవుతూనే ఉన్నాయి. ఇక సుస్థిరమైన ప్రభుత్వాలతో ఏ రాష్ట్రంలోనైనా అభివృద్ధికి ఆస్కారం ఏర్పడుతుంది. అదే సమయంలో వినూత్నమైన ఆలోచన ధోరణితో అధికారం కొనసాగించే ప్రభుత్వాలు ఉంటే రియల్ ఎస్టేట్‌తోపాటు అన్ని రంగాల్లోనూ సానుకూలమైన వృద్ధి నమోదవుతుంది. ఇన్నాళ్లు అధికారంలో ఉన్న ప్రభుత్వం తరహాలోనే, అంతకు మించిన పురోగతికి కొత్త ప్రభుత్వం కూడా బాటలు వేసే ఆలోచన విధానంతోనే ముందుకు సాగుతుంది. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో మెట్రో విస్తరణ ప్రాజెక్టును చేపట్టినట్లుగా తెలుస్తోంది. ఇప్పటివరకు వచ్చిన పెట్టుబడులు, అందుబాటులోకి రానున్న కంపెనీలు, ఐటీ రంగంలో ఏటా పెరుగుతున్న 1.5లక్షల ఉద్యోగాలు, మెరుగైన జీవనోపాధి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటే హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌కు వచ్చే 15ఏళ్ల వరకు ఎలాంటి ఢోకా ఉండదు. ఇదే సమయంలో ప్రభుత్వం కూడా హౌజింగ్ ఫర్ ఆల్ అనే విధానానికి ప్రాధాన్యతనిస్తే గనుక రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాజెక్టులతో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ మరింత వేగంతో దూసుకుపోతుంది. అయితే లక్షలాది మందికి ఉపాధినిస్తూ, సుమారు 250కిపైగా మాన్యుఫాక్చరింగ్ కంపెనీలకు ఆధారంగా నిలవడంతోపాటు, రాష్ట్రానికి ఆర్థిక వనరులను సమకూర్చే రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రోత్సహించేలా కొత్త ప్రభుత్వం కూడా దిశానిర్దేశం చేస్తుందనే విశ్వాసం ఉంది.

**ఆ జీవోతోనే యూడీఎస్ అమ్మకాలు...**

జీవో నెం. 86 తర్వాత మార్కెట్ క్రమబద్ధీకరణ జరిగింది. 168 జీవో తర్వాత నిర్మాణాత్మకమైన వృద్ధికి ఆస్కారం ఏర్పడి మెరుగైన అనుమతుల విధానంతో దేశానికి రియల్ ఎస్టేట్ రంగంలో హైదరాబాద్ మార్గదర్శకంగా నిలిచింది. అయితే 2019లో తీసుకువచ్చిన జీవో నెం. 50 తర్వాత స్కై రైజ్ భవనాలకు డిమాండ్ వచ్చింది. 20 మీటర్ల సెట్ బ్యాక్ గనుక ఉంటే స్కై ఈజ్ ద లిమిట్ అనే తీరుగా నిర్మాణ చేసుకోవచ్చని చెప్పే ఆ జీవోతో అక్రమాలకు అవకాశం దొరికింది. దీంతో తక్కువ విస్తీర్ణంలోనే ఎత్తైన భవనాలు పెరగడంతో... భూముల ధరలను దృష్టిలో పెట్టుకుని కొంత మంది వ్యాపారులు యూడీఎస్, ప్రీ సేల్ వ్యాపారానికి తెర తీశారు. ఇక్కడే అవకతవకలు జరిగేందుకు అవకాశం ఏర్పడింది. ఈ సమయంలోనే ఇండస్ట్రీ సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని క్రెడాయ్ తెలంగాణ, హైదరాబాద్ ప్రత్యేక కార్యాచరణతో అవగాహన కార్యక్రమాలను చేపట్టింది. దీంతోపాటు అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు రేరా పటిష్టత కోసం ప్రత్యేక దృష్టి సారించడంతో ప్రస్తుతం ఈ తరహా పెడధోరణికి కళ్లెం పడింది. ఇక క్రెడాయ్ ఈ తరహా వ్యాపారానికి పూర్తి వ్యతిరేకం కావడంతో... ప్రస్తుతం నిర్మాణాత్మకమైన మార్కెట్ విస్తరిస్తోంది.



**ఇన్వెంటరీపై ఆందోళన అక్కర్లేదు....**

**హైదరాబాద్ కేంద్రంగా ఇన్వెంటరీ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరమే లేదు. ఎందుకంటే ఏటా పెరుగుతున్న క్రయవిక్రయాలు హైదరాబాద్ గ్రోత్‌కు రియల్ సూచికగా నిలుస్తున్నది. ఈ క్రమంలో పెరుగుతున్న ఇన్వెంటరీ భవిష్యత్తులో వచ్చే డిమాండ్‌ను సమతుల్యం చేస్తుంది. దీని ద్వారా మార్కెట్ కొంతకాలంపాటు సుస్థిరంగా కొనసాగేందుకు అవకాశం ఏర్పడుతుంది. ప్రస్తుతం తీరుగానే పెట్టుబడులు పెరిగి, కంపెనీలు అందుబాటులోకి వచ్చాయంటే క్రమంగా రెసిడెన్షియల్ ప్రాజెక్టులకు డిమాండ్ ఏర్పడుతుంది. నగరం, నగర జనాభా, ఉద్యోగ అవకాశాలు విస్తరిస్తున్నట్లుగానే హైదరాబాద్ కేంద్రంగా కొత్త ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తున్నాయి.**

**క్రెడాయ్ ప్రాపర్టీ షోతో ఈస్ట్ సిటీకి ప్రాధాన్యత...**

క్రెడాయ్ ఆధ్వర్యంలో ఈస్ట్ సిటీలో చేసిన ప్రాపర్టీ షోతో ఆ ప్రాంతంపై అందరీ దృష్టి పడింది. లుక్ ఈస్ట్ పాలసీలో చెప్పిన దాని కంటే వేగంగా స్థానికంగా సోషల్ ఇన్ ఫ్రా అందుబాటులోకి వచ్చింది. ముఖ్యంగా మెరుగైన రవాణా సదుపాయాలు, విద్యా, ఉద్యోగ అవకాశాలతో రెసిడెన్షియల్ వసతులు అభివృద్ధి చెందాయి. దీంతో క్రమంగా ఆ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మొదలైంది. ప్రస్తుతం ఘట్ కేసర్ వరకు విల్లా, రెసిడెన్షియల్ ప్రాజెక్టులు విస్తరించాయంటే క్రెడాయ్ తీసుకున్న ప్రణాళికలే కారణం. ఇక ప్రభుత్వం కూడా కేవలం ఒకే ప్రాంతానికి అభివృద్ధిలో ప్రాధాన్యతనివ్వకుండా నగరం నలువైపులా విస్తరించడం కోసం గ్రిడ్ పాలసీని తీసుకువచ్చింది. దీనికి అనుగుణంగా కొత్తగా పారిశ్రామిక, గృహ సముదాయాలు నగరం చుట్టూరా పెరుగుతున్నాయి. అలా అందుబాటులోకి వచ్చిన వాటిల్లో నార్త్ సిటీలో ఉండే జీనోమ్ వ్యాలీ, ఘట్ కేసర్ దగ్గర ఐటీ పార్కులు, రావిర్యాల నుంచి శ్రీశైలం హైవే మార్గంలో ఎలక్ట్రానిక్, ఐటీ, ఎయిరోస్పేస్ రంగాలు, శంషాబాద్ నుంచి వెస్ట్ సిటీ వరకు రియల్ అనుకూలంగా ఉండగా సుల్తాన్ పూర్, పటాన్ చెరు, ఇస్నాపూర్ వంటి ప్రాంతాలు మెడికల్ డివైజ్ పార్కులు, చందనవెల్లి పారిశ్రామిక వాడలతో నగరం నలువైపులా రియల్ ఎస్టేట్ క్లస్టర్లు అందుబాటులోకి వస్తున్నాయి.

**కొనుగోలుదారులకు సరైన వేదిక...**
**క్రెడాయ్ ప్రాపర్టీ షో**

నిజానికి సొంతింటి కలలను సాకారం చేసుకోవాలని అందరికీ ఉంటుంది. కానీ ఎక్కడా కొనాలి. దీని కోసం ఏ ప్రాంతాన్ని ఎంచుకుకోవాలి. ఎక్కడా అభివృద్ధి కేంద్రీకృతమైంది. ఎక్కడైతే పెట్టిన పెట్టుబడికి భరోసాతోపాటు, ధరల పెరుగుదల ఉంటుందనే విషయాల కోసం ఫుట్ వర్క్ చేస్తే గానీ అవగాహనకు రాలేం. అందుకే కొత్తగా సొంతింటిని కొనుగోలు చేసే వారు ఎలాంటి అయోమయానికి గురి కాకుండా ప్రాపర్టీలను దక్కించుకునేలా క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీలను ఒకేవేదికపై ప్రదర్శిస్తోంది. ఈ వేదిక ద్వారా అన్ని అనుమతులు ఉన్న భవంతులతోపాటు, గ్రీన్ బిల్డింగ్ ప్రాజెక్టులు, మోడ్రన్ బిల్డింగ్స్ చూసి కొనుగోలు చేసేందుకు సరైన వేదిక అవుతుంది. అదేవిధంగా బ్యాంకింగ్ కంపెనీలు కూడా అందుబాటులో ఉంటాయి గనుక కొత్తగా కొనుగోలు చేసేవారిని ఆకట్టుకునేలా బ్యాంకింగ్ సంస్థలు కూడా రాయితీలు, ప్రోత్సాహకాలను పొందే వీలు ఉంటుంది. రేరా, పూర్తి అనుమతులు ఉన్న ప్రాజెక్టులను ప్రదర్శించడం వలన నాణ్యమైన, విశ్వసనీయమైన ప్రాజెక్టులను కొనుగోలుదారులు ఎంచుకునే అవకాశం దొరుకుతుంది.

**ప్రభుత్వ సహకారంతో రియల్ గ్రోత్...**

సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో నూతన ప్రభుత్వం కూడా రియల్ ఎస్టేట్ రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర అభివృద్ధికీ కృషి చేస్తుంది. పెట్టుబడులను ఆకర్షించేలా, మరింత ప్రజారంజకంగా పాలనను అందించడమే లక్ష్యంగా సీఎం రేవంత్ తీసుకుంటున్న చొరవ పరోక్షంగా రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రోత్సహించే విధంగా ఉన్నాయి. ఇటీవల దావోస్ పర్యటనతో దాదాపు రూ. 45 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం ప్రభుత్వ సమర్థత, ప్రణాళికబద్ధమైన పాలనకు నిదర్శనం. అదే విధంగా మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్, నగరం చుట్టూతా ఇండస్ట్రియల్ విలేజీల నిర్మాణం, మెట్రో నిర్మాణం వంటి సమాలోచనలు రియల్ ఎస్టేట్ రంగంలో మరిన్ని పెట్టుబడులను ఆకట్టుకుంటాయి. అదేవిధంగా ఐటీ ఎగుమతులను పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం నుండి వస్తున్న సానుకూల స్పందన, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని తీసుకుంటున్న నిర్ణయాలు హర్షణీయంగా ఉన్నాయి. ఇక రాష్ట్ర అభివృద్ధికీ ప్రభుత్వం అమలు చేసే కార్యాచరణలో తమ వంతుగా సంపూర్ణ సహకారం ఉంటుంది. ముఖ్యంగా శరవేగంగా విస్తరిస్తున్న పట్టణీకరణకు అనుగుణంగా మెరుగైన పట్టణ ప్రణాళికల రూపకల్పనలో అవసరమైన సేవలు అందించేందుకు బాధ్యతయుతంగా వ్యవహరిస్తామని. ప్రభుత్వంతో కలిసి ఇండస్ట్రీ స్టేక్ హోల్డర్లు పనిచేస్తూ రాష్ట్రాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం. సమాజానికి మంచి చేయాలనే ధోరణితోనే క్రెడాయ్ లాంటి సంస్థలు పనిచేస్తున్నాయి. ఇండస్ట్రీ, వినియోగదారులను ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగడమే అత్యుత్తమ విధానం. రాష్ట్రాభివృద్ధికి గత ప్రభుత్వంతో కలిసి పనిచేస్తాం.

# పెట్టుబడికి 'రియల్' గ్యారెంటీ

## రాబడినిచ్చే ప్రధాన మార్గాల్లో ఒకటిగా రియల్ వ్యాపారం

## దేశవ్యాప్తంగా నమోదైన రాబడి తీరుపై వెల్లడైన అధ్యయనం



**విశాలభారతి, హైదరాబాద్ :**

దేశవ్యాప్తంగా ఇటీవల కాలంలో రియల్ ఎస్టేట్ రంగం విపరీతంగా పుంజుకుంటోంది. అన్ని మెట్రో నగరాల్లో శరవేగంగా క్రయవిక్రయాలు జరుగుతుండగా, స్థిరాస్తిపై పెట్టుబడులు రెట్టించినట్లుగా ఆదాయాన్ని ఇస్తున్నాయి. పెద్ద నగరాలతోపాటు సాధారణ నగరాలు, పట్టణాలలోనూ కొనుగోలు చేసిన భూములు, ఇండ్లకు మంచి ధర పలుకుతున్నాయి. ఈ క్రమంలో రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులపై వచ్చిన ఆదాయాన్ని అంచనా వేసిన ఓ అధ్యయనం ప్రకారం మెజార్టీ నగరాల్లో సగటున ధరలు 1015శాతం పెరిగినట్లుగా వెల్లడైంది. అయితే ప్రధాన మెట్రో నగరాల్లో నమోదైన రియల్ ఎస్టేట్ మార్కెట్ ధరల స్థితిగతులు ఈ రంగంపై కొనుగోలుదారులకు భరోసానిచ్చేలా, సురక్షితమైన పెట్టుబడిగా నిలిచాయి.

అత్యంత వేగంగా ఆదాయం, సంపదను పెంచే రంగాల్లో ప్రధాన వనరులలో రియల్ ఎస్టేట్ ఒకటిగా నిలిచింది. వ్యవసాయం, పారిశ్రామిక రంగాలకు ధీటుగా ఏటా ఈ రంగంలో పెట్టుబడులు, ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు పెరుగుతూనే ఉన్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలోనూ రియల్ ఎస్టేట్ ప్రధాన భూమికను పోషిస్తోంది. ఇక రియల్ ఎస్టేట్ రంగంలోని రెసిడెన్షియల్, కమర్షియల్, ఆఫీస్ స్పేస్ వంటి వైవిధ్యమైన విభాగాలు ఆదాయ, ఆర్థిక వనరులుగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా పట్టణీకరణ శరవేగంగా విస్తరిస్తున్న దేశంలో హైదరాబాద్ తరహా మెట్రో నగరాలన్నీ కూడా రియల్ ఎస్టేట్ రంగానికి ప్రాధాన్యతనిస్తున్నాయి. సంపన్న వర్గాలతోపాటుగా సాదాసీదా ఆదాయ వర్గాలకు చెందిన జనాలు కూడా భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఈ రంగంలో ఇన్వెస్ట్ చేస్తున్నాయి. అయితే గత కొంత కాలంగా దేశంలోని పలు నగరాల్లో రియల్ ఎస్టేట్ ధరల పెరుగుదలపై అధ్యయనం ప్రకారం గడిచిన ఏడాది, ఐదేళ్లు, పదేళ్ల కాలంలో పెరిగిన ధరలే ఈ రంగంలో ఆదాయం, పెట్టుబడి పెంచుతాయనడానికి భరోసానిస్తున్నాయి.

**సురక్షితంగా పెరుగుతున్న సంపద**

సంపద పెంచుకునేందుకు ఎన్నో రంగాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటారు. అయితే పెట్టుబడికి పూర్తి స్థాయి సురక్షితమైన రంగాల్లో మాత్రం స్థిరాస్తి ఒకటే నిలుస్తోంది. అయితే స్టాక్ మార్కెట్, ఇండస్ట్రీ తరహాలో పెట్టుబడులను పర్యవేక్షించుకునేందుకు ఎలాంటి ప్రత్యేక నైపుణ్యాలు అవసరం లేకున్నా... పెట్టుబడి మొత్తాన్ని పెంచుకునే అవకాశం ఉండటంతోనే ఇటీవల కాలంలో కొనుగోలుదారుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండగా... ఇదే ఈ రంగానికి అత్యంత డిమాండ్ పెంచుతున్నది. ఇక ఇతర పెట్టుబడి మార్గాలతో పోలిస్తే రియల్ ఎస్టేట్‌లో రిటర్న్స్ కొన్నిసార్లు తక్కువగా ఉన్నప్పటికీ... శాశ్వత, స్టాండర్డ్ పెట్టుబడి సాధనంగానే లాభాలను తెచ్చిపెడుతున్నది. స్థిరాస్తిలో ఒకటి రెసిడెన్షియల్ ఏరియాలో వచ్చే రాబడి కాలక్రమేణా ఆస్తి విలువ కొన్ని సార్లు ద్రవ్యోల్బణాన్ని మించి నమోదైతున్నది. ఇప్పుడు ఉన్న ఆస్తి విలువ కొన్ని నెల్లోనే పెరిగేందుకు ఆస్కారం ఉన్నది.

**పలు నగరాల్లో వచ్చిన రాబడి వివరాలు...**

| నగరం | ఏడాది | ఐదేళ్లు | పదేళ్లు |
|---|---|---|---|
| ముంబై | 7.50-7.60 | 3.0-3.05 | 6.70-6.75 |
| ఢిల్లీ | 14.80-14.85 | 0.45-0.50 | 5.25-5.30 |
| చెన్నయ్ | 2.0-2.05 | 4.90-4.95 | 7.50-7.55 |
| కోల్‌కతా | - | 4.0 | 6.0 |
| బెంగుళూరు | 5. | 6.60 | 9.00 |
| బెంగుళూరు | 0.35-0.4 | 4.15-4.20 | 9.90-9.95 |
| హైదరాబాద్ | 6-7 | 10-11 | 18-22 |

భూముల ధరలు, నిర్మాణంలో ఉపయోగించే మెటీరియల్స్ రేట్లు ఎప్పటికప్పుడు పెరుగుతుండటం కూడా రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులను క్రమంగా పెంచుతూనే ఉన్నాయి.

**మెట్రో నగరాల్లోనూ....**

దేశంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ధరలను ఓసారి పరిశీలిస్తే... మెజార్టీ నగరాల్లో కనిష్టంగా 5 శాతం నుంచి గరిష్టంగా 15శాతం రాబడినిచ్చిన రంగాల్లో రియల్ ఎస్టేట్ నిలుస్తున్నది. అయితే కొన్ని ప్రాంతాల్లో ఊహకందనీ రీతిలో రెండింతలు ధరలు పెరిగినవి కూడా ఉండగా... ఆయా ప్రాంతాల్లో పెరుగుతున్న పారిశ్రామిక పెట్టబడులు, ఉపాధి అవకాశాలతో క్రమంగా పెట్టుబడులను ఆకర్షించే ప్రధాన వనరులలో రియల్ ఎస్టేట్ ముందు వరుసలో ఉంటుంది. అయితే ప్రధాన మెట్రో నగరాల్లో సగటున 1011 శాతం వృద్ధి ఈ రంగంలో ఉందని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా మెరుగైన పారిశ్రామీక విధానాలు, అంతకు మించిన రవాణా సదుపాయాలు, ఉపాధి అవకాశాలు వంటి అంశాలు రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులను వేగంగా ఆకర్షిస్తుండగా... పుష్కళమైన భూ లభ్యత, ఆయా రాష్ట్రాల్లోని ధరలను ప్రభావితం చేస్తున్నాయి.

**హైదరాబాద్ నలువైపులా విస్తరించిన రియల్ వ్యాపారం...**

దేశంలో అత్యంత ఆశాజనకమైన స్థిరాస్తి వ్యాపార కేంద్రాలలో హైదరాబాద్ మహానగరం ఒకటి. విశాలమైన నగర పరిధి, నగరం చుట్టూరా వేలాది ఎకరాల భూములు, 350 కిలోమీటర్ల మేర విస్తరించిన ఔటర్ రింగ్ రోడ్‌తో కోర్ సిటీ అనుసంధానం వలన రియల్ ఎస్టేట్ రంగంలో హైదరాబాద్ రూపురేఖలు మారిపోయాయి. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ఇళ్ల ధరలు గడిచిన ఐదేళ్లలో 1011 శాతం వరకు పెరిగాయి. నగరంలో ఐటీ, బయోటెక్నాలజీ, ఫార్మా పరిశ్రమలకు ప్రాధాన్యతనివ్వడం, ఇంకా పారిశ్రామిక పార్కులు, పెట్టుబడిదారులకు అనుకూల విధానాలు వంటి ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు ఈ రంగంపై సానుకూల ప్రభావం చూపుతుంది. హైదరాబాద్‌లోని అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు లాంగ్ టర్మ్‌లో మంచి రాబడి కోసం చూస్తున్న వారికి లాభదాయక పెట్టుబడి అవకాశాల్ని అందిస్తున్నాయి. వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించే ఐటీ కారిడార్లోని మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపుర్, మియాపూర్, తెల్లాపూర్, కోకాపేట్, నార్సింగి వంటివి ప్రముఖ రియల్ ఎస్టేట్ హాట్‌స్పాట్లుగా అభివృద్ధి చెందాయి. దీంతోపాటు సౌత్ సిటీని ఆనుకుని ఉన్న అంతర్జాతీయ ఎయిర్ పోర్టు దేశీయ ఎగుమతి, దిగుమతులకు ప్రధాన కేంద్రంగా మారింది. ఇక నార్త్ లో ఉన్న జీనోమ్ వ్యాలీ, ఈస్ట్ సిటీ కేంద్రంగా విస్తరించిన ఆదిభట్ల, పోచారం, ఎయిరోస్పేస్ పార్కులతో కమర్షియల్, రెసిడెన్షియల్ ప్రాజెక్టులకు డిమాండ్‌ను పెంచుతూనే ఉన్నాయి.

గమనిక : (ప్రభుత్వ ధరలను ప్రామాణికంగా తీసుకుని రూపొందించిన నివేదిక)



## 'హుజూర్ నగర్' అభివృద్ధి పనుల ప్రారంభం

**ప్రారంభించిన డిప్యూటీ సీఎం, మంత్రులు**

**విశాల భారతి, నల్గొండ:** హుజూర్ నగర్ నియోజకవర్గంలో దాదాపు రూ. 437 .70 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శనివారం ప్రారంభించారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి లతో కలసి ఈ పనులను ఉపముఖ్యమంత్రి ప్రారంభించారు. యాదాద్రి థర్మల్ ప్లాంట్ పరిశీలన అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూర్ నగర్ నియోజకవర్గం పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చింతల పాలెం మండలం దొండపాడు సమీపంలో రూ. 400 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఇన్నోవేర కెమికల్ ఫాక్టరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఇదే మండలంలోని నక్కగూడెంలో సుదీర్ఘ కాలంగా రిపేర్లకు నోచుకోకుండా నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులను మంత్రులు ప్రారంభించారు. రూ.37.70 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పనుల పూర్తితో కిష్టాపురం, చింతిర్యాల, నక్కగూడెం గ్రామాల్లో 3200 ఎకరాల పంట పొలాలకు సాగునీటి సౌకర్యం కలుగుతుంది. ఈ మార్గంలోని కిష్టాపురం గ్రామం వద్ద మిర్చీ తోటలను మంత్రులు పరిశీలించి అక్కడి రైతులు, వ్యవసాయ కూలీలతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమా రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిలు పంటల పరిస్థితులపై చర్చించారు.



## రేవంత్ రెడ్డి 10 ఏళ్ళు సీఎంగా ఉండాలి

- ఓయూ నుండి మేడారం కు యాత్ర
- కాంగ్రెస్ నేత ఓరుగంటి

**సికింద్రాబాద్, విశాలభారతి:** రేవంత్ రెడ్డి మరొక 10 ఏళ్ళు సీఎంగా ఉండాలని కాంగ్రెస్ నేత ఓరుగంటి కృష్ణ ఆధ్వర్యంలో ఓయూ నుండి చేపట్టిన పాదయాత్ర మేడారం చేరుకుంది. వారికి మంత్రి సీతక్క ఘన స్వాగతం పలికి అమ్మవారి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. అనంతరం పాదయాత్ర బృందన్ని సీతక్క సత్కరించారు. కృష్ణ మాట్లాడుతూ.రేవంత్ రెడ్డి మరో 10 యేండ్లు సీఎం గా ఉండి తెలంగాణ ను అన్ని రంగాలలో అభివృద్ధి చేసే క్రమంలో ఎలాంటి ఆటంకాలు రావొద్దని అన్నారు.

## బీఆర్ఎస్‌కు బిగ్ షాక్..

మొదటిపేజీ తరువాయి

ఫసియుద్దీన్‌మొదలుకొని, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ మంత్రులు ఇలా ఒక్కొక్కరుగా 'హస్తం' గూటికి చేరుతున్నారు. తాజాగా జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి దంపతులు శనివారం గులాబీ పార్టీకి రాజీనామా చేసి బిగ్‌షాక్ ఇచ్చారు. వారితో పాటు ఆరుగురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నారు. కీలక నేతల రాజీనామాతో బీఆర్ఎస్ క్యాడర్ అయోమయంలో పడింది.

**ఉద్యమకారులకు మనగడలేకనే..**

కాగా.. డిప్యూటీ మేయర్ దంపతులు గత కొంత కాలంగా బీఆర్ఎస్‌హైకమాండ్‌పై అసంతృప్తితో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరితేనే సరైన ప్రాధాన్యం ఉంటుందని భావించిన నేతలు ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. తమను హై కమాండ్ పట్టించుకోకపోవడంతోనే పార్టీని మారుతున్నట్లు అనుచరుల దగ్గర వారు ప్రస్తావించినట్లు సమాచారం. కొంతమంది కాంగ్రెస్ అగ్ర నేతలు కూడా డిప్యూటీ మేయర్ శ్రీలత దంపతులను కలిసి పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ప్లాన్‌లో భాగంగానే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్ష పదవికి శోభన్ రెడ్డి రాజీనామా చేశారు. ఆదివారం ఉదయం 11 గంటలకు గాంధీభవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపా దాస్మున్షీ సమక్షంలో వారు కాంగ్రెస్‌లో చేరనున్నారు. గులాబీ పార్టీలో ఉద్యమకారులకు మనుగడ లేదంటూ రాజీనామా లేఖలో వారు ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన తర్వాత జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.

**సరైన గుర్తింపు లేదు**

''రేపు కాంగ్రెస్‌లో జాయిన్ అవుతున్నాం. పాతికేళ్లుగా బీఆర్ఎస్ లో ఉన్నాం.. ఉద్యమంలో పోరాటం చేశాం. పార్టీ హై కమాండ్ నుంచి ఆశించిన స్థాయిలో ప్రయారిటీ మాకు దొరకలేదు. పార్టీలో సముచిత స్థానం లేకపోవడంతో మేము మనస్తాపానికి గురయ్యాం. ఎమ్మెల్యే టికెట్ అడిగితే ఇవ్వలేదు.. ఎంపీ టికెట్ ఆశించాం కానీ కుదరదు అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నా భర్త కలిసేందుకు ఇటీవల వెళ్లినా గంట వెయిట్ చేయించారు. మాకు కేసీఆర్ పార్టీలో న్యాయం జరగలేదు.. అందుకే పార్టీ నుంచి వెళ్లిపోతున్నాం. మేము ముందు జీహెచ్ఎంసీ మేయర్ పదవి ఆశించాం.. డిప్యూటీ పదవి ఇచ్చారు.. ఇదొక్కటే ఆనందించాల్సిన విషయం. మా ఆయనకు కాంగ్రెస్ నుంచి మంచి స్థానం కల్పిస్తామని ఆ పార్టీ నేతలు హామీ ఇచ్చారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మేయర్ పదవి ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ పదవి నాదే నేను ఇక్కడే ఉంటాను. మాతో పాటు ఎవరెవరు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతారో మీరే చూస్తారు'' అని శ్రీలత శోభన్ రెడ్డి తెలిపారు.

## తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా చిన్నారెడ్డి

మొదటిపేజీ తరువాయి

మారుస్తూ కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. ఆ సందర్భంలో టికెట్‌ను త్యాగం చేయడంతో పాటు కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు చిన్నారెడ్డి కృషి చేశారు. దీంతో వనపర్తి నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేఘారెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందారు. నాడు సీటు త్యాగం చేసిన సందర్భంలో ఇచ్చిన మాట మేరకు కాంగ్రెస్ పార్టీ చిన్నారెడ్డికి ప్రభుత్వంలో అవకాశం కల్పించింది. మొదట ఎమ్మెల్సీగా చేసి అనంతరం కేబినెట్‌లోకి తీసుకోవడం లేదా రాజ్యసభ అవకాశం కల్పిస్తారని భావించారు. ఈ రెండు కాకుండా కేబినెట్ ర్యాంక్ కల్పిస్తూ రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్‌గా నియామకం చేశారు.



**మూడు సార్లు ఎమ్మెల్యే.. ఒకసారి మంత్రి**

ఉమ్మడి పాలమూరు జిల్లాలో సుపరిచిత నేత చిన్నారెడ్డి. వనపర్తి నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1985లో యువజన కాంగ్రెస్ నేతగా ఉన్న చిన్నారెడ్డి, మొదట టీడీపీ అభ్యర్థి బాలకృష్ణయ్య చేతిలో పరాజయం పాలయ్యారు. 1989లో మళ్లీ పోటీ చేసి బాలకృష్ణయ్యను ఓడించి, తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. అనంతరం 1994లో ఓటమి, 1999, 2004, 2014 ఎన్నికల్లో వరుస విజయం సాధించారు. దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గంలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా చిన్నారెడ్డి పనిచేశారు. పార్టీ ప్రభుత్వంలోకి రావడంతో గత కొంతకాలంగా పదవీ కోసం వేచిచేస్తున్న సీనియర్ నేతకు ఎట్టకేలకు కేబినెట్ ర్యాంక్ పదవితో సెట్ చేశారు. ఇక త్వరలోనే మరిన్ని నామినేటెడ్ పదవుల్లో పార్టీ కోసం పనిచేసిన నేతలకు అవకాశాలు దక్కవచ్చని 'హస్తం' నేతలు భావిస్తున్నారు.

# అయోధ్య సరికొత్త రికార్డ్

- నెల రోజుల్లో 25 కోట్ల ఆదాయం
- ఆన్ లైన్ చెల్లింపుల ద్వారా మరింత ఆదాయం



**విశాలభారతి,నేషనల్ బ్యూరో:** అయోధ్యలో రామ్ లల్లా ప్రాణ ప్రతిష్ఠ తరువాత ములవారి ఆలయానికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. జనవరి 22న రాములోరి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ప్రధాని మోదీ చేతుల మీదుగా జరిగిన విషయం తెలిసిందే. నెల రోజులపాటు ఆలయానికి సమకూరిన విరాళాల వివరాలను ఆలయ ట్రస్ట్ అధికారులు శనివారం వెల్లడించారు. జనవరి 22 నుంచి ఫిబ్రవరి 22 వరకు ఆలయానికి బంగారం, వెండి, చెక్కులు తదితర రూపాల్లో సమకూరిన ఆదాయం విలువెంతో తెలుసా.. అక్షరాలా రూ.25 కోట్లు. ట్రస్ట్ కార్యాలయ ఇన్‌ఛార్జ్ ప్రకాష్ గుప్తా మాట్లాడుతూ.. వివిధ రూపంలో వచ్చిన రూ.25 కోట్ల విరాళాలు హుండీల్లో జమ అయినట్లు తెలిపారు.అయితే ఆన్ లైన్ చెల్లింపుల గురించి తమకు తెలియదని అన్నారు. జనవరి 23 నుంచి ఇప్పటి వరకు 60 లక్షల మంది భక్తులు రామ్‌లల్లా దర్శనం చేసుకున్నారని చెప్పారు. అయోధ్యలో సుమారు 50 లక్షల మంది భక్తులు హాజరయ్యే శ్రీ రామ నవమి పండుగ రోజుల్లో విరాళాలు మరింతగా పెరుగుతాయని ఆలయ ట్రస్ట్ భావిస్తోంది. శ్రీ రామ నవమి సందర్భంగా సమకూరే నగదును లెక్కించేందుకు ఎస్బీఐ నాలుగు ఆటోమెటిక్ కౌంటింగ్ మెషీన్లను ఏర్పాటు చేసిందని గుప్తా వివరించారు.రసీదులను జారీ చేయడానికి ట్రస్ట్ డజను కంప్యూటరైజ్డ్ కౌంటర్లు ఏర్పాటు చేసింది. ఆలయ ప్రాంగణంలో అదనపు విరాళాల పెట్టెలు ఉంచారు. త్వరలో రామాలయం ప్రాంగణంలో అన్ని సౌకర్యాలతో కూడిన కౌంటింగ్ గది నిర్మించనున్నారు.రామ్‌లల్లాకు బహుమతిగా లభించిన బంగారు, వెండి ఆభరణాలు, విలువైన వస్తువులను కరిగించి, నిర్వహించే బాధ్యతను భారత ప్రభుత్వ మింట్‌కు అప్పగించింది. ఎస్బీఐ ట్రస్ట్‌కి మధ్య ఎంవోయూ కుదిరింది. ఒప్పందం ప్రకారం విరాళాలు, సమర్పణలు, చెక్కులు, డ్రాఫ్ట్‌లు, నగదు సేకరణ పూర్తి బాధ్యతను ఎస్‌బీఐ తీసుకుని బ్యాంకులో జమ చేస్తుంది. ఇందుకోసం ఎస్‌బీఐ సిబ్బందిని పెంచింది. నగదును ప్రతి రోజూ రెండు షిఫ్టుల్లో లెక్కిస్తున్నారు.

## మేం బలహీనమైతే మామీద ఎందుకు విమర్శలు

- బీఆర్ఎస్ రిలవెంట్ లేదని కిషన్ రెడ్డి అనడం ఆశ్చర్యకరం
- అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలిచుకున్న సీట్లెన్ని?
- బీఆర్ఎస్ గెలిచిన స్థానాలెన్ని?
- కిషన్ రెడ్డి పార్లమెంటు పరిధిలో ఎన్ని సీట్లు గెలిచారు?
- బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్ రెడ్డి ఫైర్



**విశాలభారతి, హైదరాబాద్:**రాష్ట్రంలో బీఆర్ఎస్ పనైపోయిందంటూ బీజేపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలపై రావుల శ్రీధర్ రెడ్డి మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు రిలవెన్స్ లేదని.. ఒక్కసీటు కూడా గెలవదని వారం రోజులుగా బీజేపీ నాయకులు పదే పదే అంటున్నారని ఆయన సీరియస్ అయ్యారు. మేం బలహీనం అయ్యామని అనుకుంటే.. రోజు మాపై ఆరోపణలు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో రావుల మాట్లాడుతూ.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పార్లమెంటరీ నియోజకవర్గంలోని ఒక్క అసెంబ్లీ సెగ్మెంట్ లోని బీజేపీ గెలవలేదని.. నగరంలో రాజాసింగ్ మినహా ఒక్క సీటు కూడా గెలవలేకపోయారని అన్నారు. అయినప్పటికీ బీఆర్ఎస్ రిలవెంట్ కాదని కిషన్‌రెడ్డి అనడం విచిత్రంగా ఉందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ బలహీనమైతే అసెంబ్లీ ఎన్నికల్లో ఎలా ఓడిపోయావని బండి సంజయ్‌ను ప్రశ్నించారు.బీజేపీ నాయకులు అసలు విజయ సంకల్ప యాత్ర ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి బ్రహ్మాండంగా సాయం చేసి ఉంటే.. సాధారణ ప్రచారంతోనే ఓట్లు రావాలని కదా అని ప్రశ్నించారు. ఖాళీగా ఉంటే రోజూ తన్నుకు చస్తున్నారనే.. ఇలా ఏదో ఒక పనిలో పెడితే కొద్దిగా నయ్యమని యాత్రలు చేయమని అధిష్ఠానం సూచించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. అసలు మీ యాత్రలో మమ్మల్ని తిట్టడం తప్ప రాష్ట్రానికి ఏం తెస్తారు? ఏం చేశారో ఒక్క రోజైనా చెబుతున్నారా? అని రావుల ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో నగరంలో సింగిల్ సీటు సాధించని మీరు మమ్మల్ని విమర్శించడమేంటని మండిపడ్డారు. రెండు జాతీయ పార్టీలతో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని అన్నారు. రాష్ట్రానికి న్యాయం జరగాలని పోరాడేది బీఆర్ఎస్ పార్టీ ఎంపీలు మాత్రమే అని స్పష్టం చేశారు.తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగితే మోదీని ప్రశ్నించగలుగుతారా అని బీజేపీ నేతలను రావుల ప్రశ్నించారు. ఐటీఐఆర్, కోచ్ ఫ్యాక్టరీ, నిమ్స్, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, విభజన హామీలు ఏవీ సాధించలేదని.. మీవల్ల రాష్ట్రానికి ఏం ప్రయోజనం జరిగిందో చెప్పి ఓట్లు అడగాలని బీజేపీ నాయకులను డిమాండ్ చేశారు. పేరులో విజయ సంకల్పం ఉంటే సరిపోదని.. దాంట్లో ప్రజా ప్రయోజనం ఉండాలని విమర్శించారు. ఈ సారి ఎన్నికల్లో గెలిస్తే ఏం చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రాంతీయ పార్టీల రిలవెన్స్ లేదని చెప్పే బీజేపీ నాయకులు ప్రాంతీయ పార్టీలతో పొత్తులెందుకు పెట్టుకుంటున్నారని ప్రశ్నించారు. అసలు ఈసారి ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు మధ్యనే పోటీ అని.. బీజేపీకి గతంలో వచ్చిన నాలుగు సీట్లు మళ్లీ వస్తే గొప్ప అని అభిప్రాయపడ్డారు

## కేసీఆర్ పేరిట నిలువెత్తు బంగారం

- మేడారం అమ్మవార్లకు సమర్పించిన కవిత
- టీయాప్ ఫోలియో ద్వారా అందజేత



**విశాలభారతి,హైదరాబాద్ :**మేడారంలో సమ్మక్క సారలమ్మ జాతర కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేరుతో శనివారం నాడు నిలువెత్తు బంగారాన్ని ఎమ్మెల్సీ కవిత సమర్పించారు. ఆన్‌లైన్‌లో టీ యాప్ ఫోలియో అనే యాప్ ద్వారా కవిత బంగారాన్ని సమర్పించారు.తెలంగాణ ఆత్మగౌరవ పోరాటానికి చారిత్రక ప్రతీకలుగా, ఇలవేల్పులుగా సబ్బండ వర్గాల చేత పూజలందుకుంటున్న మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపిన సంగతి తెలిసిందే. రెండేండ్లకోసారి జరిగే మేడారం జాతర ఆసియా ఖండంలోనే అతిపెద్ద అడవిబిడ్డల జాతరగా తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిందని అన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కొనసాగిన ఆత్మగౌరవ పోరాటంలోనూ సమ్మక్క సారలమ్మ అందించిన స్ఫూర్తి ఇమిడి ఉన్నదని కేసీఆర్ పేర్కొన్నారు. ఒకనాడు కల్లోలిత ప్రాంతంగా నాటి సమైక్య పాలకుల ఏలుబడిలో అలజడులకు గురైన గోదావరి లోయ పరివాహక ప్రాంతం నేడు సాగునీటి జీవజలంతో సస్యశ్యామలమై ప్రజల జీవితాల్లో సాంత్వన నింపిందని అన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి దేశవ్యాప్తంగా తల్లుల దర్శనార్థం కోట్లాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వసతులు కల్పించాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి కేసీఆర్ సూచించారు. తెలంగాణ ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు నిండేలా చూడాలని వనదేవతలను ప్రార్థించారు


A2:anitha


a3:laxmi


A4: prasanna


A5: prahlad


A6: bhanu

## చిన్న పిల్లలను అమ్ముతున్న గ్యాంగ్ అరెస్ట్

**విశాలభారతి,కీసర:** కీసర పోలీసు స్టేషన్ పరిధి అహ్మద్ గూడలో విశ్వసనీయ సమాచారం మేరకు అక్రమంగా చిన్న పిల్లలను అమ్ముతున్న అరుగురిని పట్టుకున్న ఎస్ ఓ టి పోలీసులు.వివరాలు ఈ విధంగా ఉన్నాయి ఒక ఇంటిలో అక్రమ సంపాదన కొరకు చిన్న పిల్లలను అమ్ముతున్నారని సమాచారం రావడంతో, కీసర పోలీసులు ఎస్ ఓ టి పోలీస్ మల్కాజిరి జోన్ మరియు డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ఆఫీసర్ టీం కలిసి ఆ ఇంటిపై దాడి చేసి పట్టుకున్నారు.ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం యాదవవాడ, నంద్యాలకు చెందిన మీసాల ప్రసన్న అను మహిళ తన కొడుకు వెంకట్ లోకేష్ వయస్సు 04 నెలలు ను డబ్బుల కొరకు తన అత్త బాలనరసమ్మ @ లక్ష్మి, సనా,భాను కుమార్, మీసాల ప్రహ్లాద మరియు హెపసిబా అనే మహిళల ద్వారా అహ్మద్ గూడలో హెపసిబా ఇంటి కి వచ్చి తన కొడుకు వెంకట లోకేష్ ని 4,50,000/ రూపాయలకు అమ్ముటకి నిర్ణయించుకున్నారు.విషయం తెలుసుకున్న ఎస్ ఓ టి పోలిసులు వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేయడం జరిగింది.అలాగే రీస్కు చేసిన వెంకట లోకేష్ అను బేబీ బాయ్ ని శిశువిహార్ కి హైదరాబాద్ కి పంపించడం జరిగింది.అనంతరం నింధితులను కీసర పోలీసులకు అప్పగించిన ఎస్ ఓ టి పోలీసులు.

## అందరికీ ఇస్తామని.. కొందరికే అంటే ఎలా?

- అర్హులందరికి రూ.500కే సిలిండర్, ఉచిత విద్యుత్ ఇవ్వాలి
- ఆరు గ్యారంటీలలో 13 హామీలు ఉన్నయ్
- ఎక్కడికక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను నిలదీయాలి
- బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్



**హైదరాబాద్, విశాలభారతి:**కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేస్తుందని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఆరోపించారు. రాష్ట్రంలో 90 లక్షల మందికి తెల్ల రేషన్ కార్డులు ఉంటే, కేవలం 40 లక్షల మందికి మాత్రమే 500 రూపాయల సిలిండర్కు అర్హులంటున్నారని తెలిపారు. శనివారం తెలంగాణ భవన్ లో శ్రవణ్ మీడియాతో మాట్లాడారు. 27వ తేదీ నాడు కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ రెండు గ్యారంటీలు ప్రారంభిస్తారని చెబుతున్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఇచ్చిందని, అందులో 13 హామీలున్నాయి. 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడే వారికి ఉచిత విద్యుత్ అన్నారు. రాష్ట్రంలో కోటి 24 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి ..90 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. రాష్ట్రంలో కోటి 34 లక్షల 48 వేల గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. కోటి ఐదు లక్షల మంది 200 యూనిట్ల లోపే విద్యుత్ వాడుతున్నారు. అందరికీ 200 యూనిట్ల లోపు వాడే విద్యుత్ ను ఉచితంగా ఇవ్వాలన్నారు.

**ఎంత మంది దరఖాస్తు చేశారు?**

ప్రజా పాలన కింద ఎంత మంది 500 కే సిలిండర్ సదుపాయం కోసం దరఖాస్తు చేసుకున్నారో చెప్పడం లేదు. తెల్ల రేషన్ కార్డుల కోసం కొత్తగా ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారో చెప్పడం లేదని అన్నారు. సమ్మక్క సారక్క సాక్షిగా సీఎం రేవంత్ అబద్ధమాడారు. 60 రోజుల్లోనే 25 వేల ఉద్యోగాలు ఇచ్చామని సీఎం రేవంత్ పచ్చి అబద్ధం చెప్పారు. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి కేసీఆర్ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్లు కలిపితే ఎలా? అని ప్రశ్నించారు. ఎక్కడికక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను నిలదీయాలన్నారు.రేవంత్ రాగానే కరెంటు ఇబ్బందులు కరెంటు కోతలకు కొందరు అధికారులే కుట్ర పన్నారని సీఎం రేవంత్ అంటున్నారు. కరెంటు కట్ చేస్తే కొలువులు తీసేస్తా అని కూడా చెప్పారు. కేసీఆర్ హయాంలో కను రెప్ప కొట్టుకునే సమయం కూడా కరెంటు పోలేదు. రేవంత్ రాగానే కరెంటు ఇబ్బందులు ఎందుకు మొదలయ్యాయి. భట్టి సంబంధిత శాఖ మంత్రి ..కరెంటు పోయినందుకు ఆయన్ను కూడా రేవంత్ సస్పెండ్ చేస్తారా? రైతు నోట్లో రేవంత్ మట్టి కొడుతున్నారు. ఆటో డ్రైవర్లు ఇప్పటిదాకా 30 మంది చనిపోయారు. వారి సంక్షేమం కోసం మేనిఫెస్టో లో పెట్టిన అంశాన్ని ఎందుకు అమలు చేయడం లేదు. రైతుల పండించిన పంటకు బోనస్ ఇస్తామన్నారు. తాము రేవంత్ ఇచ్చిన హామీల పైన నిలదీస్తూనే ఉంటామని శ్రవణ్ అన్నారు.




## వైభవంగా పాఠశాల వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



**నూతనకల్, విశాలభారతి:** మండల కేంద్రంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో 32వ వ్యవస్థాపక దినోత్సవ సంబరాలను అత్యంత వైభవంగా పాఠశాల యాజమాన్యం నిర్వహించింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మారగాని వెంకన్న గౌడ్ మాట్లాడుతూ... కేవలం 60 మంది విద్యార్థులతో 1992లో ఈ పాఠశాల ప్రారంభించామని, అప్పటి నుంచి ఇప్పటివరకు తమపై ఎనలేని నమ్మకాన్ని ఉంచి వెన్నంటి నడిచిన తల్లిదండ్రులు, విద్యార్థులు శ్రేయోభిలాషులతోపాటు తమతో కలిసి ప్రయాణం చేసిన టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ వేడుకలలో భాగంగా రకరకాల వేడుకలను జరుపుతూ.. అందులో విద్యార్థులను భాగస్వాములు చేసి వారి పబ్లిక్ స్పీకింగ్ స్కిల్స్, స్టేజి పెర్ఫార్మెన్స్ ని పెంపొందిస్తున్నట్లు చెప్పారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు వీక్షకులందరినీ ఎంతో గానో ఆకర్షించాయి. కార్యక్రమంలో ఎంపీపీ బురెడ్డి కళావతి, జెడ్పిటిసి దామోదర్ రెడ్డి, ఎంఈఓ రాముల్ నాయక్, ఎస్సై సైదులు, మాజీ సర్పంచ్ కరుణశ్రీ గిరిధర్ రెడ్డి పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.



## ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా రాజు నేత



**సికింద్రాబాద్, విశాలభారతి :**భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర ఓబిసి విభాగం నూతనంగా ప్రకటించిన రాష్ట్ర కమిటీలో ఓయూ విద్యార్థి ఉద్యమ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు ఎనుగంటి రాజు నేత కీ చోటు దక్కింది. ఓబిసి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా రాజు నేతను నియమించినందుకు పలువురు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజు నేత మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా తెలంగాణ ఉద్యమంలో భారతీయ జనతా పార్టీ యూత్ వింగ్ విభాగంలో ఏ బాధ్యత అప్పజెప్పిన పూర్తిస్థాయిలో నిర్వహించిన సందర్భంగా పార్టీ మళ్లీ నామీద నమ్మకంతో రాష్ట్ర స్థాయిలో పదవి ఇచ్చినందుకు ఆనందంగా ఉందని అన్నారు. వెనుకబడిన తరగతుల సామాజిక వర్గాలకు సరైన విద్య, వైద్యం, ఉపాధి కల్పన కోసం పోరాటం చేస్తామని, బీసీలకు ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా, రాజకీయంగా అవకాశాలు వచ్చినప్పుడే ఆ సామాజిక వర్గానికి న్యాయం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రస్థాయిలో పదవి బాధ్యతలు అప్పగించినందుకు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖకు మరియు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ధన్యవాదాలు తెలిపారు.

# పవన్ ఎలాంటివాడో కాపులకు అర్థమైంది



- చంద్రబాబు తన కులానికి 21 సీట్లు ఇచ్చుకున్నాడన్న పేర్ని నాని
- కాపులకు హీనంగా 7 సీట్లే ఇచ్చారని వెల్లడి
- పవన్ లెక్కలు చెబుతుంటే మంగళవారం సామెత గుర్తొస్తోందని వ్యాఖ్యలు

**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** టీడీపీతో పొత్తులో భాగంగా జనసేన పార్టీకి 24 అసెంబ్లీ సీట్లు, 3 లోక్ సభ స్థానాలను పవన్ కల్యాణ్ అంగీకరించడం పట్ల వైసీపీ నేతలు విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. తాజాగా, వైసీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పేర్ని నాని కూడా స్పందించారు. సీట్ల పంపకంపై పవన్ చెబుతున్న లెక్కలు చూస్తుంటే మంగళవారం సామెతను తలపిస్తోందని వ్యంగ్యం ప్రదర్శించారు. చంద్రబాబు తన కులానికి 21 సీట్లు ప్రకటించుకున్నారని, కాపులకు మరీ హీనంగా 7 సీట్లు ప్రకటించారని విమర్శించారు. చంద్రబాబు శ్రేయస్సు కోసమే రాజకీయాలు చేసే పవన్ కల్యాణ్ 24 సీట్లతో కాపులకు రాజ్యాధికారం అందిస్తాడా? పవన్ కల్యాణ్ ఎలాంటివాడో కాపులకు ఇవాళ అర్థమైంది... ఇన్నాళ్లూ మమ్మల్ని విమర్శించిన వాళ్లు ఇప్పుడు తల ఎక్కడ పెట్టుకుంటారు? అంటూ పేర్ని నాని వ్యాఖ్యానించారు. ఇక, పవన్ కల్యాణ్ ఎక్కడ పోటీ చేయాలో చంద్రబాబే నిర్ణయిస్తారని అన్నారు

# వైసీపీకి రాజీనామా చేసిన మరో ఎంపీ

- వైసీపీకి రాజీనామా చేసిన రఘురామ
- అధినేత జగన్‌కు లేఖ రాసిన ఎంపీ
- ప్రజల తీర్పు కోరాల్సిన సమయం



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** వైసీపీకి భారీ షాక్ తగిలింది. నర్సాపురం ఎంపీ కనుమూరు రఘురామ కృష్ణరాజు పార్టీకి రాజీనామా చేశారు. వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు X వేదికగా తెలిపారు. రాజీనామాను సీఎం జగన్ మోహన్ రెడ్డికి పంపినట్లు తెలిపారు. తన రాజీనామా లెటర్ ను కూడా ఈ ట్వీట్ లో జత చేశారు.శుక్రవారమే తాను పార్టీకి గుడ్ బై చెబుతానంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు రఘురామ కృష్ణరాజు. రాజీనామాకు ముహూర్తం కూడా ఫిక్స్ చేసుకున్నానని, ఒకట్రెండు రోజుల్లోనే రాజీనామా చేస్తానని తెలిపారు. రాజీనామా చేస్తానని చెప్పిన మర్నాడే పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి.. అందరినీ షాక్ కు గురి చేశారు. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో తాను మళ్లీ పోటీ చేస్తానని, విపక్ష కూటమి నుంచి లోక్ సభ ఎన్నికల బరిలోకి దిగుతున్నట్లు కూడా వెల్లడించారాయన. అయితే ఏ పార్టీ టికెట్ పై బరిలో ఉంటారన్న దానిపై మాత్రం స్పష్టత లేదు. ఫిబ్రవరి 28న టీడీపీ - జనసేన సంయుక్తంగా తాడేపల్లిగూడెంలో జరిగే భారీ బహిరంగ సభలోనూ పాల్గొంటానని తెలిపారు. 2019 ఎన్నికల్లో వైసీపీ తరపున నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచిన రఘురామ కృష్ణరాజుకు.. కొద్దిరోజులకే అధిష్టానం తీరు నచ్చక పార్టీకి దూరంగా ఉంటూ వచ్చారు. సీఎం జగన్ ప్రతి ఆలోచననూ ఆయన ఖండిస్తూనే ఉన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ వైసీపీలోనే ఉంటూ.. రెబల్ ఎంపీగా వైసీపీ పై విమర్శలు గుప్పించారు. పార్టీ హైకమాండ్ తీరు నచ్చకపోవడంతో.. తొలి నుంచి తన వ్యతిరేక స్వరాన్ని వినిపిస్తూ వచ్చారు. చివరకు రాష్ట్రంలో వైసీపీ పాలనపై కేంద్రానికీ ఫిర్యాదు చేశారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వేలెత్తి చూపారు. దీంతో ఆయన్ను నియోజకవర్గంలో తిరగనివ్వమని వైసీపీ శ్రేణులు హెచ్చరించడంతో.. ఢిల్లీ, హైదరాబాద్ కే పరిమితమయ్యారు.

# వైసీపీ లీడర్లకు దిమ్మతిరిగే షాకిచ్చిన వైవీ సుబ్బారెడ్డి

- వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి సంచలన వ్యాఖ్యలు
- వైసీపీ లీడర్లకు షాకిచ్చిన వైవీ వ్యాఖ్యలు
- పక్కా వ్యూహమేనంటున్న రాజకీయ వర్గాలు



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** టీడీపీ, జనసేన ఉమ్మడి జాబితా విడుదలైంది. ఈ లిస్టుపై ఆ పార్టీల్లో అప్పుడే అసమ్మతి స్వరాలు కూడా మొదలయ్యాయి. మరోవైపు.. వైసీపీ నుంచి కూడా సెటైర్లు షురూ అయ్యాయి. ఈ నేపథ్యంలోనే వైసీపీ నేత, రాజ్యసభ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దీంతో ఇప్పటి వరకూ తమదే సీటు అనుకుని ధీమాగా ఉన్న వైసీపీ లీడర్లు గందరగోళానికి గురౌతున్నారు. అధినేత ప్రకటించిన జాబితాల్లో ఇంఛార్జులుగా పేర్లు వచ్చాయని, సంబరపడుతున్న లీడర్లు.. వైవీ సుబ్బారెడ్డి మాటలతో పుసుక్కున్న ఇంత మాట అనేశారేంటీ అని ఆలోచనలో పడ్డారు. అయితే వైవీ సుబ్బారెడ్డి మాటల వెనుక వేరే మర్మం ఉందంటున్నారు రాజకీయ విశ్లేషకులు.టీడీపీ, జనసేన విడుదల చేసిన తొలి జాబితాపై స్పందిస్తూ వైవీ సుబ్బారెడ్డి శనివారం కీలక వ్యాఖ్యలు చేశారు. టీడీపీ మరో 40 స్థానాల్లో అభ్యర్థులను వెతుక్కునే పనిలో పడిందని విమర్శించారు. ఇదే సమయంలో వైసీపీ తరుపున ఇప్పటి వరకూ ప్రకటించిన ఇంఛార్జులు కేవలం సమన్వయకర్తలు మాత్రమేనంటూ సుబ్బారెడ్డి బాంబు పేల్చారు. ఇప్పటివరకూ వైసీపీ విడుదల చేసిన లిస్టులలో పేర్లు వచ్చినవారు కేవలం సమన్వయకర్తలు మాత్రమేనని సుబ్బారెడ్డి తేల్చేశారు. తుదిజాబితాలో పేర్లు ఉన్నవాళ్లు మాత్రమే అభ్యర్థులని సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. సిద్ధం సభ ఆఖరి మీటింగ్ తర్వాత మ్యానిఫెస్టోతో పాటు ఫైనల్ లిస్ట్ విడుదల చేస్తామని క్లారిటీ ఇచ్చారు. అప్పటి వరకూ ఇంఛార్జిలు పార్టీ కోసం నియోజకవర్గంలో సమన్వయం చేస్తారని తెలిపారు. అయితే సుబ్బారెడ్డి వ్యాఖ్యలతో వైసీపీ లీడర్లు అయోమయంలో పడ్డారు. ఇంఛార్జులుగా నియమితులైన తర్వాత వైసీపీ లీడర్లు క్షేత్రస్థాయిలో పని మొదలెట్టేశారు. అసంతృప్తులను కలుపుకుని పోవటం సహా.. ఎన్నికల కోసం ఖర్చు చేయడం కూడా మొదలెట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో ఫైనల్ లిస్టులో పేరుంటేనే సీటు గ్యారంటీ అంటూ వైవీ సుబ్బారెడ్డి చేసిన వ్యాఖ్యలతో నేతలు గందరగోళంలో పడినట్లు తెలుస్తోంది. అయితే వైవీ సుబ్బారెడ్డి మాటల వెనుక రాజకీయ వ్యూహం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. నియోజకవర్గాలకు ఇంఛార్జులుగా ప్రకటించిన నేతలు.. ఈ వ్యాఖ్యలతో సీటు కోసం మరింత శ్రమిస్తారని, నియోజకవర్గంలో ఎక్కువగా తిరిగి బలం పెంచుకుంటారనేది వైసీపీ ఆలోచన అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అలాగే ఇప్పటికే అసంతృప్తితో ఉన్న నేతలు పక్కచూపులు చూడకుండా ఫైనల్ లిస్టు వరకూ ఎదురు చూస్తారనేది కూడా ఓ ఆలోచనగా విశ్లేషకులు చెబుతున్నారు. ఇదే సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు కారణంగా సీట్లు దక్కని బలమైన నేతలను సైతం వైసీపీలోకి ఆకర్షించవచ్చనేది సుబ్బారెడ్డి మాటల వెనుక మర్మమని విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

# చేతి బ్రొటన వ్రేలు కోసం వ్యక్తి దారుణ హత్య

- చేతబడి అనుమానాలు
- ఈపూరు మండలం మాలపాడులో ఘటన
- మృతుడు తులసి నాయక్ గా గుర్తింపు

**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** అతను ఒక సామాన్య రైతు.. ప్రతి రోజూ పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లేవాడు. ఎప్పటిలాగే ఆ రోజు వెళ్లాడు. తిరిగి ఇంటికి మాత్రం రాలేదు. ఏంటా అని ఆరా తీస్తే అతని మృతదేహం ముళ్ల పొదల్లో పడేసి ఉంది. మోటార్ బైక్‌ను దహనం చేశారు. అంతేకాదు.. అతని చేతివేలుకు ఉండాల్సిన బ్రొటన వ్రేలు కూడా లేదు. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టారు. అధునిక యుగంలో చేతబడి అనుమానం అతని ప్రాణాన్ని తీసింది. ఏం జరిగిందో ఎవరూ చంపారో తెలియదు కానీ, అతని వ్రేలు మాయం కావటం వెనుక కచ్చితంగా చేతబడి చేస్తున్నారన్న అనుమానంతో చంపినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఈ దిశగా దర్యాప్తు చేపట్టారు. ఈపూరు మండలం మాలపాడుకు చెందిన తులసీ నాయక్ ఇంటిలో అమ్మవారి పూజ చేస్తాడు. అమ్మవారు తనకు వంటిపైకి వస్తుందని ఆ సమయంలో సమస్యల పరిష్కారం కోసం వచ్చే వారికి తాయత్తులు కూడా వేస్తుంటాడు. అయితే కొద్ది రోజుల క్రితం అతని బంధువు ఒకరు చనిపోయారు. దీంతో తులసీ నాయక్ చేతబడి చేయడంతోనే చనిపోయి ఉంటాడన్న ప్రచారం జరిగింది. మాలపాడులో ఉంటూనే తన స్వగ్రామంలో బోర్లలో నీరు రాకపోవడంతో పక్కనే ఉన్న బొల్లాపల్లి మండలం అగ్ని గుండాలలో మిర్చి పంట వేశాడు. దీంతో ప్రతి రోజూ అక్కడికి వెళ్లి నీరు పెట్టి వస్తుంటాడు. ఈ క్రమంలోనే ఫిబ్రవరి 21వ తేదిన కూడా తులసీ నాయక్ పొలానికి వెళ్లాడు. అయితే తిరిగి రాలేదు. అగ్ని గుండాల సమీపంలోనే తులసీ నాయక్ ను చంపి ముళ్ల పొదల్లో పడేశారు గుర్తు తెలియని దుండగులు. అక్కడికి సమీపంలోనే తులసీ నాయక్ బైక్ ను పెట్రోలు పోసి తగులబెట్టారు. కూలీ పనులు నిమిత్తం వెళ్లిన స్థానికులు ఈ విషయాన్ని పోలీసులకు చెప్పారు. రంగంలోకి దిగిన పోలీసులు పరిసరాలను గమనించి తులసీ నాయక్‌ది హత్యగా నిర్ధారించారు. అయితే తులసీ నాయక్ బ్రొటనవ్రేలు లేకపోవడంతో చేతబడి హత్యగా నిర్ధారించారు. చంపిన తర్వాత బ్రొటన వ్రేలు తీసేస్తే మంత్ర శక్తులు పోతాయన్న నమ్మకంతోనే ఈవిధంగా చేస్తారన్న భావన వ్యక్తం అవుతోంది. దీంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు ప్రారంభించారు. తులసీ నాయక్ భార్యను విచారించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామంటున్నారు పోలీసులు.

# టీడీపీ- జనసేన కూటమి నుంచి ఫస్ట్ లిస్ట్ రిలీజ్

- 99 మంది అభ్యర్థులతో తొలి జాబితా ప్రకటన
- ఊహించని విధంగా ఆ ఇద్దరికీ ఛాన్స్
- జాబితా విడుదల చేసిన పవన్, చంద్రబాబు



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన కూటమి పోటీ చేయబోయే స్థానాలు, అభ్యర్థుల మొదటి జాబితా విడుదలైంది. మొదటి జాబితాలో మొత్తం 118 సీట్లను ప్రకటించారు..అందులో టీడీపీ నుంచి 94 మంది అభ్యర్థులను ప్రకటించగా.. జనసేన 24 అసెంబ్లీ స్థానాల్లో, మూడు పార్లమెంట్ స్థానాల్లోనూ జనసేన పోటీ చేయబోతోంది. అయితే ఇప్పుడు మాత్రం 5 అసెంబ్లీ స్థానాల్లో మాత్రమే జనసేన అభ్యర్థులను ప్రకటించారు పవన్ కల్యాణ్. అసెంబ్లీ టికెట్లు ప్రకటనతో విజయనగరం జిల్లాలో అసమ్మతి సెగలు రాజుకున్నాయి. మొదటినుండి టిక్కెట్లపై ఆశలు పెట్టుకున్న నాయకులు అవకాశం దక్కకపోవడంతో నిరసనలకు దిగారు. గజపతినగరం నియోజకవర్గంలో ఇప్పటివరకు ఇన్‌చార్జిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొండపల్లి అప్పలనాయుడును ప్రక్కనబెట్టి కొండపల్లి శ్రీనివాసరావు అనే కొత్త అభ్యర్థిని ప్రకటించింది టీడీపీ. దీంతో డాక్టర్ కొండపల్లి అప్పలనాయుడు పార్టీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. టికెట్ల ప్రకటన జరిగిన వెంటనే కార్యకర్తలతో సమావేశమయ్యారు. త్వరలో తన భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు. 2006లో బొబ్బిలి ఎంపీగా కొండపల్లి పైడితల్లి నాయుడు ఆకస్మిక మృతితో వచ్చిన ఉప ఎన్నికల్లో పైడితల్లి నాయుడు రాజకీయ వారసుడిగా ఆరంగ్రేటం చేసి ఉపఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు కొండపల్లి అప్పలనాయుడు. ఆ ఎన్నికల్లో స్వల్ప మెజారిటీతో ఓటమి పాలైన కేపే నాయుడు తరువాత 2014లో గజపతినగరం నుండి పోటీచేసి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తరువాత 2019లో ఇదే నియోజకవర్గం నుండి పోటీ చేసి బొత్స అప్పల నరసయ్య చేతిలో ఓటమిపాలయ్యారు. అప్పటినుండి నియోజకవర్గంలో ఇంచార్జిగా కొనసాగుతూ పార్టీ కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొంటూ వచ్చారు. అయితే ప్రస్తుతం కెఏ నాయుడును పక్కనబెట్టిన టీడీపీ అధిష్టానం ఆయన సోదరుడు కొండపల్లి కొండలరావు తనయుడు శ్రీనివాసరావును రానున్న ఎన్నికల్లో బరిలోకి దించుతోంది. ఈ పరిస్థితుల్లో నియోజకవర్గంలో గట్టిపట్టున్న కేఏ నాయుడు తన అన్న కొడుకు శ్రీనివాసరావుకి సహకరిస్తాడా లేక పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తాడా అన్నదీసర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కే ఏ నాయుడు తీసుకునే నిర్ణయంపై టీడీపీ గెలుపోటములు ఆధారపడి ఉన్నాయని అంటున్నారు ఆ పార్టీ కార్యకర్తలు. ఇక్కడ వైసీపీ నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా మంత్రి బొత్స సత్యనారాయణ సోదరుడు బొత్స అప్పల నర్సయ్య పోటీ చేయటంతో ఆయనపై టీడీపీ నుండి కొండపల్లి శ్రీనివాసరావు పోటి చేయడం ఆసక్తిగా మారింది.


ఇక, మరోవైపు నెల్లిమర్ల నియోజకవర్గంలో సైతం అసమ్మతి సెగలు పెల్లుబీకాయి. నెల్లిమర్లలో ఇప్పటివరకు టీడీపీ ఇంచార్జిగా కర్రోతు బంగారు రాజు కొనసాగుతున్నారు. అధిష్టానం పిలుపుతో అనేక పార్టీ కార్యక్రమాలు చేస్తూ వచ్చారు. నియోజకవర్గంలో టీడీపీ రెండుసార్లు మినహా ఎప్పుడూ ఓడిపోయిందీ లేదు. ఇక్కడ టీడీపీకి బలమైన క్యాడర్ ఉంది. అంతేకాకుండా గత ఎన్నికల్లో ఇక్కడి నుండి జనసేన తరుపున పోటీ చేసిన లోకం నాగ మాధవికి కేవలం ఎనిమిది వేల పైచిలుకు ఓట్లు మాత్రమే వచ్చాయి. అంతే కాకుండా తూర్పు కాపు సామాజిక వర్గం అధికంగా ఉన్న నియోజకవర్గం. అయితే అనుహ్యంగా జనసేన పార్టీ అభ్యర్థిగా నాగ మాధవి పేరు తెరపైకి వచ్చింది. ఓసీ సామాజిక వర్గానికి చెందిన లోకం నాగ మాధవికి టికెట్ ఇవ్వటంపై టీడీపీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. ఇంచార్జి బంగారాజు ఇప్పటికే అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాడు.

# అభ్యర్థుల ప్రకటన తర్వాత పవన్ కీలక వ్యాఖ్యలు

- 99 మంది అభ్యర్థులతో టీడీపీ, జనసేన తొలి జాబితా
- జనసేనకు 24 అసెంబ్లీ, 3 లోక్‌సభ సీట్లు
- సోషల్ మీడియాలో జనసైనికుల అసంతృప్తి



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** టీడీపీ, జనసేన శ్రేణులు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న సమయం రానే వచ్చింది. ఓ మంచి ముహూర్తం చూసి... టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేనాని పవన్ కళ్యాణ్ అభ్యర్థులను ప్రకటించారు. మొత్తం 99 మందితో ఉమ్మడిగా తొలి జాబితాను వెల్లడించారు. ఇందులో 94 స్థానాలకు చంద్రబాబు టీడీపీ తరుపున అభ్యర్థులను ప్రకటించగా.. పవన్ కళ్యాణ్ జనసేన తరుపున ఐదు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. అయితే జనసేన పార్టీ 24 అసెంబ్లీ, మూడు లోక్‌సభ స్థానాలలో పోటీ చేయనున్నట్లు పవన్ కళ్యాణ్ వెల్లడించారు. కానీ ఐదు మందితో మాత్రమే జాబితా విడుదల చేశారు. ఈ జాబితాలో నాదెండ్ల మనోహర్, కొణతాల రామకృష్ణ వంటి నేతల పేర్లు ఉండగా.. అధినేత ఎక్కడ పోటీ చేస్తారనే దానిపై ఇంకా క్లారిటీ రాలేదు. అయితే జనసేనకు కేవలం 24 సీట్లు కేటాయించటంపై పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ మండిపడుతున్నారు. పొత్తులో భాగంగా జనసేనకు తగినన్ని సీట్లు రాలేదంటూ సోషల్ మీడియాలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 24 సీట్ల కోసం ఇంత అవసరమా, మరీ ఇంత మంచితనం అవసరమా అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఎక్స్‌లో 24 ఎమ్మెల్యే ట్రెండ్ అవుతోంది. అయితే 24 సీట్లు కేటాయించడంపై అసంతృప్తి వద్దంటూ పవన్ కళ్యాణ్ జనసైనికులకు సూచించారు. పొత్తుల్లో భాగంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం తగ్గాల్సి వచ్చిందన్నారు. కేవలం 24 సీట్లేనా అని అనుకోవద్దని.. విజయంలో 98 శాతం స్ట్రైక్ రేట్ కోసమే ఈ సీట్లు తీసుకున్నట్లు పవన్ కళ్యాణ్ వెల్లడించారు. 24 అసెంబ్లీ సీట్లతో పాటు.. 3 పార్లమెంట్ సీట్లను కూడా కలుపుకుంటే.. మొత్తంగా రాష్ట్రం లోని 40 నియోజక వర్గాల్లో జనసేన పోటీ చేస్తున్నట్లేనని పవన్ చెప్పారు.చాలామంది పెద్దలు, పార్టీ నేతలు 40 నుంచి 50 చోట్ల పోటీ చేయాల్సిందేనని తనతో చెప్పారని పవన్ కళ్యాణ్ గుర్తు చేసుకున్నారు. అయితే 2019 ఎన్నికల్లో జనసేన కనీసం పది సీట్లైనా గెలుచుకుని ఉంటే ఇప్పుడు ఎక్కువ సీట్లను అడిగి తీసుకునే అవకాశం ఉండేదని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు. జనసేన పోటీ చేసే 24 సీట్లను కేవలం నంబర్ గానే చూడొద్దని.. 98 శాతం స్ట్రైక్ రేట్ ఉండాలనే ఉద్దేశంతోనే టీడీపీ ఆఫర్ చేసిన 24 సీట్లతో సర్దుకుపోతున్నామని వివరించారు.



# టీడీపీ, జనసేన జాబితాపై వైసీపీ సెటైర్లు


- పవన్‌పై రోజా తీవ్ర వ్యాఖ్యలు
- పావలా సీట్లు కూడా తెచ్చుకోలేకపోయారన్న రోజా
- పవన్ కళ్యాణ్ టీడీపీ ఉపాధ్యక్ష పదవి తీసుకోవాలన్న సజ్జల

**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** అసెంబ్లీ ఎన్నికల కోసం టీడీపీ జనసేన ఉమ్మడిగా అభ్యర్థుల జాబితా విడుదల చేశాయి. 99 మందితో ఫస్ట్ లిస్టు రిలీజ్ చేశాయి. ఇక పొత్తులో భాగంగా జనసేన కోసం 24 సీట్లు కేటాయించగా.. ఐదు స్థానాలకు పవన్ కళ్యాణ్ అభ్యర్థులను ప్రకటించారు. అయితే జనసేనకు కేవలం 24 సీట్లేనా అంటూ సోషల్ మీడియాలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. జనసైనికులు, పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ దీనిపై మండిపడుతున్నారు. ఇదే క్రమంలో అధికార వైసీపీ సైతం టీడీపీ, జనసేన ఉమ్మడి జాబితాపై విమర్శలు ప్రారంభించింది. మంత్రి రోజా, ఏపీ ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి.. టీడీపీ, జనసేన తొలి జాబితాపై కీలక వ్యాఖ్యలు చేశారు. తిరుపతిలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడిన మంత్రి రోజా.. పవన్ కళ్యాణ్ మీద, జనసేన మీద సెటైర్లు వేశారు. పావలా సీట్లు కూడా తెచ్చుకోలేకపోయిన పవన్ కళ్యాణ్.. పార్టీ ఎందుకు పెట్టారో ఆయనకే తెలియాలంటూ ఎద్దేవా చేశారు. అభ్యర్థుల ప్రకటనపై టీడీపీ , జనసేన కార్యకర్తలు ఏడుస్తున్నారన్న రోజా.. పవర్ షేరింగ్, సీట్ షేరింగ్ అని చెప్పిన పవన్ కళ్యాణ్.. పావలా షేర్ కూడా తెచ్చుకోలేకపోయాడంటూ ఎద్దేవా చేశారు. కుక్క బిస్కెట్లు వేస్తే తోక ఊపినట్లు.. చంద్రబాబుతో పవన్ కళ్యాణ్ ప్రెస్ మీట్ పెట్టారని విమర్శలు చేశారు.

"24 సీట్లే చాలని పవన్ కళ్యాణ్ ఎందుకు తల ఊపారో? ఏ ప్యాకేజీ కోసం 24 సీట్లకు తల వంచారో ఆయనే చెప్పాలి. పవర్ స్టార్ కాస్తా పవర్ లేని స్టార్ అయ్యారు. ఎవరితో పొత్తుపెట్టుకోవాలో తెలియని గందరగోళంలో ఆ పార్టీలు ఉన్నాయి. 118 సీట్లు ప్రకటించినా ఇంకా గందరగోళం ఉంది. కనీసం పవన్ కళ్యాణ్ ఎక్కడి నుంచి పోటీ చేయాలనే విషయంలోనూ క్లారిటీ లేదు. రాష్ట్రం విడిపోయాక చంద్రబాబుకు అధికారం ఇస్తే రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు. ఇప్పుడు రాష్ట్ర భవిష్యత్ కోసం పొత్తు అంటే ప్రజలు నవ్వుకుంటున్నారు".. అని రోజా అన్నారు. మరోవైపు జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను చూస్తే జాలేస్తోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. జనసేన అభ్యర్థులను కూడా చంద్రబాబు డిసైడ్ చేస్తారా అంటూ సెటైర్లు వేశారు. ఎన్నికల్లో చంద్రబాబు పడేసే సీట్లు తీసుకునే స్థాయికి పవన్ కళ్యాణ్ పడిపోయారని.. టీడీపీ ఉపాధ్యక్ష పదవి తీసుకుంటే సరిపోతుందంటూ సెటైర్లు గుప్పించారు.

# సీనియర్లకు చంద్రబాబు ఝలక్

- 94 మందితో టీడీపీ తొలి జాబితా
- అనూహ్యంగా సీనియర్లకు దక్కని స్థానం
- గంటా, దేవినేని, గోరంట్ల, కళా వెంకట్రావుకు దక్కని చోటు



ఆంధ్రప్రదేశ్, విశాలభారతి: టీడీపీ, జనసేన అభ్యర్థుల తొలి జాబితా రిలీజైంది. అయితే జాబితాలో చాలా మంది టీడీపీ సీనియర్ నేతల పేర్లు కనిపించపోవటం చాలా మందిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సీనియర్ నేతలను చంద్రబాబు పక్కనపెట్టారా.. లేదా ఆయా స్థానాలు పొత్తుల్లో భాగంగా ఇతర పార్టీలకు వెళ్లే అవకాశం ఉందా అనేది అంతు బట్టకుండా ఉంది. టీడీపీ సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రస్తుతం రాజమండ్రి రూరల్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. అయితే పొత్తులో భాగంగా ఈ సీటు జనసేనకు వెళ్తుందని.. జనసేన నుంచి కందుల దుర్గేష్ పోటీచేస్తారనే ప్రచారం నడుస్తోంది. ఈ క్రమంలోనే ఈ సీటుపై ఎలాంటి క్లారిటీ రాలేదు. అయితే కందుల దుర్గేష్‌కు వేరే చోట టికెట్ కేటాయించి.. గోరంట్లకే రాజమండ్రి రూరల్ టికెట్ ఇస్తారని తెలుగు తమ్ముళ్లు విశ్వాసంతో ఉన్నారు. ఇక మరో నేత మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు పేరు సైతం జాబితాలో కనిపించలేదు. 2019 ఎన్నికల్లో దేవినేని ఉమా మైలవరం నుంచి పోటీ చేసి వైసీపీ అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్ చేతిలో ఓటమి పాలయ్యారు. అయితే వసంత కృష్ణ ప్రసాద్ సైతం టీడీపీ వైపు చూస్తున్న నేపథ్యంలో.. మైలవరం సీటుపైనా, దేవినేని ఉమాపైనా చంద్రబాబు క్లారిటీ ఇవ్వలేదు. మరోవైపు దేవినేని ఉమాను పెనమలూరు నుంచి బరిలో దింపాలనే ఆలోచనలోనూ అధిష్టానం ఉన్నట్లు సమాచారం. ఇక జాబితాలో లేని మరో కీలక నేత గంటా శ్రీనివాసరావు. మాజీ మంత్రి గంటా ఇప్పటి వరకూ పోటీ చేసిన ప్రతిచోటా విజయం సాధిస్తూ వచ్చారు. ప్రతి ఎన్నికల్లోనూ నియోజకవర్గం మారుతూ విజయం సాధిస్తూ వస్తున్నారు గంటా శ్రీనివాసరావు. అయితే ఈసారి గంటాను విశాఖ నుంచి కాకుండా విజయనగరం జిల్లా చీపురుపల్లి నుంచి మంత్రి బొత్స సత్యనారాయణ మీద బరిలో నిలపాలని టీడీపీ అధిష్ఠానం భావించింది. అయితే విశాఖ పట్నం జిల్లా నుంచే పోటీచేస్తానని.. చీపురుపల్లి వెళ్లడం ఇష్టం లేదని అధిష్ఠానానికి గంటా తేల్చిచెప్పారట. దీంతో మరోసారి గంటాను విశాఖ నార్త్ నుంచి పోటీ చేయిద్దామా లేదా... ఉమ్మడి విశాఖ జిల్లాలోని మరో స్థానంలో నిలుపుదామా అనే సంధిగ్ధంలో టీడీపీ అధినేత ఉన్నట్లు సమాచారం. ఇక నెల్లూరు జిల్లాకు సంబంధించి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఎప్పటి నుంచో పార్టీలో కొనసాగుతున్నారు. సర్వేపల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేసే సోమిరెడ్డికి తొలి జాబితాలో చోటు దక్కలేదు. అలాగే వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ఆనం రామనారాయణ రెడ్డి పేరు కూడా తొలి జాబితాలో కనిపించలేదు. ఇక ఏపీ టీడీపీ మాజీ చీఫ్‌గా పనిచేసిన కిమిడి కళా వెంకట్రావు, గుంటూరు జిల్లాలో యరపతినేని శ్రీనివాసరావు పేర్లు కూడా ఫస్ట్ లిస్టులో లేవు. అలాగే చింతమనేని ప్రభాకర్, కొమ్మాలపాటి శ్రీధర్, కందికుంట ప్రసాద్, మాజీ మంత్రులు పల్లె రఘునాథరెడ్డి, కేఎస్ జవహర్ పేర్లు కూడా జాబితాలో లేకపోవటంతో వీరి భవిష్యత్తు ఏంటనేది తెలియడం లేదు. తొలి జాబితాలో చోటు దక్కని వీరికి మలిజాబితాలో చోటు దక్కుతుందా.. అధినేత మనసులో ఏముందనేది అంతుబట్టకుండా మారింది. మరోవైపు తెనాలి సీటు జనసేనకు కేటాయించడం.. అక్కడి నుంచి జనసేన తరుపున నాదెండ్ల మనోహర్ పోటీ చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించడంతో అక్కడి టీడీపీ నేత ఆలపాటి రాజా పరిస్థితి ఏంటనేది తెలియడం లేదు. ఆయన రాజకీయ భవిష్యత్తుపైనా సందేహాలు నెలకొన్నాయి. ఇక విజయవాడ వెస్ట్ టికెట్ కావాలంటూ చంద్రబాబుకు రక్తాభిషేకం చేసిన బుద్ధా వెంకన్న పేరుతో సైతం తొలి జాబితాలో కనిపించలేదు.





# రాష్ట్రంలో ఉచిత బస్సు ప్రయాణం

- ఏపీలోనూ ఉచిత బస్సు ప్రయాణం
- ఏపీఎస్ ఆర్టీసీ కీలక నిర్ణయం
- ఆ పత్రం ఒకటి సరిపోతుందన్న ఆర్టీసీ

**ఆంధ్రప్రదేశ్,విశాలభారతి:** తెలంగాణలో ఉచిత బస్సు ప్రయాణం విజయవంతంగా నడుస్తోంది. తెలంగాణలో అధికారంలోకి రాగానే రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు మహాలక్ష్మి పథకం పేరిట ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలుచేస్తోంది. ఇక ఈ పథకం కారణంగా ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ పెరిగిందని కూడా అందరికీ తెలిసిందే. బస్సులో తిరిగే వారి సంఖ్య పెరగడం, జీరోటికెట్ల డబ్బులను ఆర్టీసీకి ప్రభుత్వమే చెల్లిస్తుండటంతో అటు ఆర్టీసీ, ఇటు మహిళలు సంతోషంలో ఉన్నారు. అయితే ఏపీలోనూ ఇలాంటి పథకం తేవాలని అప్పట్లో చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో తాము అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని టీడీపీ ఇప్పటికే హామీ కూడా ఇచ్చింది. కానీ అంతకుముందే ఏపీలో ఉచిత బస్సు ప్రయాణం అమలు కానుంది. ఏపీలోనూ ఉచితంగా బస్సులో ప్రయాణించవచ్చు. అయితే మీరు అనుకున్నట్లు అది మహిళలకు కాదండోయ్. విద్యార్థులకు మాత్రమే. వచ్చే మార్చి నెలలో ఆంధ్రప్రదేశ్‌లో పది, ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో టెన్త్, ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థుల కోసం ఏపీఎస్ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షలు రాసే విద్యార్థులు తమ హాల్ టికెట్ చూపించి.. పరీక్షా కేంద్రాలకు ఉచితంగా వెళ్లేలా ఏర్పాట్లు చేసింది. ఈ విషయాన్ని ఏపీఎస్ ఆర్టీసీ ఓ ప్రకటనలో పేర్కొంది. విద్యార్థులు తమ హాల్ టికెట్ చూపించి.. ఎగ్జామ్ సెంటర్ల వరకూ ఉచితంగా వెళ్లవచ్చనీ.. పరీక్ష పూర్తైన తర్వాత ఇళ్లకు రావచ్చని ఏపీఎస్ ఆర్టీసీ ఓ ప్రకటనలో వెల్లడించింది. అయితే ఈ ఉచిత బస్సు ప్రయాణం పల్లె వెలుగు. సిటీ ఆర్డినరీ సర్వీసులకు మాత్రమే వర్తిస్తుందని ఏపీఎస్ ఆర్టీసీ తెలిపింది. విద్యార్థులు తమ హాల్ టికెట్ చూపించి.. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చని ప్రకటించింది. మరోవైపు ఏపీలో ఈ ఏడాది పది, ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థుల సంఖ్య సుమారు 16 లక్షల వరకూ ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే మార్చి ఒకటో తేదీ నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానుండగా.. మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏపీ ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.



# కాంగ్రెస్ లోకి చేరికలు.

**విశాలభారతి,కూకట్ పల్లి:** కాంగ్రెస్ పార్టీలోకి చేరికల పర్వం కొనసాగుతోంది. ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు ఆయా పార్టీలను వీడి హస్తం గూటికి చేరారు. కూకట్పల్లి నియోజకవర్గం మూసాపేట కి చెందిన బి ఆర్ ఎస్ నాయకులు మూసాపేట మాజీ సర్పంచ్ తూము శ్రీనివాస్ రావు, కర్కా పెంటయ్య, మాజీ కౌన్సిలర్ తూము ఎల్లా రావు, ట్రేడ్ యూనియన్ నాయకులు కర్కా నాగరాజు, తదితరులు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి దీపా దాస్ మున్షి గుప్తా , కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ గార్ల సమక్షంలో, ఏ బ్లాక్ అధ్యక్షులు పట్లోళ్ల నాగిరెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం గాంధీభవన్ లో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకల్ కార్యదర్శి సూరజ్ తివారి, సాదు ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బుచ్చిబాబు, రాజిరెడ్డి, పాండు ముదిరాజ్, అశోక్ ముదిరాజ్, ఎం సంతోష్ కుమార్ పాల్గొన్నారు




# పేదల కష్టాలను తీర్చడానికే ఉప్పల చారిటబుల్ ట్రస్ట్

**ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**

**కల్వకుర్తి, విశాల భారతి:**కనీస అవసరాల కోసం పేద ప్రజలు పడుతున్న కష్టాలను చూసి తట్టుకోలేక ఏ విధంగానైనా వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో ఉప్పల చారిటబుల్ ట్రస్టును స్థాపించినట్లు ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ అన్నారు. మండల పరిధి లోని మార్చాల గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం ఉప్పల వెంకటేష్ ఆట దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ పేరున ఇప్పటి వరకు పేద విద్యార్థులకు ఉచిత విద్యతోపాటు ఇండ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇండ్లు కట్టించడం, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం ఇలాంటి ఎన్నో రకాల సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు వెంకటేష్ తెలిపారు. అదేవిధంగా మార్చాల గ్రామంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పేదలకు వైద్య సేవలు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్ల కట్టే కార్యక్రమం, ఇండ్ల నిర్మాణం మధ్యలో ఆగిపోయిన ఇండ్లకు సిమెంటు, స్టీల్ తదితర వసూలు తన ట్రస్టు ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట రమణ, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, తలకొండపల్లి ఎంపీపీ నిర్మలశ్రీశైలం, కడ్తాల్ జెడ్పిటిసి దశరథ్ నాయక్, కడ్తాల్ పిఎసిఎస్ చైర్మన్ వెంకటేష్, కల్వకుర్తి వైస్ చైర్మన్ షాహిద్, ఎంపీటీసీ సంతోష మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



# భీమ్ భరత్ ను కలిసిన బిఆర్ఎస్ కౌన్సిలర్ దంపతులు

**బిఆర్ఎస్ పార్టీ రెండవ వార్డు కౌన్సిలర్, సంధ్యారాణి అశోక్ కుమార్ దంపతులు**

**శంకర్‌పల్లి,విశాలభారతి:** చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి భీమ్ భరత్, రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ జ్యోతి లను శనివారం శంకర్‌పల్లి బిఆర్ఎస్ పార్టీ రెండవ వార్డు కౌన్సిలర్ సంధ్యారాణి అశోక్ కుమార్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు .ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్షితులై కొద్ది రోజుల్లోనే కాంగ్రెస్ పార్టీలో చేరుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఎజాస్, మాజీ సర్పంచ్ సురేష్‌రెడ్డి, పెంటారెడ్డి, మండల మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ నసిరుద్దీన్ ఉన్నారు.



# ధ్వజస్తంభ ప్రతిష్టకు నీలం మధు రూ.5 లక్షల విరాళం

- సమ్మక్క సారక్కకు ప్రత్యేక పూజలు
- ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని అలవర్చుకోవాలి
- కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్

**పటాన్ చెరు,విశాలభారతి:**ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలని కాంగ్రెస్ నేత ముదిరాజ్ అన్నారు. శనివారం అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని లింగమయ్య కాలనిలో నిర్వహించిన శ్రీ సీతారామ స్వామి, ఆంజనేయ స్వాముల ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ట మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంధర్భంగా నీలం మధు దేవాలయ నిర్మాణానికి 5 లక్షల విరాళం అందించారు. అనంతరం అమీన్ పూర్ మున్సిపాల్టీ పరిధిలో నిర్వహిస్తున్న సమ్మక్క సారక్క జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ వనదేవతలుగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మ



క్క సారక్క జాతరను అమీన్ పూర్ లో నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ప్రతి రెండేండ్లకు ఒకసారి భక్తి శ్రద్ధలతో ఆనవాయితీగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలలో పాల్గొంటే అనుకున్న మొక్కులు తీరుతాయని భక్తులు బావిస్తారని తెలిపారు. భక్తుల కొంగు బంగారంలా నిలుస్తున్న సమ్మక్క సారక్క ఆశీస్సులు ప్రజాలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొల్లూరి మల్లేష్, సదువు మల్లేష్, తిరుమల రెడ్డి, కుమార్, వీరేష్, శివా, శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, రమేష్, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

**ఎమ్మెల్యే గాంధీ**

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**
సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి అని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరేకపూడి గాంధీ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల లో చదువుతున్న విద్యార్థులకు సినాప్సిస్ సాఫ్ట్ వేర్ సంస్థ వారి సౌజన్యంతో నిర్మన్.ఓఆర్జీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సోలార్ వ్యవస్థ,3 అదనపు తరగతుల గదులు,సైన్స్ లాబ్ పరికరాలు,గ్రీన్ బోర్డ్ లను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరైన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ సినాప్సిస్ సంస్థ వారు పేద విద్యార్థులకు, పేద ప్రజలకు సామజిక సేవ కార్యక్రమాలు చేయడం అభినందనీయమని సమాజము




కోసం ఎదో చేయాలనే తపన వలన సమాజ హితం సమాజ సేవలు చేయడం చాల గొప్ప విషయం అని, సినాప్సిస్ ఓదార్యం చాలా గొప్పదని,ఆర్థిక స్థోమత లేని పేద విద్యార్థుల చదువుకు ఎటువంటి ఆటంకం కలగకుడదనే ఉద్దేశ్యంతో సినాప్సిస్ సంస్థ వారు ఎంతో ఔదార్యంతో పేద విద్యార్థులకు మేలు కలిగే విధంగా పాఠశాల ప్రాంగణంలో సోలార్ వ్యవస్థ ను 3 అదనపు తరగతుల గదుల నిర్మాణం చేపట్టడం జరిగిందని, సైన్స్ ల్యాబ్ పరికరాలు,అన్ని తరగతి గదులలో కొత్త గ్రీన్ బోర్డులు ఏర్పాటు చేశామన్నారు.వీటిని చక్కగా సద్వినియోగ పర్చుకొని మంచిగా చదివి తల్లిదండ్రులకు,సమాజానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఎమ్మెల్యే గాంధీ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సినాప్సిస్ సంస్థ సైట్ డైరెక్టర్ నరేంద్ర, సీనియర్ మేనేజర్ నర్సింహ,నిర్మాణ్ సంస్థ కో ఆర్డినేటర్ అనురాధ, భార్గవ రామ్,భగవాన్, ప్రధానోపాధ్యాయురాలు వసుంధర దేవి, టీచర్స్ బాల్ రెడ్డి, మదన్ మోహన్ సత్యనారాయణరావు,వీణ,గౌసియా,మియాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కిరణ్ యాదవ్, మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రసాద్, చంద్రిక ప్రసాద్,మహేందర్ ముదిరాజ్,తదితరులు పాల్గొన్నారు.



# పెద్దమ్మతల్లి ఆలయంలో అన్నదాన వితరణ

**ఆర్మూర్, విశాల భారతి:**
నందిపేట్ మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో శనివారం మొదటి వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం నిర్వహించారు. పెద్దమ్మ తల్లి కరుణా కటాక్షాలు అందరిపై ఉండాలని పెద్దమ్మతల్లిని వేడుకున్నారు.



# ఘనంగా 'ఊసకోయిల ప్రకాష్' జన్మదిన వేడుకలు

**భీమదేవరపల్లి, విశాల భారతి:**హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల సీనియర్ కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఊస కోయిల ప్రకాష్ జన్మదిన వేడుకలు శనివారం ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు ముల్కనూర్ చౌరస్తాలో ఆయనతో కేక్ కట్ చేయించి, మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు శాలువతో సన్మానించి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రకాష్ మాట్లాడుతూ బర్త్డే వేడుకలు ఇంత ఘనంగా నిర్వహించిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకలలో వెంకట్ రెడ్డి, రామోజు సమ్మయ్య, మాడుగుల గోపి ,చిట్కూరి రాంచంద్రం, ఒద్దుల సంపత్, తాళ్లపల్లి సదానందం, మాచర్ల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.




# పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికే ప్రజా సంకల్పయాత్ర

**ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి**

**కల్వకుర్తి, విశాలభారతి:**కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు పరుస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికే ప్రజా సంకల్ప యాత్రను చేపట్టినట్లు ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి, హైదరాబాద్ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి అన్నారు. శనివారం కల్వకుర్తి పట్టణంలోని పద్మశాలి భవన్లో మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి, బంగారు శృతితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని ఆయన అన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీని ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో దాదాపు 400కు పైచిలుకు స్థానాల్లో బిజెపి అభ్యర్థులు గెలవడం ఖాయమని దీంతో ముచ్చటగా మూడవసారి నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అవుతారని చెప్పారు. తెలంగాణలో వచ్చే పార్లమెంట్ ఎన్నికలు కేవలం కాంగ్రెస్, బిజెపి మధ్య పోటీ అని అన్నారు. అనంతరం తల్లోజు ఆచారి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. 6 గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి త్వరలోనే ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు.. ఈ సమావేశంలో బిజెపి నాయకులు దుర్గ ప్రసాద్, దిలీప్ చారి, కృష్ణయ్య, బండేల రామచంద్ర రెడ్డి, శేఖర్ రెడ్డి, కృష్ణ గౌడ్, హరి ప్రసాద్, నరసింహ, అభిలాష్, చందు, శివ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాహిత పాదయాత్ర విజయవంతం చేయండి

**బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి**

**భీమదేవరపల్లి, విశాల భారతి:**బీజేపీ ఎంపీ బండి సంజయ్ ప్రజాహిత పాదయాత్ర ప్రారంభం కానున్న నేపథ్యంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొనాలని బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల అధ్యక్షుడు పృథ్వీరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో మండలంలో ఏర్పాటు చేసిన మండల కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ బొమ్మ శ్రీరామ చక్రవర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ఎంపీ బండి సంజయ్ ప్రజాహిత పాదయాత్ర ఈనెల 26 హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ అంబేద్కర్ విగ్రహం నుండి ప్రారంభమై 27 న సాయంత్రం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామంలో చేరుకొని, రాత్రి కొత్తకొండ గ్రామం హరిత కాకతీయ హోటల్ లో బస చేసి 28 వ రోజు ఉదయం గట్ల నర్సింగాపూర్ గ్రామం నుండి వంగర గ్రామానికి చేరుకొని పీవీ కుటుంబ సభ్యులను కలసిన అనంతరం ములకనూరు అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన పబ్లిక్ మీటింగ్ లో పాల్గొంటారని తెలిపారు. ఈ పాదయాత్రలో అభిమానులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని పాదయాత్ర ను విజయవంతం చేయాలని బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అల్లాడి రమేష్ సాయిని మల్లేశం, గుజ్జ సత్యనారాయణ, గుర్రాల లక్ష్మారెడ్డి, వాసు దేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కార్యకర్త కుటుంబానికి అండగా కాంగ్రెస్ పార్టీ

**కల్వకుర్తి, విశాల భారతి:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త మండల పరిధిలోని ముకురాల గ్రామానికి చెందిన కంచి బాలయ్య ఇటీవలే మృతి చెందారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి నాయకులు ప్రతాప్ రెడ్డి, రేణు యాదవ్, లక్ష్మారెడ్డి, కొండల్ రెడ్డి, నరేందర్ రెడ్డి, కొములయ్య, రాములు, సిద్దయ్య, మహేందర్ తదితరులు శనివారం ప్రతిని కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యకర్తల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు.

# కీసరలో తప్పిపోయిన 6 సంవత్సరాల బాబు.

**సోషల్ మీడియా ద్వారా తల్లి వద్దకు బాబు.**

**విశాల భారతి,కీసర :** కీసర గ్రామంలోని విఆర్ సెరినిటీ స్కూల్ వద్ద శనివారం సాయంత్రం ఓ బాబు తప్పి పోయిన సంఘటన చోటు చేసుకుంది. పక్కనే ఉన్న వి ఆర్ సెరినిటీ స్కూల్ చైర్మన్ రాజీ రెడ్డి ఈ బాబు ఎవరి అని చుట్టుపక్కల చాలా మందిని విచారించగా ఫలితం లేకుండా పోయింది. కీసర పోలీసులకు ఓ బాబు తప్పి పోయాడు అని సమాచారం ఇచ్చిన రాజీ రెడ్డి.అలాగే కీసర గ్రామ వాట్స్ అప్ గ్రూప్ లో బాబు ఫోటో షేర్ చేయించిన రాజీ రెడ్డి.అనంతరం ఆ బాబు ఫోటోను వాట్స్ అప్ గ్రూప్స్ ద్వారా సోషల్ మీడియాలో షేర్ చేసిన పలువురు.సోషల్ మీడియాలో తప్పి పోయిన బాబు ఫోటో పోస్టు చూసిన మాల్యాల మాజీ సర్పంచ్ వెంకటేష్ బాబు తల్లికి సమాచారం ఇవ్వడం జరిగింది.అప్పటికే వి ఆర్ సెరినిటీ పాఠశాల వద్దకు చేరుకున్న కీసర పోలీసులు.కీసర గ్రామం



లోని ఓ ఫంక్షన్ కి వచ్చిన తల్లి మీనా 6 సంవత్సరల బాబు అనంతరం ఫంక్షన్ నుండి రోడ్డుపైకి వచ్చిన బాబు ఇంతలో బాబు వచ్చిన దారి మరిచిపోయాడు.తల్లి మీనా నగరంలోని పార్సీ గుట్టకు చెందిన వారుగా గుర్తించిన పోలీసులు.అనంతరం వి ఆర్ సెరినిటీ స్కూల్ వద్దకు వచ్చిన తల్లి మీనా బాబును తల్లికి అప్పగించిన పోలీసులు.ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ స్థానిక యువ నాయకులు గోరేంటి ప్రవీణ్,మెట్టు పరమేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.



# మరకత శివాలయంలో ప్రత్యేక పూజలు

**టాలీవుడ్ సినీ నటుడు టార్జాన్**

**శంకర్ పల్లి,విశాలభారతి:**శంకర్‌పల్లి మండల చందిప్ప గ్రామ శివారులో గల 11వ శతాబ్దానికి చెందిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో మాఘ పూర్ణిమ శనివారం టాలీవుడ్ సినీ నటుడు టార్జాన్ (లక్ష్మీనారాయణ) వనజ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన పూజారులు ప్రమోద్, సాయిశివ, టార్జాన్ కు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సదానందం గౌడ్, టార్జాన్ కు స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. టార్జాన్ మాట్లాడుతూ మరకత శివాలయాన్ని ఒక్కసారి దర్శించుకుంటే వంద రెట్లు దర్శించుకున్నట్లు అని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ వైస్ చైర్మన్ హనుమంతు, విక్రమ్, భానుశ్రీ ఉన్నారు.

# చదువుతో పాటు విద్యార్థులకు క్రీడలు అవసరం

**భారతి నగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి**

**పటాన్‌చెరు,విశాలభారతి:** చదువుతో పాటు విద్యార్థులకు క్రీడలు అవసరమని భారతి నగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి అన్నారు. శనివారం భెల్ హాకీ గ్రౌండ్ లో బ్లూ బర్డ్ స్కూల్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన అనువల్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి అమే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కోవత్తు వెలిగించి కార్పొరేటర్ సింధు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో రాణించి విజయాలను అందుకోవాలని కోరారు. చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వాలీబాల్ ప్లేయర్



కృష్ణం రాజు, బ్లూ బర్డ్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.




# కిడ్ షైన్ స్కూల్ ప్రారంభోత్సవం

**వికారాబాద్ జడ్పీ చైర్మన్**

**శంకర్‌పల్లి, విశాలభారతి:** శంకర్‌పల్లి మండల పరిధి మోకిల గ్రామంలో నూతనంగా నెలకొల్పిన కిడ్ షైన్ గ్లోబల్ స్కూల్ రెండవ బ్రాంచ్ ను వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ పట్నం సునీత మహేందర్ రెడ్డి శనివారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం స్కూల్లో జరిగిన సత్యనారాయణ స్వామి వ్రత పూజలో వికారాబాద్ జడ్పీ చైర్మన్ పాల్గొన్నారు. చైర్మన్ ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్కూల్ యజమానులు శాలిని , శేఖర్ గౌడ్ లను జడ్పీ చైర్మన్ అభినందించారు. జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ మండలానికి ఒక బ్రాంచ్ ప్రారంభించాలని ఆకాంక్షించారు. ప్రారంభోత్సవంలో ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్ రెడ్డి, కౌన్సిలర్ రాములు, మాజీ ఉపసర్పంచ్ దండు సంతోష్ కుమార్, ప్రవీణ్ గౌడ్, భీమ్ గౌడ్, భాస్కర్ గౌడ్, మల్లేష్ గౌడ్, శివ, స్రవంతి, ప్రియాంక, శ్రీకాంత్, శివ, రాజేష్ గౌడ్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించాలి

**కార్పొరేట్ విద్యా సంస్థలను రద్దు చేయాలి**

**చేవెళ్ల, విశాల భారతి:** చేవెళ్ల మండల కేంద్రంలోని శనివారం అంబేద్కర్ భవన్ లో పిడిఎస్ యు జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రాజేష్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ముకాసింది అని విద్యాసంస్థల్లో కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదని అన్నారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడినా, విద్యారంగాన్ని పాత సమస్యలే వెంటాడుతున్నాయని అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టింగ్ భర్తీ చేస్తామని నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని చెప్పిందని తెలిపింది. ఫీజుల దోపిడీ చేస్తూ వేలాదిమంది విద్యార్థుల ఆత్మహత్యల కారణమైన కార్పొరేట్ విద్యా సంస్థలను రద్దు చేయాలి అని అన్నారు. నూతనంగా




ఏర్పాటు అయిన రేవంత్ రెడ్డి సర్కార్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో విద్యారంగానికి తగినన్ని నిధులు కేటాయించలేదని అన్నారు. ఈ క్రింది డిమాండ్స్ నెరవేర్చుకునేందుకు పోరాడుదాం అని అన్నారు.

**డిమాండ్స్..**

1. విద్యాశాఖకు ప్రత్యేకంగా మంత్రిని నియమించాలి.
2. ప్రభుత్వ విద్యారంగ బలోపేతం కోసం కమిషన్ ను ఏర్పాటు చేయాలి.
3. పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ , స్కాలర్ షిప్ లను యుద్ధ ప్రాతిపదికన విడుదల చేయాలి.
4. కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలి.
5. యూనివర్సిటీ విద్యార్థుల మెస్ బకాయిలను రద్దు చేయాలి. ఆశ్రమ పాఠశాలల మెస్ చార్జీలను విడుదల చేయాలి.
6. హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలను పెంచాలి.
7. ప్రైవేటు యూనివర్సిటీలను రద్దు చేయాలి. ప్రభుత్వ యూనివర్సిటీలను బలోపేతం చేయాలి. జిల్లాకొక నూతన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి.
8. విద్యాసంస్థల్లో టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు నాయకులు కోజ్జంకి జైపాల్, బొజ్జి శ్రీకాంత్, న్యాలట అశోక్, మల్లేపల్లి సురేష్, అశోక్, నర్సింహ, తదితరులు ఉన్నారు.



# యాంత్రిక జీవితంలో క్రీడలు ఎంతో దోహదం చేస్తాయి

**ఎమ్మెల్యే గాంధీ**

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** క్రీడలు శారీరక మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని కలిగిస్తాయని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరేకాపూడి గాంధీ అన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తి శ్రీనగర్ కాలనీ పార్క్ లో దీప్తి శ్రీనగర్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ ప్రీమియర్ లీగ్ 24 ఫిబ్రవరి 2024 ను నిర్వహించారు. అందులో భాగంగా విన్నర్స్ గా కేపీ కంగారు,రన్నర్స్ గా మాస్టర్ బ్లాస్టర్స్ సెకండ్ రన్నరఫ్ గా చౌదరి వారియర్స్ గెలుపొందారు.ఈ కార్యక్రమంలో విజేతలకు మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ చందానగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరైన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ గారు మాట్లాడుతూ దీప్తి శ్రీ నగర్ కాలనీ పార్క్ లో దీప్తి శ్రీనగర్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ ప్రీమియర్ లీగ్ 2024 నిర్వహించడం చాలా అభినందనీయమని, క్రీడలతో శారీరక శ్రమతో పాటు మానసిక దృఢత్వం లభిస్తుందని, క్రీడలతో మానసిక ఉల్లాసం,స్నేహభావం పెంపొందుతుందని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ డిఎస్పి సుంకర సత్యనారాయణ, మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్, రాఘవేంద్రరావు,ఓం ప్రకాష్ గౌడ్,చంద్రశేఖర్,రామారావు, కమిటీ సభ్యులు శ్రీనివాసరావు ప్రెసిడెంట్ ,వైస్ ప్రెసిడెంట్ జగదీష్,సెక్రటరీ దుర్గాప్రసాద్, జాయింట్ సెక్రెటరీ చంద్రశేఖర రావు, ట్రెజరర్ శ్రీరామ్ మరియు అడ్వైజర్స్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ విజయం కోసం పనిచేస్తాం

**మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసిన పీసీసీ ప్రధాన కార్యదర్శి జెరిపెటి జైపాల్**

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేస్తామని శేరిలింగంపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆ పార్టీ టి పిసిసి ప్రధాన కార్యదర్శి జెరిపేటి జైపాల్ అన్నారు.శనివారం సచివాలయంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కష్టపడి పని చేసి విజయాన్ని చేకూర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జరిపేటి రామచంద్ర రాజు, శేరిలింగంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అధ్యక్షుడు మహమ్మద్ జహంగీర్, చందానగర్ డివిజన్ అధ్యక్షుడు ఆలీబాబా, ఖాజామియుద్దీన్,డిసిసి మైనారిటీ ప్రధాన కార్యదర్శి, ఇలియా షరీఫ్, ఏ బ్లాక్ అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా సమతా మూర్తి జయంతి

**నేరేడుచర్ల, విశాలభారతి:** ఈరోజు నేరేడుచర్ల పట్టణంలోని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సమతా మూర్తి... సంత్ గురు రవి దాస్ జయంతి వేడుకలలో సందర్భంగా. ఎవరైతే తాము బతికిన కాలంలో ఎంతోమంది తమ భావజా లంతో ప్రభావితం చేస్తారో వాళ్లే చరిత్ర మలుపు లో నిలబడి రాబోయే కాలానికి దిశా నిర్దేశం చేస్తారు. ఇలాంటి వారిలో సంత్ రవిదాస్ ఒకరు. ఆయన భక్తి కవుల్లో ఒక అధ్యాత్మిక భావాన్ని కాకుండా సామాజిక భావాలనుఅభివృద్ధి చేశారు. బానిస భావాలను వ్యతిరేకించాడు మానసిక బానిసత్వాన్ని కుల బానిసత్వాన్ని,కుల బానిసత్వాన్ని శరీరక బానిసత్వాన్ని వ్యతిరేకించాడు.మనిషి వాసంతుడై గౌరవమైన ఆలోచనలతో జీవించాలని బోధిస్తూ చాలా ఉంచి జీవించడానికి నిరాకరించాడు



# ప్రభుత్వ భూముల పరిరక్షణ కాంగ్రెస్ భాధ్యత

**కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్**

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములు ,చెరువులు అన్యాక్రాంతం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చాలా స్పష్టమైన అవగాహన ఉందని,శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రతి డివిజన్ అభివృదే ధ్యేయంగా ప్రతి అడుగు ముందుకు వేస్తామని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. శనివారం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శంశిగుడా,సాయిచరణ్ కాలనీ,శ్రీరాం నగర్,కృష్ణ వేణి కాలనీ,సాయి ప్రశాంత్ నగర్ కాలనీ ఇంద్రహిల్స్ లో నెలకొన్న వాటర్,అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, రొడ్లు,వీధి స్తంభాల,సమస్యలపై స్థానిక నాయకులు,ప్రజలతో కలిసి జగదీశ్వర్ గౌడ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ ప్రశాంతి, డివిజన్ అధ్యక్షులు మరేళ్ల శ్రీనివాస్,నాయకులు మనెపల్లి సాంబశివరావు,ప్రభాకర్,,రూబెన్ గోపాల్,లింగం,సంగారెడ్డి, సుధాకర్,సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# తాగు, సాగు నీరు ఇవ్వండి

**పిఎస్ సి యస్ చైర్మన్ వీరం రెడ్డి శంబిరెడ్డి**

**గరిడేపల్లి, విశాలభారతి :** మండల పరిధిలో ఉన్న పరెడ్డిగూడెం వెంకట్రాంపురం గారకుంట తండా గానుగ బండ పరిసర ప్రాంతాలలో గ్రామాలలో తాగునీరు సాగునీరు కోసం కనీసం ఒక తడి నీరు వదిలి ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలని వారు కోరారు. ఈరోజు పరెడ్డిగూడెం గ్రామంలో ఎండిన పంట పొలాలను స్థానిక పిఎస్ సిఎస్ చైర్మన్ వీరం రెడ్డి శంబి రెడ్డి బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కృష్ణా నాయక్ కలిసి పంట పొలాలను పరిశీలించారు గత ప్రభుత్వ హయాంలో నాగార్జునసాగర్ ఆయకట్టు కింద డెడ్ స్టోరేజ్ వాటర్ ఉన్న ప్రభుత్వం ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలని సంకల్పంతో సాగునీరు ఇచ్చి రైతులకు పంట పొలాలకు అవకాశం కల్పించిందని కానీ ఒక్క తడి సాగర్ వాటర్ ఇచ్చి పంటపొలాలను కాపాడి గ్రామాలలో తాగునీరు కోసం బోరు బావుల కింద గ్రౌండ్ వాటర్ పేరిగే విధంగా కనికరించాలని కోరారు ఈరోజు పరెడ్డిగూడెం గ్రామ రైతులు మహిళలు స్థానిక ఎమ్మెల్యే తెలంగాణ భారీ నీటిపారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి సార్ కిప్రత్యేకంగా రెండు చేతులు జోడించి విన్నవించారు. సాగునీరు ఇచ్చి 3.నుంచి 4. వేలఎకరాలకు పంటలను కాపాడాలని ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలని ప్రత్యేకంగా విన్నవించుకున్నారు గ్రామానికి చెందిన రైతులు మునగంటి సీతారాములు 40 ఎకరాలు బోల్ల గాని వెంకన్న రెండు ఎకరాలు బోల్ల గాని సైదులు ఐదు ఎకరాలు కేతిరెడ్డి రామిరెడ్డి వీరు కేవలం కవులు రైతులు మాత్రమేనని ఈ ప్రాంత రైతాంగాన్ని రైతులను మంచి మనసుతో మంత్రి ఆలోచన చేసి పది రోజులు సాగర్ నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని తాగునీటిని కనికరించాలని వారు కోరారు.



# ఆదర్శ పాఠశాల విద్యార్థి విజయకేతనం

**సూర్యాపేట, విశాలభారతి:** జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పరిష్కరించుకొని ఫోరమ్ ఫర్ ఫిజికల్ సైన్స్, ఫోరమ్ ఫర్ బయాలజికల్ సైన్స్ వారు సంయుక్తంగా రాష్ట్ర విద్యా పరిశోధన మండలి హైదరాబాద్ వారి సహకారంతో రాష్ట్రంలోని వివిధ జిల్లా కేంద్రాల్లో ఆన్లైన్ ద్వారా శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ టాలెంట్ టెస్టులో సూర్యాపేట మండలం ఇమాంపేట ఆదర్శ పాఠశాల కు చెందిన సిహెచ్. ఈశ్వర్ (తొమ్మిదవ తరగతి) సూర్యాపేట కలెక్టరేట్ లోని సర్వ శిక్ష అభియాన్ కేంద్రం నుండి పోటీల్లో పాల్గొనడం జరిగింది. కాగా ఇమాంపేట ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థి సిహెచ్. ఈశ్వర్ ఈ పోటీలలో విజయం సాధించి తెలంగాణ రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ బి. శంకర్ నాయక్ తెలియజేశారు. ఈ విజయం పట్ల జిల్లా విద్యాశాఖాధికారి కె.అశోక్, ఎఫ్ పి ఎస్టి రాష్ట్ర అధ్యక్షులు అజయ్ సింగ్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, టి బి ఎస్ ఎఫ్ రాష్ట్ర, అధ్యక్ష కార్యదర్శులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగాపాఠశాల ప్రిన్సిపల్ బి.శంకర్ నాయక్ మాట్లాడుతూ సైన్స్ టాలెంట్ టెస్ట్ లో రాష్ట్రస్థాయిలో విజయం సాధించడం ఆనందాన్ని కలిగించిందని ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందిస్తాయని, భవిష్యత్తులో విద్యార్థులు వివిధ ప్రయోగాలు చేసి భవిష్యత్తులో బాల శాస్త్రవేత్తలుగా మారడానికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు.ఫలితాలు వెలువడిన అనంతరం ప్రిన్సిపల్ రాష్ట్రస్థాయిలో విజయం సాధించిన విద్యార్థి సిహెచ్ ఈశ్వర్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు, ఇంచార్జి టీచర్ అయిన కోడి లింగయ్య లను అభినందించారు.

కలెక్టరేట్లో నిర్వహించిన ఈ ఆన్లైన్ పోటీలలోసెక్టోరియల్ ఆఫీసర్ రాంబాబు ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు రామలింగారెడ్డి, బయలాజికల్ సైన్స్ ఫోరం గౌరవ సలహాదారులు పవిత్ర, తదితరులు పాల్గొన్నారు.



# టెలిఫోన్ కాలనీ ఫేజ్ 2 నూతన కార్యవర్గం.

**అధ్యక్షులుగా గోకుల సత్యనారాయణ**

**మేడిపల్లి,విశాలభారతి:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని టెలిఫోన్ కాలనీ ఫేజ్ 2 సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులుగా గోకుల సత్యనారాయణ ఎన్నికైయ్యారు. శనివారం జరిగిన కాలనీ సర్వసభ్య సమావేశంలో కాలనీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.సంఘం ప్రధాన కార్యదర్శిగా పైల్ల మల్లారెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ తుమ్మ నాగరాజు,కోశాధికారిగా గోగులోతు సురేందర్,ముఖ్య సలహాదారులుగా బాలకృష్ణ,ప్రజాపతి, దిండ్లునర్సయ్య,ఉపాధ్యక్షులుగా గిరి ముత్తయ్య, రుద్రారం యాదగిరి,దండ్ల కనకరాజు,బోయిన భరద్వాజ్,సహ కోశాధికారిగా యల్లం వి.కె.వరప్రసాద్. సహాయ కార్యదర్శులుగా ఎడిగ చంద్రశేఖర్,నోముల విశ్వేశ్వర్,పన్నాల పద్మారెడ్డి,ప్రచార కార్యదర్శి కర్తాల కర్ణాకర్ రెడ్డి,పసుపులసమ్మయ్య,గర్దాస్ యాదగిరి,కార్యవర్గ సభ్యులుగా నిమ్మల వెంకటేశ్,మంతని రాజా. జి.కుమార్.సాయికిరణ్.గంగాధరి యాదగిరి,వై. సందీప్,పసువుల గణేశ్,టి.శ్రీకర్,దయాకర్.ఓంప్రకాశ్లను ఎన్నుకున్నారు.కొత్తగా ఎన్నికైన కాలనీ కార్యవర్గం ప్రతినిధులు స్థానిక కార్పొరేటర్ కొత్త దుర్గమ్మ గౌడ్ను,మేడ్చల్ నియోజకవర్గ బిబ్లాక్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్ గౌడ్లను మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీ నూతన కమిటీ ప్రతినిధులను వారు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కాలని ప్రతినిధులు కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను కార్పొరేటర్ దుర్గమ్మ గౌడ్, కాంగ్రెస్ నేత కిశోర్ గౌడ్ కు విన్నవించారు.కాలనీలో సిసిరోడ్లు,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ,సైన్ బోర్డులు ఏర్పాటు,దోమల బెడద.చెత్తఆటోల కేటాయింపు తదితర సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు.సాధ్యమైనంత త్వరలో కాలనీ సమస్యలను పరిష్కరించేందుకు తమవంతు కృషి చేస్తామని కార్పొరేటర్ కొత్త దుర్గమ్మ గౌడ్,కాంగ్రెస్ సీనియర్ నేత కిశోర్ గౌడ్ లు హామీ ఇచ్చారు.



# సమస్యలు పరిష్కరించండి : ఎఫ్ టి ఎస్

- గత ప్రభుత్వంలో న్యాయం జరగలేదు
- కాంగ్రెస్ ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని నమ్మకం ఉంది
- పెండింగ్ వేతనాలను చెల్లించండి

**నల్లగొండ, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తహసిల్దార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న టెక్నికల్ స్టాఫ్ మరియు జిల్లా కోఆర్డినేటర్ల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి, పౌర సంబంధాలు హర్కర్ వేణుగోపాల్ రావు, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దనసరి సీతక్క, దుద్దిల్ల శ్రీధర్ బాబు, దామోదర్ రాజనర్సింహ, ధరణి కమిటీ మెంబర్ కోదండ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డి లకు జిల్లా కలెక్టర్లకు మరియు ఎమ్మెల్యేలకు ఎమ్మార్వోలకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఎఫ్.టి. ఎస్ లు కోఆర్డినేటర్లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తహశీల్దార్ కార్యాలయాలలో రికార్డ్స్, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు చేయుటకై 713 మంది ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ (ఎఫ్.టి. ఎస్) మరియు జిల్లా కోఆర్డినేటర్లు లను, టెండర్ ద్వారా ఈ సెంట్రిక్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా నియమించడం జరిగిందని నియామక సమయం లో ప్రతి 6 నెలలకు ఒకసారి ఇంక్రిమెంట్ ఉంటుందని తెలిపారు.కానీ ఇంక్రిమెంట్ లేకపోగా ఏ ఒక్క నెలలో కూడా సక్రమముగా మాకు జీతాలు చెల్లించిన దాఖలాలు లేవని వాపోయారు. గత మార్చి 2023 నుండి 2024 ఫిబ్రవరి నెల వరకు వేతనాలు పెండింగ్ పెట్టారు. జీత భత్యాలు కోసం గత ప్రభుత్వం ముఖ్య మంత్రి కి, సిఎస్ కి, సిసిఎల్ఏ నవీన్ మిట్టల్ కి మా సమస్యలపై వినతి పత్రాలు ఇచ్చిన న్యాయం జరగలేదన్నారు.



# నవీన్ కుటుంబాన్ని ఆదుకోవాలి

**మొగుళ్ళ గోపాల్ ( ఐఎఫ్టియు) జిల్లా నాయకులు**

**నూతనకల్, విశాలభారతి:** నల్లగొండలో మిషన్ భగీరథలో పంప్ ఆపరేటర్ గా పనిచేస్తున్న నవీన్ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని వారి కుటుంబాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం 50 లక్షలు ఎక్స్ గ్రేషియ ఇచ్చి ఆదుకోవాలని తెలంగాణ ప్రగతిశీల మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్( ఐఎఫ్టియు) జిల్లా కార్యదర్శి మొగుళ్ళ గోపాల్ డిమాండ్ చేశారు. చిల్పకుంట గ్రామంలో మిషన్ భగీరథ ప్లాంట్ లో నవీన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మిషన్ భగీరథలో 16 వేలకు పైగా కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారు. వీరి శ్రమకు తగిన వేతనం,చట్టబద్ధ వేతనాలు ఇవ్వడం లేదని,5 లేదా 6నెలలు దాటిన వేతనాలు కాంట్రాక్టర్ లు చెల్లించడం లేదని దీనితో వర్కర్స్ మనోవేదనకు గురయ్యి ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఉప్పలయ్య, రమేష్, రామకృష్ణ, నవీన్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి దేవరుప్పుల అధ్యక్షుడిగా సత్తయ్య యాదవ్

**దేవరుప్పుల, విశాలభారతి:** మండల బిజెపి నూతన అధ్యక్షుడిగా మండలకేంద్రానికి చెందిన కాసాని సత్తయ్య యాదవ్ ఎన్నికయ్యారు.ఈ మేరకు శనివారం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆరుట్ల దశమంత్ రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. నూతనంగా ఎన్నికైన బిజెపి మండల అధ్యక్షులు కాసాని సత్తయ్య యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మండల పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకున్న నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటానని,అధిష్టానం ఆదేశాలను పాటిస్తూ పార్టీకి విధేయత కలిగిన



సైనికుడిగా పనిచేస్తానని,ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ.. ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తూ,పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.



# కృష్ణ ఆశయాలను సాధిస్తాం

**సిపిఎం సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు**

**మణుగూరు, విశాలభారతి :** బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు, అశోక్ నగర్ సిపిఎం మాజీ శాఖ కార్యదర్శి కామ్రేడ్ పిట్టల కృష్ణ ఆశయాలను కొనసాగిస్తామని సిపిఎం సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు అన్నారు. శనివారం అశోక్ నగర్ బిఎస్ఎన్ఎల్ ఎక్స్చేంజ్ సెంటర్ లో కామ్రేడ్ కృష్ణ ప్రధాన వర్ధంతి జరిగింది. కామ్రేడ్ కృష్ణ ఫోటో కి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఉప్పతల నరసింహారావు ఎస్.కె ఖాసిం లు పూలమాల వేశారు. విప్లవ జోహార్లు అర్పించారు, అనంతరం సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ కృష్ణ లేని లోటును పూర్చలేమన్నారు. పెయింటింగ్ లో ముగ్గులు వేయడంలో తమ కళారూపాల ద్వారా అందరిని ఆకర్షించే వారని అన్నారు. కామ్రేడ్ కృష్ణ కుటుంబం పార్టీ నిబంధన వాళ్ళకి కట్టుబడి పని చేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కొడిశాల రాములు, కార్యదర్శులకు సభ్యులు దామల్ల లెనిన్ బాబు, బొల్లం రాజు, మొలకల ఉత్తం పిట్టల నాగమణి పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటిని కలిసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**తొర్రూర్, విశాలభారతి:** పాలకుర్తి నియోజకవర్గం అభివృద్ధిని కోరుతూ రెవిన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఇంచార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డిలు హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలోని చెన్నూరు రిజర్వాయర్ భూములు కోల్పోయిన బాధితులకు, అదేవిధంగా పాలకుర్తి రిజర్వాయర్భూములు కోల్పోయిన బొమ్మరి గ్రామ బాధిత రైతులకు వెంటనే నష్టపరిహారం అందించడంతోపాటు ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా పాలకుర్తి నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల రైతులకు సాగునీరు అందించేలా చూడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఇచ్చిన వినతిపత్రంలోని అంశాలను తెలిపారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు సానుకూలంగా స్పందించి బాధిత రైతులను ఆదుకుంటామని, త్వరగా నష్టపరిహారం అందేలా చూస్తానని పాలకుర్తి అభివృద్ధికి తోడ్పాటు నందిస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు.



# జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

**ఎమ్మెల్యే వేముల**

**నకిరేకల్, విశాలభారతి:** పట్టణంలో ఆదివారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో మెగా జాబ్ మేళా ను పట్టణంలోని జడ్పీ హైస్కూల్లో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా యువతీ యువకులకు విద్యార్థుల కోసం జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని యువతి, యువకులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 60కి పైగా కంపెనీలు మేళాలో పాల్గొంటాయని తెలిపారు. కార్యక్రమం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని అభ్యర్థులు వచ్చేటప్పుడు తమ ధ్రువపత్రాలు వెంట తీసుకొని సకాలంలో రావాలని కోరారు.

# సంకల్పయాత్రను విజయవంతం చేయండి



**మణుగూరు, విశాలభారతి :**ఆదివారం నాడు నిర్వహించనున్న విజయ సంకల్పయాత్రలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ సభను విజయవంతం చేయాలని మాజీ శాసనసభ్యులు పార్లమెంట్ క్లస్టర్ ఇంచార్జ్ మార్తినేని ధర్మ రావు పిలుపునిచ్చారు. మణుగూరు పట్టణంలో భారతీయ జనతా పార్టీ పట్టణ కార్యాలయం నందు ముఖ్య నాయకుల సమావేశంలో దిశా నిర్దేశం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం నాడు నిర్వహించనున్న విజయసంకల్పయాత్ర భద్రాచలంలో చత్తీస్గడ్ ముఖ్యమంత్రివర్యులు విష్ణు దేవ సాయి విజయ సంకల్ప బస్సు యాత్రను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ విజయ సంకల్పయాత్ర సారపాక మీదుగా ఇరవెండి, మొండికుంట, అశ్వాపురం మీదుగా సాయంత్రం నాలుగు గంటలకు అంబేద్కర్ సెంటర్చౌరస్తానందు రోడ్ షో నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ రోడ్ షో సభకు ముఖ్య అతిథి గాఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి సభకు విచ్చేస్తున్న సందర్భంగా నియోజకవర్గ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ సభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంపల సీతారామరాజు, మహబూబాబాద్ ముసుకు శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపాముల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెల దొంగలు అరెస్ట్

**110 గొర్రెల స్వాధీనం**




**నార్కట్ పల్లి, విశాలభారతి:** మండల కేంద్రంలో గతవారం గొర్రెలను దొంగిలించిన దొంగలను అరెస్టు చేయడం జరిగింది.నార్కట్పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం గ్రామ శివారులో గల గ్రీన్ సిటీ వెంచర్ పక్కన ఉన్న రేగట్ట భూపాల్ రెడ్డి యొక్క గొర్రెల షెడ్డు నుండి 11 లక్షల విలువగల 110 గొర్రెలను నిందితులు హైదరాబాద్ ఎల్బీనగర్ కు చెందిన పవన్ కళ్యాణ్, బాలాపూర్ కి చెందిన సయ్యద్ అజీమ్ లు ఫిబ్రవరి 15 వ తేది రోజు రాత్రి 12 గం.ల సమయంలో రెండు డీసీఎంలలో గొర్రెలను తీసుకొని పోయి హైదరాబాదులోని షరీఫ్ నగర్ లో దాచి ఉంచారు. కేసు నమోదు చేసుకున్న నార్కట్పల్లి పోలీసులు ఎస్సై అంతిరెడ్డి అధ్వర్యంలో దర్యాప్తు చేసి నిందితులను పట్టుకొని 110 గొర్రెలను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఇద్దరు నేరస్తులను రిమాండ్ నిమిత్తం నల్లగొండ కోర్టులో హాజరు పరచనున్నట్టు ఎస్సై అంతిరెడ్డి తెలిపారు.





# గంగా భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠ.

**విశాలభారతి,కీసర:** చిర్యాల్ గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ గంగా భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనునట్లు చీర్యల్ శ్రీ లక్ష్మి నృసింహ్మా ఆలయ చైర్మన్ మల్లరపు లక్ష్మీ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ లక్ష్మి నారాయణ మాట్లాడుతూ ఈ నెల 26 వ తేదీన నుండి వచ్చే నెల 1 వ తేది వరకు ఈ ఆలయ ప్రతిష్ట కార్యక్రమాలు ఈ విధంగా ఉంటాయి అని తెలిపారు. సోమవారం ఉదయం 9.15 నిలకు మంగళవాయిద్యం,గణపతిపూజ,గోపూజ,పుణ్యాహవాచనం పంచగవ్యం,యంత్రమార్జనలు, యాగశాల ప్రవేశం,త్రిశూల పూజ, తీర్థప్రసాదాలు జరగనున్నాయి.సాయంకాలం 5.30 నిలకు మృత్సంగ్రహణ, అంకురార్పణ,అగ్ని మధనం,అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణ,నీరాజన మంత్ర పుష్పాలు జరగనున్నాయి.మంగళవారము ఉదయం 8.30 నిలకు గవ్యంత పూజలు,వాస్తుపూజ,పర్యగ్నికరణం,జలాధివాసం,ప్రధాన దేవతా హోమాలు,నీరాజన తీర్థప్రసాదాలు సాయంకాలం గం 5.30 నిలకు మండపార్చన,అవాహిత దేవతా హోమాలు,వాస్తుహోమం,రుద్రార్చన,నీరాజన మంత్రపుష్పాలు, తీర్థప్రసాదాలు నిర్వహించబడుతయి అని అన్నారు.బుధవారం ఉదయం 8.30 నిలకు గవ్యాంతపూజలు, చండీ పారాయణం,చండీ హోమం,విశేష రుద్ర హోమం,అవాహిత దేవతా మూల మంత్ర హోమాలు, ధాన్యదివాసం సాయంకాలం 5.30 నిలకు ఉదక శాంతి, దిశహోమాలు,శాంతి హోమాలు,జప తర్పణాలు, తీర్థప్రసాదాలు వితరణ చేయబడును అని అన్నారు.గురువారము ఉదయం 8.30 నిలకు గవ్యాంతపూజలు,ఏకాదశ రుద్రాభిషేకం,గ్రామప్రదక్షిణ, వాస్తు బలి,నవగ్రహ హోమాలు,మూలమంత్ర హోమాలు,తీర్థప్రసాదాలు సాయంకాలం 5.30 నిలకు శాలార్చన,మండపదేవత అర్చన,జపహోమాలు,శాలాంగ దేవత హోమాలు, పంచశయాదివాసం,చతుర్వేద పారాయణం,మంత్ర పుష్పం, తీర్థప్రదాలు భక్తులకు వితరణ కార్యక్రమం ఉంటుంది అని అన్నారు.శుక్రవారము ఉదయం 7.00లకు గవ్యాంతపూజలు, గర్తన్యాసం,యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన,మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం,త్రిశూల స్నానం, పార్వతీ పరమేశ్వర శాంతికల్యాణం,ఆశీర్వచనం, పండిత సన్మానం తీర్థప్రసాదాలు వితరణ కార్యక్రమం జరుపబడును.అనంతరం భక్తులకు స్వామి వారిని దర్శనం చేసుకునే విధంగా తగిన ఏర్పాట్లు చేయనున్నము అని అన్నారు.ముఖ్యంగా ఈ ఐదు రోజులు మధ్యాహ్నం సమయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుంది అని తెలిపారు.శ్రీ శ్రీ శ్రీ గంగా భ్రమాంబికా సమేత మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ చైర్మన్ కోరారు.



# మిత్రునికి ఆర్థికసాయం

**చిట్యాల, విశాలభారతి:** ఆపదలో ఉన్న తన స్నేహితుని కి మేము ఉన్నాం అంటూ అందరూ కలిసి ఆర్థిక సహాయం అందజేసారు తోటి మిత్రులు. చిట్యాల మండలం వేంబాయి గ్రామానికి చెందిన గునగంటి వెంకటేష్ కు కొంతకాలంగా లివర్ సమస్యతో బాధపడుతున్నారు. డాక్టర్లని సంప్రదించగా లివర్ మార్పిడి చేయాలని చెప్పటంతో అతని కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో చికిత్స కోసం అయ్యే కుటుంబానికి ఆర్థిక బారంగా మారింది. విషయం తెలుసుకున్న వెంకటేశ్ తో పాటు 10 తరగతి (19941995) చదువుకున్న చిన్ననాటి స్నేహితులు అతని ఆరోగ్యం బాగుండాలని చికిత్స నిమిత్తం 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసి అధైర్య పడవద్దని అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో మందుగుల వెంకటేష్, కుంభం శ్రీను, సాగర్ల నరసింహ, గురుజ లింగయ్య, ఉయ్యాల పాండు, సుజాత, కవిత, రూప,తదితరులు పాల్గొన్నారు.




# రాజకీయంగా బలోపేతం కావాలి

**మాజీ చాంద్రయాన్ గుట్ట కార్పొరేటర్ అంజతుల్లా ఖాన్**

**మరిపెడ, విశాలభారతి:** మైనార్టీలు రాజకీయంగా బలోపేతం కావాలని, అంతా కలిసి ఏకతాటిపై ఉంటూ తమ హక్కుల సాధనకు, దేశంలో తమ ఉనికిని కాపాడుకునేందుకు కృషి చేయాలని మజ్లిస్ బజావో తెహరిక్ పార్టీ (ఎంబీటీ) చీఫ్ జనాబ్ అంజతుల్లా ఖాన్ సూచించారు. శనివారం ఆయన ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఓ కార్యక్రమానికి వెళ్తూ మార్గమధ్యంలో మరిపెడ మండల కేంద్రలోని మదర్స ఏ ఇస్లామీయ రౌజతుల్ బనాత్ బాలికల మదర్సా ను సందర్శించి మైనార్టీలను ఉద్దేశించి మాట్లాడారు. దేశంలో మైనార్టీల పట్ల ఏర్పడుతున్న పరిస్థితుల గురించి వివరించారు. అన్ని వర్గాల వారు అన్ని రంగాల్లో తమ తమ ఉనికిని చాటుతూ ముందుకు సాగుతున్నారని, కానీ ముస్లిం మైనార్టీలు కొన్ని రంగాలకే పరిమితమవుతున్నారన్నారు. వ్యవస్థలోని చట్టసభల్లో, ప్రాదేశిక సభల్లో, చిన్న, పెద్ద పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో మైనార్టీలు రాజకీయంగా బలోపేతం కావాలని, రాజ్యాధికారం ద్వారానే మైనార్టీల సమగ్ర అభ్యున్నతి సాధ్యపడుతుందన్నారు. అదే విధంగా నేటి సాంకేతిక యుగంలో మైనార్టీల పట్ల పెరుగుతున్న వివక్షనుంచి భద్రత కల్పించుకోవటానికి, తమ వర్గాన్ని కాపాడుకోవటానికి న్యాయ వ్యవస్థ, చట్ట వ్యవస్థపై పూర్తి అవగాహన అవసరమని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక ఇంటి నుంచి న్యాయ శాఖ వైపు ఓ విద్యార్తి దృష్టి సారించాలన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో, తెలంగాణ ఉద్యమ సమయంలో మైనార్టీలు ముందు వరుసలో ఉండి పోరాడారని, స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో ముస్లింలు ప్రాణ త్యాగం చేశారని గుర్తు చేశారు. అదే విధంగా తెలంగాణ ఉద్యమ సమయంలో హైదరాబాద్ నుంచి కన్నా రూరల్ ప్రాంత మైనార్టీలు తెలంగాణ ఏర్పాటుకు పోరాడారని గుర్తు చేశారు. నేడు అదే ఉద్యమ స్ఫూర్తితో చట్టసభల్లో మైనార్టీలకు సముచిత న్యాయం లభించేవరకు పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ యూత్ లీడర్ అఫ్ఫాన్ ఉల్లా ఖాన్, మదర్స ఏ ఇస్లామీయ రౌజతుల్ బనాత్ బాలికల మదర్సా ప్రిన్సిపల్ మౌలానా సాధిక్,వైస్ ప్రిన్సిపాల్ సాజిద్,హుస్సేమీ, ఉపాధ్యాయుడు మౌలానా అబ్దుల్ జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి

**తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే**



**సూర్యాపేట, విశాలభారతి:** న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కోర్టు ప్రాంగణంలో రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును, కోర్టు ప్రాంగణంలో ఈసేవా కేంద్రాన్ని ప్రారంబించి మాట్లాడారు. న్యాయవాదులు ఎదుర్కొంటున్న మౌళిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. మౌళిక సదుపాయాల కల్పనకు తగిన ప్రాదాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యాక్రమం లో జస్టిస్ టి. వినోద్ కుమార్, జస్టీస్ కె. లక్ష్మణ్, జస్టిస్ బి. లక్ష్మణ్, జస్టిస్ పుల్లాకార్తిక్ న్యాయమూర్తులను శాలువాలతో, మెమోంటోలతో సత్కరించారు. అంతకముందు కోర్టులో పోలీస్ గౌరవవందనం స్వీకరించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ డిస్ట్రిక్ జడ్జి జి. రాజగోపాల్, సీనియర్ సివిల్ జడ్జీ పి. శ్రీవాణి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

**నేరేడుచర్ల, విశాలభారతి:** మండల పరిధిలోని పినాకిల్ స్కూల్లో శనివారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా రాజకీయ నాయకులకు వ్యవహరించారు. డిప్యూటీ సీఎం గా ఎండి.అఫ్రోజ్, ప్రిన్సిపాల్ గా కే. భువన, తెలుగు ఉపాధ్యాయరాలుగా ఎండి ఇస్రాత్, పిటిగా కే మణికంఠ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మదర్ సార్ ,శంకర్ ,జానీ, విజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# అనఘాష్టమి వ్రతం ఎంతో పవిత్ర మైనద

**ప్రతి పౌర్ణమి రోజున అన్నప్రసాద వితరణ**

**సూర్యాపేట, విశాలభారతి:** అనఘష్టమి వ్రతం ఎంతో పవిత్రమైనదని శ్రీ దత్తాత్రేయ మందిర నిర్వాహకులు రేగట్టే లింగయ్య తెలిపారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కాశీంపేటలో నూతనంగా నిర్మించిన శ్రీ దత్తాత్రేయ మందిరంలో అనఘాష్టమి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూలోకంలో శ్రీ మహావిష్ణువు అంశయైన శ్రీ దత్తాత్రేయ స్వామి స్వయంగా ఆచరించిన పవిత్రమైన వ్రతం అనఘాష్టమి వ్రతం అని అన్నారు. ఈ వ్రతం ఆచరించడం వల్ల తెలియక చేసిన పాపాలు తొలగిపోవడమే కాకుండా, సుఖ సంతోషాలతో ఉంటారని తెలిపారు. వివాహం కాని వారు, సంతానం లేని వారు, గురు బలం లేని వారు ఈ వ్రతం చేయడం శుభాలు కడుగుతాయన్నారు. అంతేకాకుండా అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో తులతూగుతారని తెలిపారు .ప్రతి పౌర్ణమి రోజున ఈ వ్రతాన్ని భక్తుల సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మే నెల మూడో తారీకు వరకు దేవాలయం ప్రతిష్టించి సంవత్సరం కాలం పూర్తవుతుందని తెలిపారు. దేవాలయంలో ప్రహరీ గోడ, గ్రానైట్ బండల తో పాటు భక్తులకు మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టనున్నందున భక్తులు విరాళములు అందించి సహకరించాలని తెలిపారు .ఈ కార్యక్రమంలో శ్రీ దత్తాత్రేయ భక్త బృందం నీరుడు వెంకటరత్నం, నీలం వెంకట రాములు, ఐతరాజు లింగయ్య, చిరుపంగి సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.



# శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి**

**సూర్యాపేట, విశాలభారతి:** నిరుద్యోగ యువత మెడికల్ కోడింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కుడ కుడ రోడ్డులో మెడ్ సోల్ మెడికల్ కోడింగ్ సొల్యూషన్స్ శిక్షణ సంస్థను ఆయన ప్రారంభించి మాట్లాడారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఉద్యోగాల కోసం వెతుకులాడటంతో పాటు ఇలాంటి శిక్షణ సంస్థలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందాలన్నారు. మెడిసోల్ మెడికల్ కోడింగ్ సంస్థ డైరెక్టర్ మాచర్ల కిరణ్ మాట్లాడుతూ మెడికల్ కోడి శిక్షణకు డిగ్రీ అపైన చదివిన విద్యార్థులు ఈ శిక్షణకు అర్హులుగా పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు మెడికల్ కోడింగ్ లో శిక్షణ తీసుకుంటే హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు వేముల కొండ పద్మ, ఎలిమినేటి అభినయ్, కాంగ్రెస్ నాయకులు పంతంగి దశరథ, చింతమళ్ళ రమేష్,కొండపల్లి దిలీప్ రెడ్డి,చెంచల నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



# 'సరిపోదా శనివారం' టీజర్ రిలీజ్

నేచురల్ స్టార్ నాని, టాలెంటెడ్ డైరెక్టర్ వివేక్ ఆత్రేయ సెకండ్ కొలాబరేషన్ లో రాబోతున్న పాన్ ఇండియా ఫిల్మ్ 'సరిపోదా శనివారం'. 'అంటే సుందరానికీ' చిత్రంలో నాని సాఫ్ట్ పాత్రలో కనిపించగా, ఈ చిత్రంలో మునుపెన్నడూ లేని యాక్షన్‌ప్యాక్డ్ క్యారెక్టర్‌లో ఆశ్చర్యపరచబోతున్నారు. డివివి ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి భారీ బడ్జెట్ తో భారీ కాన్వాస్‌తో ఈ ప్రాజెక్ట్‌ని నిర్మిస్తున్నారు. నానికి బర్త్ డే విషెస్ తెలుపుతూ మేకర్స్ టీజర్‌ను విడుదల చేశారు. నాని పాత్ర ప్రత్యేక స్వభావాన్ని సూచించే SJ సూర్య వాయిస్‌ఓవర్‌తో టీజర్ ప్రారంభమైంది, అతని పాత్ర పేరు సూర్య. ప్రతి మనిషిలాగే, హీరోకి కూడా కోపం వస్తుంది, కానీ అతను దానిని ప్రతిరోజూ చూపించడు. అతనిలో ఉన్న ప్రత్యేకత ఏమిటంటే, అతను జరిగిన సంఘటనలన్నింటినీ పేపర్‌పై వ్రాసి, శనివారాల్లో తనను ఇబ్బంది పెట్టేవారిని వేటాడడం ప్రారంభిస్తాడు. ఈ గ్లింప్స్ పోలీసుగా కనిపించిన SJ సూర్య, నాని పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలపడంతో ముగుస్తుంది. మొదటి నుంచి వివేక్ ఆత్రేయ తనదైన కాన్సెప్ట్‌లతో సినిమాలు చేస్తూ తనదైన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఇప్పుడు తొలిసారిగా పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్ చేస్తున్నారు. నాని క్యారెక్టర్‌ని ప్రెజెంట్ చేసిన విధానం, టీజర్‌ని కట్ చేసిన విధానం ఆకట్టుకున్నాయి. నాని క్యారెక్టర్ డిజైన్ చాలా ఫ్రెష్ గా ఉంది. అతను రగ్గడ్, స్టైలిష్ లుక్‌లో కనిపించారు. టీజర్‌లో డైలాగ్స్ లేకపోయినా అతని స్క్రీన్ ప్రెజెన్స్ అద్భుతంగా ఉంది. నానిలోని మాస్ డిస్ట్రాక్టివ్ ఎనర్జీ అందరినీ ఉర్రూతలూగిస్తుంది. అతను సిగరెట్ తాగే విధానం పాత్రకు డైనమిజాన్ని తీసుకొచ్చింది. వెనుక సీటులో అజయ్ ఘోష్ కూర్చొని వుండగా రిక్షా తొక్కే సన్నివేశం చాలా ఎట్రాక్టివ్ గా వుంది. యాక్షన్ బ్లాక్‌లు ఇంటెన్స్ గా వున్నాయి.



# భీమా పవర్ ప్యాక్డ్ ట్రైలర్ గ్రాండ్ గా లాంచ్

మాచో హీరో గోపీచంద్ యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ భీమా ఈ సీజన్‌లో చాలా మంది ఎదురుచూస్తున్న సినిమాలలో ఒకటి. ఈ సినిమాకి ఎ హర్ష దర్శకత్వం వహిస్తున్నారు, శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె కె రాధామోహన్ లావిష్ గా నిర్మించారు. టీజర్ నుంచి పాటల వరకు సినిమాకు సంబంధించిన ప్రతి ప్రోమోకు అన్ని వైపులా నుంచి చాలా మంచి స్పందన వచ్చింది. రిలీజ్ డేట్ ఎంతో దూరంలో లేకపోవడంతో మేకర్స్ ప్రమోషన్స్ లో జోస్ పెంచారు. సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను గ్రాండ్ గా చేశారు. సినిమాలోని ఆధ్యాత్మిక కోణాన్ని చూపిస్తూ ట్రైలర్ అద్భుతంగా ఓపెన్ అవుతుంది. ట్రైలర్‌లో గోపీచంద్‌లోని మరో పాత్రను కూడా చాలా అద్భుతంగా పరిచయం చేశారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో మాచో స్టార్ గోపీచంద్ మాట్లాడుతూ.. అభిమానులతో కలసి ట్రైలర్ చూడటం చాలా అనందంగా వుంది. నేను ప్రేక్షకులతో పాటే ట్రైలర్ చూశాను. చాలా అద్భుతంగా అనిపించింది. దర్శకుడు హర్ష కథ చెప్పినప్పుడు ఎంత బాగా చెప్పాడో అంత బాగా తీశాడు. ఎక్స్‌ట్రార్డినరీగా కథని తెరపైకి తీసుకొచ్చాడు. హర్ష కన్నడలో చాలా మంచి దర్శకుడు. ఈ సినిమాతో తెలుగులో కూడా మంచి పేరు తెచ్చుకుంటాడు. ఈ సినిమా మెటిరిలైజ్ అవ్వడానికి శ్రీధర్ గారు కారణం. మంచి కథని, దర్శకుడిని నాకు పరిచయం ఆయనకి థాంక్స్. ఈ కథని ఇంత అద్భుతంగా రూపొందించడానికి కారణం నిర్మాత రాధమోహన్ గారు. ఆర్ట్ డైరెక్టర్ చాలా అద్భుతమైన సెట్స్ వేశారు. నరేష్ గారితో చాలా రోజుల తర్వాత వర్క్ చేశాను. మా మధ్య వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తారు. చాలా బాగా వచ్చాయి. రఘు బాబు అన్నయ్యతో చాలా సినిమాలు చేశాను. ఇందులో కూడా మా మధ్య సీన్స్ అలరిస్తాయి. ఈ సినిమాకి పని చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు. భీమా మార్చి 8న మహా శివరాత్రి రోజున విడుదలౌతుంది. తప్పకుండా అందరూ థియేటర్స్ లో చూడండి. చాలా మంచి సినిమా ఇది. తప్పకుండా అందరూ ఎంజాయ్ చేస్తారు' అన్నారు.

# సుందరం మాస్టర్ ప్రేక్షకుల విజయం

## హీరో హర్ష చెముడు



ఆర్ టీ టీం వర్క్స్, గోల్ డెన్ మీడియా పతాకాలపై మాస్ మహారాజా రవితేజ, సుధీర్ కుమార్ కుర్రు నిర్మించిన చిత్రం 'సుందరం మాస్టర్'. ఈ చిత్రంలో హర్ష చెముడు, దివ్య శ్రీపాద ప్రధాన పాత్రలు పోషించారు. కళ్యాణ్ సంతోష్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఫిబ్రవరి 23న విడుదలైంది. ఈ చిత్రానికి ఆడియెన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చి పెద్ద విజయాన్ని సాధించింది. ఈ సందర్భంగా శనివారం నాడు చిత్రయూనిట్ సక్సెస్ మీట్‌ను నిర్వహించింది. ఈ ఈవెంట్‌లో హర్ష చెముడు మాట్లాడుతూ.. 'ఈ కథను విని మాకు సపోర్ట్ చేసిన రవితేజ గారికి థాంక్స్. ఈ చిత్రాన్ని నిర్మించిన సుధీర్ అన్నకు థాంక్స్. సంధ్యలో సినిమాను చూసి శ్రీ చరణ్ పాకాల ఇచ్చిన ఆర్ఆర్‌కు ఎమోషనల్ అయ్యాను. ఈ చిత్రం కోసం ప్రతీ ఒక్కరూ ప్రాణం పెట్టి పని చేశారు. సంధ్యలో హౌస్ ఫుల్ చూడటంతో నాకు సంతోషమేసింది. ఫస్ట్ హాఫ్ అంతా నవ్వులతో ఎంజాయ్ చేశారు. సెకండాఫ్ అలా ఎమోషనల్‌గా కనెక్ట్ అయి చూశారు. ప్రతీ ఒక్కరూ మా సినిమాకు కనెక్ట్ అయ్యారు. ఇంకా చాలా మందికి ఈ సినిమా రీచ్ అవ్వాలి. ఇది మన అందరి విజయం. ఇంత మంచి సక్సెస్ ఇచ్చిన ప్రేక్షకులకు థాంక్స్. ఇక మా టీం అంతా సక్సెస్ టూర్‌లో అందరినీ కలుస్తామ'ని అన్నారు. నిర్మాత సుధీర్ కుమార్ మాట్లాడుతూ.. 'సినిమా చూసి అందరూ కాల్స్, మెసెజ్‌లు చేస్తున్నారు. రేపటి నుంచి సక్సెస్ టూర్ పెట్టి ప్రతీ ఊరుకి వెళ్లాలని అనుకుంటున్నాం. జనాల నుంచి ఇంత రెస్పాన్స్ వస్తుందని ఊహించలేదు' అని అన్నారు.

# ముత్యాల డ్రెస్ లో అందాల ప్రగ్యా

కంచె సినిమా తో మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కి జోడీగా నటించిన ముద్దుగుమ్మ ప్రగ్యా జైస్వాల్. ఈ అమ్మడు తెలుగు లో నటించిన సినిమాలు కొన్నే అయినా కూడా మంచి గుర్తింపు దక్కించుకుంది. సోషల్ మీడియాలో అందాల ఫోటో షూట్స్ ను షేర్ చేయడం ద్వారా మంచి ఫాలోయింగ్ ను సొంతం చేసుకుంది. ప్రగ్యా జైస్వాల్ స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు దక్కించుకోలేక పోయింది. అయినా కూడా ఆ స్థాయిలోనే నెట్టింట ఎప్పటికప్పుడు వైరల్ అవుతూనే ఉంది. తాజాగా మరోసారి సోషల్ మీడియాలో ఈ అమ్మడు అందాల ఫోటోలను షేర్ చేసి ఆకట్టుకుంది. ముత్యాలను అల్లినట్టు ఈ అమ్మడి డ్రెస్ ఉంది. క్లీ వేజ్ షో తో పాటు నడుము అందం చూపిస్తూ ఈ అమ్మడు షేర్ చేసిన ఈ ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. బాడీ గోల్డెన్ కలర్‌కు తగ్గట్లుగా డ్రెస్ కూడా ఆకట్టుకునే విధంగా ఉందంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. నడుము నాభి అందాలతో ప్రతి సారి కూడా కవ్విస్తూ ఉండే ఈ అమ్మడు మళ్లీ ఈ ఫోటోలో కూడా నడుము అందం తో చూపు తిప్పకోనివ్వడం లేదు. ప్రగ్యా ఇంత అందంగా ఉన్నా కూడా అదృష్టం కలిసి రాకపోవడంతో పాపం ఇండస్ట్రీలో ఎక్కువ ఆఫర్లు రాలేదు. ముందు ముందు అయినా ఈ అమ్మడు సినిమాలతో బిజీ అవ్వాలని ఫ్యాన్స్ మరియు ప్రేక్షకులు కోరుకుంటున్నారు. ప్రస్తుతం ఈ అమ్మడు చేస్తున్న సినిమాలు పెద్దగా లేవు. అయితే వెబ్ సిరీస్ ల్లో ఈ అమ్మడికి ఆఫర్లు వస్తున్నట్లుగా సమాచారం అందుతోంది.





# 'గామి' నుంచి క్వెస్ట్ సాంగ్ 'గమ్యాన్నే' విడుదల

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మోస్ట్ ఎవెయిటింగ్ మూవీ 'గామి' ప్రచార కార్యక్రమాలు జోరందుకున్నాయి. ఇప్పటికే ఫస్ట్‌లుక్, క్యారెక్టర్ పోస్టర్స్‌తో పాటు చిన్న టీజర్‌ని కూడా విడుదల చేశారు. ఇప్పుడు, మ్యూజికల్ జర్నీ టైం. మేకర్స్ ఫస్ట్ సింగిల్ గమ్యాన్నే పాటని విడుదల చేశారు. స్వీకర్ అగస్తీ స్కోర్ చేసిన 'గమ్యాన్నే' అఘోరా పాత్రలో నటించిన విశ్వక్ సేన్ తన వ్యాధికి మందు వెతకాలనే తపనతో కూడిన అన్వేషణకి సంబధించిన పాట. అతని వద్ద రూట్ మ్యాప్ ఉంది, నివారణను కనుగొనడానికి ఇది సాహసోపేతమైన ప్రయాణం. తనకి మానవ స్పర్శను అనుభవించలేని అరుదైన వ్యాధి వుంది. సనాపతి భరద్వాజ్ పాత్రుడు సాహిత్యం ఆకట్టుకుంది. ఈ పాట వాస్తవానికి వ్యాధి కారణంగా అతను పడే బాధను చూపుతుంది. సుగుణమ్మ, అనురాగ్ కులకర్ణి, స్వీకర్ అగస్తీల అద్భుత గానం మరింత ఆకర్షణీయంగా వుంది. ఈ పాట ప్రయాణాన్ని చాలా ప్రభావవంతంగా వివరిస్తుంది, విశ్వక్ సేన్ భావోద్వేగాలను అద్భుతంగా పండించారు. హాంటింగ్ ఎఫెక్ట్ ఉన్న ఈ పాటను థియేటర్లలో చూసినప్పుడు మరింత ఎఫెక్టివ్ గా వుంటుంది.

# స్టైలిష్ లుక్కులో మంచు లక్ష్మి

మంచు మోహన్ బాబు డాటర్ మంచు లక్ష్మి ఇటీవల హైదరాబాద్ నుంచి ముంబయికి షిఫ్ట్ అయిన విషయం తెలిసిందే. నిర్మాతగా, ఆర్టిస్ట్ గా టాలీవుడ్ లో దూసుకెళ్తున్న ఈ అమ్మడు.. గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో సందడి చేస్తోంది. రకరకాల డ్రెస్సుల్లో పోజులు ఇస్తూ మైమరిపిస్తోంది. ముంబయి వెళ్లినప్పటి నుంచి ఫుల్ స్కిన్ షో చేస్తోంది. ఉత్తరాదికి వెళ్లి ఒక్కసారిగా గ్లామర్ డోస్ పెంచేసింది. తగ్గేదే లే అంటూ ప్రజెంట్ హీరోయిన్లకు పోటీగా గ్లామరస్ పోజులు ఇస్తోంది. అందాల ఆరబోతలో దూసుకుపోతోంది. నాలుగు పదుల వయసులో కూడా నెట్టింట సెగలు పుట్టిస్తోంది. ఎప్పటికప్పుడు ఫ్యామిలీ అప్డేట్స్ తోపాటు సమాజంలో జరుగుతున్న వివిధ విషయాలపై స్పందిస్తుంటోంది. పార్టీలు, ఫారిన్ లో చిల్ అయిన ఫొటోలను పోస్ట్ చేస్తుంటుంది. కెరీర్ అప్డేట్స్ కూడా ఇస్తూ ఫ్యాన్స్ తో ఫుల్ గా టచ్ లో ఉంటోంది. తాజాగా స్టైలిష్ ఫొటోలను పోస్ట్ చేసింది మంచు లక్ష్మి. వెడ్డింగ్ సీజన్ లో పర్ఫెక్ట్ మెహెందీ లుక్ అంటూ ఇటీవల ఎల్లో కలర్ డ్రెస్ లో దిగిన ఫొటోలను షేర్ చేసిన ఈ అమ్మడు.. ఇప్పుడు సంగీత్ పిక్స్ అంటూ పంచుకుంది. గ్రే కలర్ ట్రెండీ ఔట్ ఫిట్ లో అందాలు ఆరబోసింది. ఫ్లోరల్ కోట్ వేసుకుని కొంటె చూపులతో ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. పిక్స్ వేరే లెవెల్ లో ఉన్నాయని ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు. కలెక్షన్ కింగ్ మోహన్ బాబు వారసురాలిగా టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది మంచు లక్ష్మి. హీరోయిన్గా, విలన్ గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, టీవీ యాంకర్ గా, నిర్మాతగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది ఈ బ్యూటీ. ఓ వైపు మూవీలు చేస్తూనే, ఇంకోవైపు ఛాన్సులు వస్తే వెబ్ సిరీసులు కూడా చేస్తూ అలరిస్తోంది. ఇటీవల కొత్త కెరీర్ ను మొదలుపెట్టడానికి బీటౌన్ ముంబయికి వెళ్లిపోయింది. హిందీలో ఆడిషన్స్ ఇవ్వడానికి కూడా రెడీ అంటూ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పింది.





# ముఖ్య గమనిక చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు

## :- దర్శకుడు వేణు మురళీధర్. వి

శివిన్ ప్రొడక్షన్ పతాకంపై రాజశేఖర్, సాయి కృష్ణ సంయుక్తంగా నిర్మించిన చిత్రం ముఖ్యగమనిక. వేణు మురళీధర్. వి. దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో అల్లు అర్జున్ కజిన్ విరాన్ ముత్తంశెట్టి, లావణ్య సాహుకార జంటగా నటించారు. మిగతా పాత్రల్లో చిత్రం భాషా, ఆర్యన్ కృష్ణన్ తదితరులు నటించారు. ఈ చిత్రం సక్సెస్ మీట్ ను శనివారం నిర్వహించారు. ఈ సంధర్భంగా దర్శకుడు వేణు మురళీధర్. వి. మాట్లాడుతూ... సినిమా విడుదలై మంచి రెస్పాన్స్ వచ్చింది. కొత్త కాన్సెప్ట్ తో తీసినందుకు కొత్త డైరక్టర్ అయినా బాగా ఆదరిస్తున్నారు. కంటెంట్ బాగుంటే తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారని మరొసారి రుజువైంది. అందుకే సీడెడ్ లాంటి చోట్ల థియేటర్స్ ను పెంచుతున్నాం. ఇది నాడెబ్యు మూవీ. గతంలో ఈగ అసిస్టెంట్ కెమెరా మెన్, బాహుబలికి సెంథిల్ దగ్గర చీఫ్ అసోసియేట్ గా చేశా. గత 16 ఏళ్లుగా సినీ పరిశ్రమలో వివిధ సినిమాలకి సినిమాటోగ్రాఫర్ పని చేశా. ఈ చిత్ర హీరో విరాన్ ఎంతో సహకరించారు. తొలి చిత్రం అయినా బాగా నటించారు. నన్ను ఈ సినిమాకి దర్శకుడిని చేసిన మా నిర్మాతలు రాజశేఖర్, సాయి కృష్ణ లకు ధన్యవాదాలు. నిర్మాతలు రాజశేఖర్, సాయి కృష్ణ మాట్లాడుతూ... మా శివిన్ ప్రొడక్షన్ బ్యానర్ లో వచ్చిన తొలి సినిమా ఇది. మంచి కంటెంట్ వున్న సినిమా ఇది. మంచి అప్లాజ్ వస్తోంది. తొలి సినిమానే అయినా దర్శకుడు వేణు మురళీధర్ చాలా బాగా తీశారు. ఇక నుంచి మా బ్యానర్ లో ప్రతి సంవత్సరం ఒక సినిమా వస్తుంది. ఈ సినిమా ఇంత బాగ రావడానికి సహకరించిన టీమ్ మొత్తానికి కృతజ్ఞతలు. హీరోకి ధన్యవాదాలు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.